Reprint
Nov. 1945

Pattabhi Rama Press,
Ellore.

విషయసూచిక.



ఓమ్.

శ్రీ విఘ్నేశ్వరాయ నమః.

యదువంశము.

౧

పూర్వము నహుషుండను మహీకాంతుడు నూరు యజ్ఞముల నొనర్చి సురలోకాధిపత్యమును బొందెను. కాని కొండొక కారణంబున నగస్త్యమహాముని శాపోపహతుండై యాతండు మానుషరూపంబును గోలుపోయెను. నహుషునకు యతియు, యయాతియు, సంయాతియు, నాయాతియు, వియతియుఁ, గృతియు నను నార్వురు కొడుకులుండిరి. తండ్రి యనంతరము పెద్దకుమారుండగు యతి రాజ్యమునకు వచ్చెను.

యయాతి.

కాని యాతండు రాజ్యంబు సకలపాపంబులకు మూలంబనియు, దానివలన దేహికిఁ బునర్జన్మంబు సిద్ధంబనియుఁ దలంచి రాజ్యంబును విడనాడి యోగివృత్తి నవలంబించెను. అన్నయుఁ దండ్రియు

నీవిధముగా నగుటవలన యయాతి రాజ్యభారమును వహించెను. ఈతఁడు మొదటినుండియు సత్ప్రవర్తనము గలవాఁడు. రాజధర్మమును జక్కఁగాఁ నెఱింగినవాఁడు. ఎల్లప్పుడు వినయ విధేయతలతోఁ పెద్దలయందు వర్తించుచుండెడివాఁడు. ఇట్టి శుభగుణసంపత్సమేతుఁడగు యయాతి రాజ్యమునకు వచ్చి, నప్పటినుండియు రాష్ట్రమునఁ గల ప్రజలందఱును సర్వశుభములతో విరాజిల్లుచుండిరి.

యయాతి సుక్షత్రియ సంజాతుఁడై యున్నను గర్మవశమున బ్రహ్మవంశసంజనితయగు దేవయానిఁ బరిణయమయ్యెను. దేవయాని, దైత్యగురుండును, క్షత్రియ ధర్మ విజ్ఞాన పరిపూర్ణుండును, శాపానుగ్రహసమర్థుండును నగు శుక్రాచార్యునకు ముద్దుపట్టియై యుండెను. తేజోనిధియగు భార్గవుని పుత్రికయైన దేవయాని, దేవగురుండగు బృహస్పతి కుమారుఁడైన కచుని శాపంబునఁజేసి యయాతిని పెండ్లియాడవలసిన దయ్యెను. శుక్రుండును బుత్రికాభిప్రాయానుసారము యయాతికి

దేవయాని.

నామె నిచ్చి వివాహ మొనర్చెను. కాని వివాహసమయమున నగ్నిసాక్షిగాఁ జైకొన్న పత్నితోఁగాక, పరకాంతలతో సంభోగింపకుండునట్లుగను, దేవయానియందే సర్వవిధకామోపభోగంబు లనుభవించునట్లుగను శుక్రుండు యయాతివలన

ప్రతిజ్ఞ సేయించెను. నాటనుండియు, యయాతి ప్రతిజ్ఞాభంగము వాటిల్లకుండ నేకపత్నీవ్రతమును సలుపుచు, దేవయాని వలన యదువు, తుర్వసుఁడు నను నిరువురు కుమారులఁ బడసి ప్రజారంజకంబుగా రాజ్యపరిపాలన మొనర్చుచుండెను.

దేవయానికి శర్మిష్ఠయను నొక చెలికత్తెయుండెను ఈమె వృషపర్వుఁడను దానవేంద్రుని పుత్రిక. కాని తమ గురుపుత్రికయైన దేవయాని నామె యవమానించియుండుట వలన శుక్రుండు వృషపర్వునిపైఁ గోపించి, నిజకుమారికాపరాభవప్రతీకారమునకై యాతని పుత్రికను దేవయానికిఁ బరిచారికగా నొసంగవలయుననియు, లేకున్న శాపబలంబునఁ దానతని వంశచ్ఛేద మొనర్చువాఁడనియుఁ దెలియఁజేయ వృషపర్వుండు భయపడి, తనపుత్రికను బరిచారికాసహితంబుగ దేవయానికిఁ బరిచారికగా నొసంగెను. దేవ

శర్మిష్ఠ.

యాని యయాతినిఁ బెండ్లియాడి నప్పటి నుండియు శర్మిష్ఠ యామెను గొల్చుచు యయాతి యందు బద్ధానురాగముగలదై యుండెను. సహజముగ రాజకుమారికయగుటవలన శర్మిష్ఠ దేవయానికంటెను జక్కనిదై యుండెను. చక్కదనమునకుఁ బరిపూర్ణమైన యావనము తోడైయుండెను. ఇట్లుండఁగా నొకనాఁడు దేవయాని లేని సమయముఁ గనిపెట్టి శర్మిష్ఠ యయాతికిఁ దన చిత్తము నెఱిం

గించెను. ఆతఁడును నామె మనోహరరూపలావణ్యాతిశయంబు లకు లోఁబడి, తాను గైకొన్న ప్రతిజ్ఞను మఱచి నాట నుండి యామెతో రహస్య సంభోగమున మెలంగఁజొచ్చెను. కాలవశంబునఁ గ్రమముగా శర్మిష్ఠ గర్భంబును ధరించి ద్రుహ్యుండు, ననువుఁ బూరువు నను మువ్వురు తనయులఁ గాంచెను. అప్పుడు దేవయానికిఁ గల రూపు సర్వముఁ దెలిసి పోయెను.

యయాతి సమయభంగ మొనర్చినందుకై దేవయాని మిక్కిలి కోపించి నాథుఁడు తన్నెంత బ్రతిమాలినను వినక తండ్రియైన శుక్రాచార్యునకు సర్వమును దెలియఁజేసెను. శుక్రుండు నాతని ప్రతిజ్ఞాభంగమునకు సహింపఁజాలక "నేటి నుండి ముదిమి నిన్నలముకొనుగాక" యని యయాతిని శపించెను. భార్గవశాపోపహతుండైన యయాతి కరుణింపవేయని శుక్రుని పాదంబులపైఁబడ నాతఁడు గొంత దయగలవాఁడై యతని కుమారులలో నెవ్వరికైనను దన ముదిమి నొసంగి, అట్టివాని యౌవనమును నతండు గైకొనిసుఖింపవచ్చు ననియు విషయేచ్ఛాసక్తి నశించిన యనంతరము తిరిగి యతని ముదిమిని నాతఁడు గైకొని, కుమారుని యౌవనమును గుమారున కొసంగవచ్చు ననియుఁ దెలియఁజెప్పెను. శుక్రుని వాక్యానుసారము

భార్గవ శాపము.

యయాతి కుమారుల నందఱిని రావించి నిజ జరాభారమును వహింపుఁడని కోరఁగా యదువు మొదలగు వారెవ్వరును నంగీకరింపకుండిరి. కాని శర్మిష్ఠ కనిష్ఠకుమారుఁడైన పూరువు మాత్రము తండ్రికోరిన ప్రకార మాతని ముదిమిని దాను గైకొని, తన యౌవనమును నాతని కొసంగెను. అప్పుడు చిన్నకుమారుని పితృభక్తికి యయాతి సంతసపడి యదువు మొదలగు తక్కిన కుమారులు రాజ్యభ్రష్టులగుదురనియు, వారియందు సుక్షత్రియత్వము నశించునని యు, యదు సంతతి వారందఱును క్షత్రియులుగాఁ బరిగణింపఁబడరనియుఁ, దుర్వసు వంశంబువారు ధర్మాధర్మ వివేకశూన్యులగు కిరాతులకు రాజు లగుదురనియు ద్రుహ్యు వంశంబువా రుడుపప్లవసంతార్యంబైన దేశంబులకుఁ బాలకు లగుదురనియు, ననువు వంశంబువారు ముదిమి దొఱకొను సంతవఱకు జీవింపక యౌవనంబుననే యకాల మరణంబునకు లోనగుదురనియు నీవిధముగా శపించి యంతంబునఁ బూరువునకు రాజ్యంబొసంగి, తన ముదిమిఁ దాను గైకొని తపోవృత్తి నవలంబించెను.

యయాతి కుమారులను శపించుట

యయాతి పెద్దకుమారుండగు యదువు వంశంబు వారందఱును, శాపగ్రస్తు లగుటవలనఁ దమ క్షత్రియత్వంబును గోలుపోయి నాటనుండి యాదవు లనఁబరగుచు

యదువంశము.

గోరక్షణతత్పరులై మెలఁగఁజొచ్చిరి. కానివీరి యందును శూరులైన వారు రాజ్యములను స్థాపించి ప్రజాపాలన మొనర్చియుండిరి. కాని సుక్షత్రియత్వమును గోలుపోయిన వారగుటవలన క్షత్రియు లెవ్వరును దమతో సమానులుగా యాదవులను గైకొన కుండిరి. ఇట్టి యదువంశమునకే భగవంతుఁడైన శ్రీకృష్ణుడు సంబంధించియుండెను.

యదువంశోద్భవుఁడగు శూరుఁడను ధారుణీనాథునకు మారీష యను కాంతారత్నమునందు వసుదేవుం డుదయించెను. వసుదేవుఁడు పుట్టిన వెంటనే యనిమిత్తముగ నెల్లెడల శుభసూచకములు పెక్కు గానంబడెను. ఇతఁడు సామాన్యమైన మానవజన్మమును ధరించినవాఁడు గాఁడు. తొలుఁదొల్త నీతాడు సుతపుఁడను ప్రజాపతియై యుండెను. అట్టి యెడ ననపత్యతవలన శ్రీహరిఁగూర్చి యితఁడు పెక్కు సంవత్సరములు తపంబొనర్ప హరియుఁ గరుణించి ప్రత్యక్షమై యేమికావలయునో కోరుకొమ్మని పలుకఁ బుత్రాను రాగంబుఁ బెంపున నక్షరంబగు మోక్షమును నాకాంక్షింపక సుతభిక్షుకై యామహామహునిఁ బ్రార్థించెను. శ్రీహరియు నాతని గుణశీలాదులకు మెచ్చినవాఁడై గానే యాతనికి మూఁడు జన్మంబుల యందుఁ బుత్రుండై పుట్టుదునని తెలియంజెప్పి యదృశ్యుండయ్యెను.

వసుదేవుని జన్మక్రమము.

అదే ప్రకారము మొదటిజన్మంబునఁ బృశ్నిగర్భుఁడను నర్భకుండుగను, రెండవ జన్మంబున నాతండు కశ్యపప్రజాపతియై యుండఁ దాను వామనుండుగను శ్రీహరి పుత్రుడై యాతనికి జన్మించియుండెనుమూడవజన్మంబున నీతడు వసుదేవుండను పేరునఁ బుట్టియుండ శ్రీహరియు నాతనికిఁ గృష్ణుండను పేరున

నుద్భవించి యిలాభారంబు వాపనుండెను. భగవంతుఁ డీతనికిఁ బుత్రుఁడై జన్మింపనుండెననియే వసుదేవుఁడు పుట్టిన సప్పుడనిమిత్తముగఁ బెక్కు శుభసూచకములు గానవచ్చెను.

వసుదేవుఁడు యుక్తవయస్సునందే రాజ్యభారంబును వహించి పెండ్లియాడున దేవకీదేవి యనుకన్యను భార్యగాఁ గైకొనెను. దేవకీదేవి దేవకుండను వాని పుత్రిక. దేవకుఁడు దానవనాథుఁడైన యుగ్రసేనునకు సహోదరుఁడు. ఉగ్రసేనునకుఁ గంసుఁడను కుమారుఁ డొకండుగలడు. కంసుఁడు దేవకినిఁ దోఁబుట్టిన దానిగాఁ బ్రేమించుచుండెడివాఁడు. వసుదేవునకీమె మొదటిజన్మంబున బృశ్నియను పేరునను, రెండవ జన్మంబున నదితియను పేరునను, నిప్పుడు దేవకీదేవియని పేరునను బత్నియయ్యెను. గతజన్మద్వయంబునందీమె శ్రీహరినిఁ బుత్రునిఁగాఁ బడసియుండెను. వసుదేవుండును బూర్వజన్మంబుల నీమె తనయెడలఁ జూపిన పతిభక్తి విశేషంబులకునలరి, మూడవ జన్మంబునను, నీమెయే తనకు సతి కావలయునని నోచినవాఁడగుటవలన నాప్రకారమే దేవకీదేవియాతనికిఁబత్నియయ్యెను. ఈ దేవకీవసుదేవులే యదువంశమునకు విఖ్యాతులై యుండిరి.

దేవకీదేవి జన్మక్రమము.

దేవకీదేవియందు మిక్కిలి మక్కువఁగల వాఁడగుటవలన నామె వివాహానంతరమునఁ జెల్లెలిని, మఱఁదిని, దగిన

విధంబున నరదంబున నిడుకొని కంసుఁడు కొనిపోవు చుండెను. కంసుని యం దాక్షిణ్యమువఱకు దుష్టబుద్ధి యనునది యొంత మాత్రమును లేదు. ఆతఁడు పుట్టుకవలన రక్కసుండేగాని వర్తనంబు వలన రక్కసుఁడు గాఁడు. అట్టి సాధుస్వభావము గలవాఁడగుటవలననే యొంతమాత్రమును గుటిలస్వాంతుఁడు గాక, తనచెలియలిని, బావను, సురక్షితముగాఁ గొనిపోవు చుండెను. కాని విధిమాత్రము కంసునకుఁ బ్రతికూలముగా నుండెను. ఆతఁడిట్లు సంతోషపారవశ్యంబున నొడలెఱుం

అశరీరవాణి పలుకు.

గక యరదంబును నడపుచుండ నశరీరవాణి యాతనిని సంబోధించి—కంసా!

కం॥ దుష్టయగు భగిని మెచ్చఁగ
నిష్టుఁడవై రథముగడపె • దెలుఁగవు మీఁదన్
శిష్టయగు నీతలోదరి
యష్టమగర్భంబు నిన్ను • హరియించుఁజుమీ!

అనిపలికెను.

అట్లశరీరవాణి పలికినపలుకులు సెవులకు ములుకులై సోకఁ దోకఁద్రొక్కిన త్రాచువలె బుసఁగొట్టుచు దిగ్గున నరదంబు డిగ్గనుఱికి, నిజప్రాణరక్షణ పరాయణుండై, చెల్లెలినిఁ గొప్పువట్టి పుడమికీడ్చి, యామెప్రాణంబులను గొనుటకై తన నిశితకరవాలమును బైకెత్తెను. ఆహా! స్వార్థపరాయణత్వ మెంత నీచమైనది? ఏకగర్భసంజనితులకుఁ గూడ నొకానొక

ప్పుడు విరోధంబును బొంపొందించునుగదా? నిజప్రాణరక్షణోద్యోగాసక్తసహోదరీ ప్రాణాపహరణ ప్రయత్నంబున నున్న కంసునిఁ గాంచి వసుదేవుఁడు భయపడినవాఁడై తేరు డిగ్గి యాతనిని సమీపించి 'బావా! ఇదేమియాగడము? ఎన్నఁడో యాపద వచ్చునని యశరీరవాణి వాక్రుచ్చినంతమాత్రమున నీయట్టిశూరుఁడు భయపడుటయేగాక మీఁదుమిక్కిలి ప్రేమాస్పదురాలగు చెలియలిని—నూతన పాణిగ్రహణోత్సవానందతత్పరయగు చెలియలిని— సంసారసుఖభోగానుభవవాంఛాపరిపూర్ణమనస్కయగు చెలియలిని— ఈవిధముగా—ఇంత దయాశూన్యముగా వధింపఁదలంచుటయా? కంసా! సహోదరియందు నీకుఁగల ప్రేమయంతయు నశించి

వసు దేవుని మొఱ.

నదా? నీచెలియలి ప్రాణము మాత్రము నీ ప్రాణమువంటిది కాదా? పురుషుఁడవైన నీవే ప్రాణరక్షణోపాయము నెఱుంగజాలక సోదరిని జంపనుండ నాఁడుది యగు నీతోఁబుట్టు వేమి చేయఁగలదు? ఇదియేనా పౌరుషధర్మము? అదిగాక—

ఉ. అన్నవు నీవు చెల్లెలికి • నక్కట? మాడలు సీర లిచ్చుటో
మన్నన సేయుటో మధుర • మంజులభాషల నాదరించుటో
మిన్నుల ప్రోఁతలే నిజము • మేలని చంపకుమన్న మాని రా
వన్న సహింపుమన్న తగ • దన్న వధింపకుమన్న వేఁడెదన్.

అనివసుదేవుఁడు దేవకీదేవి ప్రాణములనురక్షించుటకై కంసుని

ననేక విధముల బ్రార్థించెను. కాని యాపాపుని మనస్సు కరుగలేదు. ఆతని నిశ్చయము మారలేదు.

వసుదేవుఁడు తన ప్రార్థనము కంసునియెడ నిష్ఫలమై పోవుటఁగాంచి నిజసతీమణికి ముప్పుదప్పదని తలంచియుఁ గొంత ధైర్య మవలంబించి 'కానిమ్ము. ఈతలోదరి యష్టమ గర్భంబుగదా కంసుని ప్రాణములు హరించునదియని యాకాశ

వసుదేవుని మనోధైర్యము.

వాణి తెల్పినది. అట్టియెడ నిప్పుడు నిష్కారణముగాఁ గాంతను గోలుపోవుటేల? ఈమెకుఁ గలుగు శిశువుల నందఱిని నీతనికే యర్పించెదను. మీఁద దేవుఁడే గలఁడు. ఈతఁ డెంత యత్నించినను దైవవిధి తప్పునుగదా? కానిమ్ము, చూతము.' అని తనలోఁ దాను సమాధానమును బొందినవాఁడై కంసునిఁ గాంచి 'కంసా! నీ సోదరిని నిష్కారణముగా నేలచంపెదవు? ఈమెకుఁ బుట్టువారలుఁ గదా నిన్ను సంహరించునది? దానికై నీవెంత మాత్రమును భయపడ నక్కఱలేదు. ఈమెకుఁగలుగు శిశువుల నందఱినిఁ బుట్టినతోడనే నీకప్పగించెదను. ఆశిశువులనే సమయించి నీప్రాణములను గాపాడుకొనుము' అని తెలియజెప్పెను.

వసుదేవుఁడట్లు తనకుఁ దెలియఁ జెప్పఁగనే కంసుఁడును కొంతవఱకు కాలోచించి యదియే సమ్మతమని తలంచినవాఁడై 'బావా! నీపల్కులను శిరసావహించెదను. ఆడినమాటను

దప్పక యీ మెకుంగలుగు శిశువులను నాకప్పగింప వలయును సుమా! మాటc దప్పినయెడల మీ యిరువుర ప్రాణంబులును దప్పిపోవును. ఈ కంసుc డెంత మాత్రమును దయcజూపు వాcడుగాcడు.' అని తనమనోనిశ్చయమును వసుదేవునకుc దెలియపరచి యాక్షణమునసే వారలనిద్దఱినిcగొని తనపురంబునకరిగెను. పురమును ప్రవేశించిన వెంటనే కంసుcడు వసుదేవుని మాటయందు నమ్మకములేనివాcడై చెలియలిని, మఱcదిని, శృంఖలాబద్ధులుగ నొనర్చి కారాగృహ నందుంచెను. అప్పటికిని నిండార నమ్మకములేనివాcడై శిశువు పుట్టినతోడనే తనకుc దెలియజేయవలసినదని తన కాపుతైన వారినిcగొందఱిని కాపు వెట్టెను.

కారాగృహ వాసము.

దేవకీ వసుదేవులట్లు కంసునివలనc గారాగృహవాసమొనర్చుచు సంతతము భగవచ్చింతన సేయుచుc గాలమును గడుపుచుండిరి. ఇట్లుదినములు గతించినకొలంది, దేవకిదేవి క్రమక్రమముగా గర్భమును ధరింప సాగెను. వసుదేవుండును సత్యవ్రతాచరణ తత్పరుండగుటవలన గర్భోత్పత్తి యైనవెంటనే పుత్రానురాగమును గూడ లెక్కింపక యాపొత్తుల కందువులను గంసున కర్పించు చుండెను. అతండును దయాశూన్యుcడై

సత్యవాక్య పరిపాలనము.

యా పసిపాపలను దన నిశితకరవాలమున కెరఁజేయుచునశరీర వాణి పల్కులు దనయెడల నెట్లు సార్థకంబు లగుననియు, దైవ విధి తన కెట్లు ప్రతికూలము కాఁగలదనియుఁ దనకు దాను సమాధానము సెప్పికొనుచు నిజ సహోదరి యష్టమ గర్భంబువలనఁ దన కెంతమాత్రమును బ్రాణహాని సంభవింప నేరదను నమ్మకముతో నుండెను. వసుదేవుండును బుట్టినవారు పుట్టినట్లే గిట్టుచుండినను, దుఃఖముల పాలుఁగాక, సంతతము శ్రీహరిచింతనంబును దవిలి యుండెను. దేవకీదేవియుఁ బురా కృత కర్మఫలంబు ననుభవింపక తీరదను నిశ్చయంబునఁ బుత్ర శోకమును దిగమ్రింగుచు దైవమునే నమ్మియుండెను. ఆప దలు ముమ్మరంబుగఁ జుట్టుముట్టిన ముట్టుఁగాక! ధీరస్వభావ మెంత మాత్రమును జలింప నేరదు. పౌరుషంబు దైవంబును దప్పింపఁ జాలదు.

బలరాముని జననము.

దేవకీదేవి యేఁడవ గర్భంబును దాల్చిన వెంటనే విశ్వరూపుండైన హరి గర్భస్థుఁడగు జీవునకుఁ గంసుని వలన హాని సంభవించునని యెఱిఁగి, తన్ను నమ్మియున్న యాదవులకు మేలొనర్పఁదలంచినవాఁడై యోగమాయాదేవినిఁ జేరంబిలిచి 'దేవీ! వసుదేవుని భార్యలలో నొకతెయైన రోహిణియను కాంత కంసునివలన నెట్టియాపదను బొందక నందగోకులమున సురక్షితముగా నున్నయది. ప్రస్తుతము దేవకీదేవిగర్భస్థమైయున్నపిండ మాది శేషునియంశమున వృద్ధిఁబొందు చున్నయది. కావున నీ నేర్పు కొలంది ప్రయత్నించి యాపిండమును గొని రోహిణీదేవి గర్భమునఁ జొనిపిరమ్ము. అష్టమ గర్భంబున నేనామెకుఁ బుత్రుఁడనై పుట్టెదను. నీవును యశోద యను పొలతికిఁ బుత్రికవై పుట్టుము. జనులందఱును నిన్ననేక విధంబుల ననేక నామంబులలోఁ బూజింపఁ గలరు' అని చెప్పి పనిచిన వెంటనే మాయాదేవియుఁ దన యోగమాయ వలన నెవ్వరికిఁ దెలియనిచందమున దేవకీదేవి గర్భస్థమగు పిండమును గొని రోహిణీదేవి గర్భమున నుంచెను. అంత రోహిణియు గర్భంబును దాల్చినదై యొక్క కుమారునిఁ గనెను. ఆపసిపాపఁడు, బలముఁగలవాఁడగుటవలన, బలభద్రుఁడనియు,

లోకరమణుఁడగుటవలన, రాముడనియు, గర్భ సంకర్షణమున సంకర్షణుండనియు మున్నగునామములతోఁ దేజరిల్లఁజొచ్చెను. ఈవిధముగాఁ గృష్ణావతారమునకు ముందే నందగోకులమున బలరామోత్పత్తి యయ్యెను. మాయాదేవియు శ్రీహరి వాక్యానుసారము యశోదగర్భమును జొచ్చెను.

దేవకీదేవి యేడవ గర్భమైనది యెవ్వరికిఁ దెలియకున్నందువలనఁ బౌరులందఱును గడుపు దిగెనని యనుకొనసాగిరి. ఇట్లు కొన్నిదినములు గడచునప్పటికి, దేవకీదేవి యష్టమ గర్భంబును ధరించెను. ఈయష్టమ గర్భమేగదా తన్ను సంహారించునదియని కంసుఁడు గడు జాగరూకతతోఁ దనవారినిఁ గాపుంచెను. పాపము! వసుదేవునకుఁ బుత్రు నెట్లు గాపాడవలయునో తెలియకుండెను. భారమంతయును భగవంతునియందే నిలిపి యాతని చరణసరసీజములే తమకు

శ్రీకృష్ణునిజననము.

దిక్కనినమ్మి యారాధించుచు నాదంపతులు దినములుగడుపుచుండనొకనాటిరాత్రి శ్రీహరి వసుదేవునకుఁ బ్రత్యక్షమై తన్నేమార్గమునఁ గాపాడ వలసినదియుఁ దెలియఁజేసి యదృశ్యుండయ్యెను. అప్పటికే దేవకీదేవికి నీళ్ళాడు ప్రొద్దులగుటవలన నొకనాఁటి నడురేయినిఁ దారలు, గ్రహంబులు మొదలగునవి యన్నియును శుభగతిని నుండ నామె యొక్కశిశువును గనెను. పిండోత్పత్తి

యైన వెంటనే యొరులకుఁ దెలియకుండఁ బూలవానలు గురిసెను. దేవదుందుభులు మ్రోగెను. సురకాంతల నృత్యగీతములు విజృంభించెను. మఱియొకదెస, బ్రహ్మాదిసకల దేవతలును నారదాది సర్వమునీంద్రులును, కైలాసాది సకలభువనంబులును, నాతనిఁగీర్తింపఁ దొడంగిరి. ఆహా! ఏమి యాపాపని సౌందర్యము! దేహము నీలవర్ణము. కన్నులు పద్మములు. కంఠహారము కౌస్తుభము. మోము పూర్ణేందు బింబము. అవియివి యననేల? సర్వవిధముల శ్రీహరినిఁ బోలియుండెను. ఆపాపని తేజఃపుంజమువలన నాపురిటియిల్లు చక్కఁగాఁ బ్రకాశింపఁ జొచ్చెను. అట్టి శిశువును వసుదేవుఁడు గాంచి శ్రీహరియే తనకుఁ బుత్రుఁడయ్యెనని తలంచి, పుత్రానురాగమును బొందక, కేవలము భక్తిపరవశుఁడై యాపాపనికిఁబ్రదక్షిణపూర్వక నమస్కారం బొనర్చి, ముకుళిత కరకమలుండై "దేవా! సర్వమును నీ యందిమిడియున్నది. నిజముగ నీవు సర్వాత్ముఁడవు. సర్వమయుఁడవు సర్వేశ్వరుఁడవు. గుణవికారరూపరహితుండవు. జననమరణాదులు నీకుఁగలుగ నేరవు. నీవే పరబ్రహ్మవు. నీయాజ్ఞలేనిదే తృణమైనను గదలఁ జాలదు. భూభారమును దొలఁగించుటకై నీవిట్లు రూపంబునుగొని యుద్భవించితివేగాని, నీకు రూపోత్పత్తులు గలవా?" యని యిట్లనేకవిధంబులఁ బ్రార్థింపఁ దొడంగెను.

దేవకీదేవియుఁ బుత్రవ్యామోహంబును బొందక, పరబ్రహ్మ స్వరూపంబైన యాశిశువును బలువిధంబులనుతిసేయసాగెను. ఈవిధముగా సకలమునకు శ్రీహరిజన్మక్రమము తెలిసియుండ మాయాదేవి యోగనిద్రవలన రక్కసకులంబున కెంతమాత్ర మును దెలియకుండెను. ఆహా! పరాత్పరుని తత్త్వంబు నెవ్వరు గుర్తింపఁగలరు?

వసుదేవుఁడు పుత్రరక్షణము తనకుఁ గర్తవ్యమై యుండుటవలన భక్త్యావేశము నణఁచుకొని, రక్షణోపాయ మును, హరివలన నింతకుమున్నె యెఱింగి యున్నవాఁడగుట వలన, నాపసిబిడ్డను జంకనిడుకొని గోకులమునకు బయలు దేరెను. యోగనిద్రవలనఁ గావలివారలా సమయంబున శరీ రంబులు మైమఱచియుండిరి. వసుదేవుని కప్రయత్నముగా నినుపసంకెల లూడిపోయెను. అప్పుడాతండు సప్పుడుగాకుండ మెల్లన నడుగులిడుచు మొగసాలలంగడచి యచిరకాలంబుననే

కృష్ణుఁడు గోకులమును జేరుట.

పురంబును నిర్గమించి యమునానదీ సికతా తలంబును సమీపించెను. అప్పోట యము నయు మురళీగానముచేత ముందు తన్నాబిడ్డ మోహింపఁజేయనుండెనని మేలుదలంచెనో యనునట్లు వసు దేవునకు మార్గమునొసంగెను. అతండును, ననాయాసముగా నదినిదాటి వ్రేపల్లెకుంజని యందు నందునిమందిరంబును ముం

దుగఁ జొచ్చి యందమందనిద్రం బొందియున్న యశోదను డాయంజని, యామెకుఁదెలియకుండ నప్పుడే పుత్రికారూపం బునఁ బుట్టియున్న మాయాదేవినిఁ దానుగైకొని యాయవ్వ శయ్యపైఁ దనపసిగందును బరుండఁబెట్టి మరల నింటికిబయలు దేరెను. ఈవృత్తాంతమంతయు నొరుల కెంతమాత్రమును దెలియకుండెను. వసుదేవుండట్లు బయలుదేరి యథాప్రకార ముగా నదినిదాటి కారాగృహంబునుజొచ్చి యాయాడుశిశు వును దన కాంత కొసంగెను.

పసిపాపయైన మాయాదేవిని, నత్తెఱంగునఁగొనివచ్చి వసుదేవుండు నిజసతీమణి పురిటి మంచముపై నుంచినంతనే యాబాలిక, రక్కసకులమును మేల్కొలుపుటకో యనునట్లు యేడువఁ దొడంగెను. ఆరోదనధ్వనుల నాలకించి కావలి వారలు మేల్కాంచి సర్వము నెప్పటివిధమున నుండుటఁగని హానియేమియుఁ గలుగలేదను నమ్మకముఁగలవారై, శిశువు కలిగిన సమాచారము నప్పుడే కంసునకుఁ దెలియఁజేసిరి. ఆతఁడు నీయష్టమగర్భంబేగదా తన్ను సమయించునది యని రోషకషాయితనేత్రుండై దిగ్గన శయ్యనుండి డిగ్గి, వెండ్రుకలు ముడివీడఁ దాల్మినశింపఁ బైచీరతొలఁగిపోవఁ

మాయాదేవి.

దత్తరంబునఁ బురిటి గృహంబును జొచ్చి, యేడ్చుచున్న యాపసిగందును దన నిశితకర వాలంబున కెరఁజేయుటకై, చేపట్టి భయంకరమైన యావాడి

వాలును బైకెత్తెను. అట్టియెడ దేవకీదేవి పెద్దపెట్టున నేడ్చుచు నాతని కడ్డంబువచ్చి "అన్నా! అష్టమ గర్భంబునఁగలుగు పుత్రుండుగదా నీప్రాణంబులఁ గొనునని యాకాశవాణి పల్కినది? నాయష్టమగర్భంబు బాలికగాని బాలుండుగాడు. ఈ యాడుబిడ్డవలన నీకేమి భయము? దీనిని విడిచిపెట్టుము. అయ్యో! ఇదివఱకే నాకుఁగలిగిన యార్గురుకొడుకులను బట్టి దయాశూన్యుండవై వధించితివి. ఇప్పుడీ యాడుబిడ్డనుగూడ నిష్కారణముగా వధింపనుంటివి. నాకుఁ బుత్రలాభము లేక పోయినను, బుత్రీలాభమునైనఁ బొందనిమ్ము. అన్నా! ఈ యాడుబిడ్డ నిన్నేమిచేయఁగలదని భయపడెదవు? ఇదియేనా నీకుఁగల పౌరుషము?

ఉ॥ అన్న శమింపుమన్న తగ ♦ దల్లుఁడు గాఁ డిది మేనఁగోడలా
మన్న నసేయుమన్న విను ♦ మానినిఁ జంపుట రాచపాడిగా
దన్న సుకీర్తికై మనఁగ ♦ దన్న మహాత్ములు బోవుత్రోవవో
వన్న భవత్సహోదరిగఁ ♦ దన్న నినుఀ శరణంబు వేడెదఀ.

అని యీవిధముగా ననేక విధంబుల నాతనిఁ బ్రార్థింపఁ జొచ్చెను. కాని యామె ప్రార్థనంబుల నాతని కఠిన హృదయ మొంతమాత్రమును గరుగలేదు. ఆతని నిశ్చితాభిప్రాయ మణుమాత్రమైనను మారలేదు. బలవంతముగా నా శిశుహంతకుఁడు—ఆదుర్మార్గుఁడు— ఆకఠినహృదయుఁడు—

ఆపసిపాపను దల్లికౌఁగిలినుండి గైకొని వెక్కివెక్కి యేడ్చు చున్నను దయలేనివాఁడై పుడమిపయిఁ బడవైచెను. కాని యాపసిపాప పుడమిపయిం బడక, విచిత్రగతి గగనంబున కెగసి విశ్వరూపంబును దాల్చినదై, చూచువారలాశ్చర్యపడ నందఱును వినునట్లు 'కంసా ! నీవెంత యత్నించినను దైవవిధిని దప్పించుకొనఁజాలవు. నిన్ను సమయించువాఁడిదివఱకే పుట్టి పెరుగుచున్నవాఁడు. క్రూరకర్ముఁడని యెంచక సోదరి బిడ్డల నార్గురినిఁ జంపిన పాపము నిన్నుఁ గట్టికుడుపక మానునే?' యని పలుకుచు నంతరిక్షంబున నదృశ్యయై పోయెను. కంసుఁడు హతాశుఁడై పోయెను. అచ్చటనున్న వారందఱును విభ్రమచేతస్కులై యుండిరి.

మాయాదేవి పలికిన పలుకులు చెవులకు ములుకులై సోకఁ గంసుఁడు కొంతవడికిఁ దెప్పరిల్లి తానొనర్చిన దంతయు నిష్ఫలమైపోయెఁ గదాయని విరక్తిభావముఁగలవాఁడై మఱందియైన వసుదేవునిఁ గాంచి "మహాత్మా! నేను నీయెడ మహాపరాధమును గావించితిని. నేను గేవలము పాపుఁడను. బాలఘాతకుఁడను. క్రూరుఁడను. దుష్టచిత్తుఁడను. దయాశూన్యుఁడను. బ్రాహ్మణ హింసాపరాయణుండను. పాపమనకి యశాశ్వతంబగు నీశరీర రక్షణార్థమై నీ యార్గురు కొమరులను బట్టి వధించితిని. అయినను దైవవిధిని, దప్పించు కొనఁజాలనైతిని.

ప్రాణులందఱును దమపూర్వజన్మకర్మానుసారము వృద్ధిక్షయములకును, జననమరణంబులకును లోనగుచుందురు. దేహధారులెందును స్వతంత్రులుగారు. రక్షించుటకును శిక్షించుటకును గర్మప్రధాన మగుచున్నది. కాని వ్యక్తిప్రధానమగుట లేదు. మాశిశు సంహారమునకు వారివారికర్మయే ప్రధానంబుగాని నేనెంతమాత్రమును గర్తనుగాఁజాలను. అత్మకెన్నండును బగసెలుములు లేవు. అవికర్మవలననే కలుగుచున్నవి. ఈతాత్పర్యంబును గుర్తెఱింగి నన్నుక్షమింపవలసినది" యని యాతనిపాదములపై వ్రాల వసుదేవుండును గంసుని మనఃపూర్వకముగా క్షమించెను. కంసుండును దేవకీవసుదేవులను జెఱనుండివిముక్తులజేసి తాను నిజమందిరంబున కరిగెను. దేవకీవసుదేవులును శాంతచిత్తులై యుండిరి.

దేవకీవసుదేవుల చెఱ విముక్తి.

శ్రీకృష్ణుఁ డట్లు కారాగృహంబున జన్మంబు నొంది, తండ్రియగు వసుదేవునివలన నందగోకులమునకుఁ జేర్పఁబడి యశోదకుఁ జంటి బిడ్డఁడై దినదినాభివృద్ధిఁ గాంచుచుండెను. నందయశోదలకుఁ గృష్ణుండు పెంపుడుబిడ్డ డగుటకుఁ గారణము లేక పోలేదు. నందుఁడు పూర్వజన్మంబున ద్రోణుఁడను వసువైయుండెను. అతని భార్యపేరు ధర. కొండొక కార ణంబున బ్రహ్మదేవుఁడు వారలపైగినిసి మర్త్య నందయశోదల యోనిఁబుట్టుఁడని శపించెను. అప్పుడు ద్రోణుం పూర్వజన్మ డును, నాతని భార్యయగు ధరయుఁ దమకు వృత్తాంతము. విష్ణుసేవారతిఁ జేకూర్పవే యని యావేల్పు పెద్దను బ్రార్థింపఁగా నాతండును నట్లుకాకయని వారలకు వరంబొసంగెను. శాపోపహతులైన యాదంపతులు మానవజన్మంబున నందయశోదలనఁ బుట్టియుండిరి. విష్ణుండును గమలాసనుని వరంబును సార్థకముగా నొనర్ప నందయశోదలకు ముద్దు బిడ్డఁడై తన్ను సేవించు భాగ్యమును వారలకు సమకూర్చెను.

కృష్ణుం డీవిధమున గోకులమున యశోద యొమ్మునఁ బెంపొందుచుండ నచ్చోట మధురాపురంబునఁ గంసునకు నాఁడునాఁటికి గృష్ణునిపైఁ గల శత్రుత్వము పెంపొందు

చుండెను. తొలుదొల్త నశరీరవాణి వాక్యము లాతని కర్ణరంధ్రంబులఁ జొచ్చినప్పుడే కంసునిహృదయమున దుష్టస్వభావము తాండవింపఁ జొచ్చెను. అదియట్లుండ మాయాదేవి వాక్యంబులను వినినప్పటినుండియు నాతనియెడఁ దాండవించుచున్న వైరభావము గడెగడికి నృత్యముసేయ నారంభించెను.

కంసుని క్రూర స్వభావము

ఇట్లు కృష్ణునియందుఁ బ్రబల శత్రుత్వమును వహించి యాతనిని రూపుమాపు టెట్లాయని పలుతెఱంగుల నాలోచించుచుఁ గంసుఁడొక నాఁడు తనమంత్రుల రావించి కృష్ణునిఁగూర్చి తనకుఁగల మనస్తాపంబునంతయు వారలకు దెలియఁజేసెను. వారును గొంతనడి దీర్ఘాలోచన మొనర్చి, 'దానవనాథా! శ్రీకృష్ణునకు గోబ్రాహ్మణ సాధుజన సంఘంబులును, నధ్వరమంటప తపోవన శ్రద్ధాశాలలును, మొదలుగాఁ గలవన్నియుఁ బ్రియంబులై యుండును. కావునట్టివాని నన్నింటిని జెఱుపనిప్పుడే యనుజ్ఞనొసంగుఁడు. దానివలనఁ గృష్ణునిపై దమకుఁగల విరోధానలంబు కొంతవఱకుఁ జల్లారఁగల' దని వాక్రువ్వ గంసుండును వల్లెయని సాధుల బాధించుటకప్పుడే దైత్యవీరుల కాజ్ఞనొసంగెను. నాటఁగోలెఁ గంసుని దుష్కృత్యములు భూనభోంతరాళంబులందు నిండి ప్రతిబింబింప సాగెను.

ఇట్లు కంసుఁడు నిజభటులను దుష్కృత్యంబు లొనర్పఁ బ్రేరేపించుటయేగాక, తనకుఁదానయే శ్రీకృష్ణ వధోపాయమును గూర్చి చేయుంబవలు విచారింపఁ దొడంగెను. శ్రీకృష్ణుండు శిశువై యుండుటవలన లోకంబునఁగల శిశువుల నందఱిని సంహరించినచోఁ గృష్ణుండును సంహరింపఁ బడునుగదా యని తలంచి తత్కార్య నిర్వహణమునకై యారక్కసఱేఁడు పూతనయను నొక్కరాక్షసాంగనను నియోగించెను. ఆరక్కసియుఁ గంసుని పంపునఁ గామరూపంబుతో నెల్లెడల సంచరించుచుఁ జనుమొనల విషంబు నిడుకొని కనఁబడిన చిన్నిపాపల కందఱికిఁ బాలిచ్చు దానివలెఁ జన్నుగుడుపుచు శిశుసంహార మొనర్పసాగెను. ఇట్లా పూతన వాడ వాడలఁ దిరుగుచుఁ దుదకు గోకులమునకు వచ్చి చేరెను.

పూతన వధ.

గోకులమును బ్రవేశించినది మొదలారక్కసి ప్రతిగృహంబును బ్రవేశించి తానువచ్చిన కార్యమును ముగించుకొనుచుండెను. తుదకుఁ గర్మపరిపాకమగుటవలన దానవమృత్యుదేవతా గృహమనఁదగు యశోదాదేవి మందిరంబునుజొచ్చి, పూతన, పాన్పుపైఁ బవళించియున్న బాలకృష్ణునిఁగాంచి చన్నిచ్చుదానివలె నాతనిఁ గైకొనెను. గోపికలందఱును, గామరూపిణియగు పూతన సౌందర్యాతిశయంబుం గచ్చెరువొందుచుఁ గలహా పెఱుంగఁజాలక

మిన్నకుండిరి. పూతన, తనకుఁ జన్నిచ్చుటకుఁ బ్రారంభించి నంతనే సర్వవిభుండైన శ్రీకృష్ణపరమాత్మ యాదానవాంగన దుష్కార్యాచరణమును గుర్తెఱింగి, పాలు ద్రావుచున్నట్లు నటించుచు, గ్రుక్కగ్రుక్కకు నారక్కసిమేనిలోని సత్వమెల్లను ద్రావఁజొచ్చెను. ఆబాలుని యమానుషచర్య కాశ్చర్యపడి, క్షణక్షణమునకుఁ బ్రాణంబులు సన్నగిలుచుండ నిలువఁజాలక 'కృష్ణా! ఇంకఁజాలును. చన్ను విడువుము. విడువుము.' అని యాతనిని మరలింపఁ జొచ్చెను. కాని చనుఁబాలు చవిఁగొన్న వానివలెఁ గృష్ణుఁడు చన్నువిడువక పైకొని పాలుద్రావ నారంభించెను. కనుమూసి కనుదెఱచునంతలోఁ గృష్ణుండా రక్కసకాంత సర్వప్రాణంబులను హరించెను. అప్పుడు కామ రూపంబును దొఱంగినదై, జీవంబులనెడఁబాసి పెనుగొండ వలె సహజస్వరూపంబున లోకభయంకరంబుగఁ బూతన భూమిపైఁ ద్రావ్రాలెను. ఆభయంకరాకారమును గాంచి గోప గోపికాజనంబులందఱును మిక్కిలి భయంపడిరి. కాని కృష్ణుండు మాత్ర మారక్కసితో నాడుకొనఁ జొచ్చెను. అచ్చోట నున్న వారందఱును గృష్ణుని యమానుషచర్య కాశ్చర్య పడుచు నాతండు నిక్కముగా శ్రీహరియే యని తలంచిరి. యశోదయుఁ జంటిబిడ్డయైన కృష్ణుఁడు భయపడెనేమో యని విభూతి మొదలగు రక్షాకరణంబు లొనర్పసాగెను. నందుఁడు

మొదలగు యాదవ ప్రముఖులందఱును గోకులమున నుత్పాతములు పుట్టనున్నవని భయపడఁ జొచ్చిరి. ఈవిధముగాఁ బూతన ప్రాణంబుల హరించి కృష్ణుఁడు కంసుని ప్రయత్నము నిష్ఫలముగఁ జేసెను.

లీలామానుష విగ్రహుండైన కృష్ణుండిట్లు నిజమాయా బలంబువలనఁ గంసుని ప్రయత్నంబులను గొనసాగనీయక నిష్ఫల మొనర్చుచు గోపికలతోడను గోపబాలకులతోడను గ్రీడింపఁ జొచ్చెను. ఒకనాఁడు యశోదాదేవి బాలకృష్ణునకు సిగముడిచి గృహాంగణంబున నాడుకొనుటకు వదలిపెట్టియుం

తృణావర్తుని వధ.

డఁగా దృణావర్తుఁడను రాక్షసుఁడు కంసుని పంపున సుడిగాలి రూపమునుదాల్చి యాడుకొనుచున్న కృష్ణునెత్తుకొని పోయెను. అచ్చోటనున్న గోపబాలకులందఱును 'కృష్ణుండు పోయెపోయె' నని హాహాకారంబు లొనర్పసాగిరి. ఆబాలకుల రోదనధ్వనుల నాలకించి యశోదాదేవి మొదలుగాఁగల వారందఱును బరుగెత్తుకొని వచ్చి, కృష్ణునకుఁ గలిగిన యాపదను దెలిసికొని పెద్దపెట్టున వాపోవఁదొడఁగిరి. ఇవ్విధంబున గోకులంబంతయు బాలకృష్ణునిఁగూర్చి మిక్కిలి దుఃఖింపసాగెను. ఇట్లు తన్నుఁ గూర్చి యందఱును విచారించుచుండఁ గృష్ణుండు దానవునిచే నెత్తుకొని పోఁబడిన వానివలె నభోభాగంబునకు వానితోఁ

గూడసరిగి యచ్చోట నాతనికంఠమును బిగియఁబట్టుకొని క్రిందికి వ్రేలాడఁజొచ్చెను. ఆ దానవుఁడా బాలకృష్ణుని బరువును భరింపఁజాలక, క్షణక్షణమునకుఁ గ్రిందికి దిగ నారంభించెను. కాని కుత్తుక బాధ మిక్కుటముగానుండుటవలన మధ్యే భాగంబుననే యాదైత్యుఁడు ప్రాణంబులఁ గోల్పోయి యొక పర్వతంబు వడువునఁ బుడమిపయిఁబడెను. ఆతనితోఁ గృష్ణుండును బుడమికి డిగ్గి తోడిబాలకులఁ గలిసికొనెను. కృష్ణుఁడు తిరిగి కానుపించినంతనే యాగోపబాలకులందఱానందముతోఁ జిందులుద్రొక్కుచు బాలకృష్ణునెత్తుకొని యశోదాదేవి కడ కరిగిరి. పుత్రునికై మిక్కిలిగ వాపోవుచున్న యశోద తన పాపనిఁ గాంచి యపరిమితానందమును బొందెను. గోపికలందఱును గృష్ణుని దరిగి చూడగలిగినందులకుఁ దమజన్మంబులు సార్థకంబులయ్యెనని తలంచిరి. ఎల్లరును జిన్నికృష్ణుఁ బరమాత్మగా భావింపఁ దొడంగిరి.

గోకులంబునఁ గృష్ణుఁడిట్లు క్రమక్రమాభివృద్ధినందు చుండ నందుఁడు రోహిణీదేవి కుమారుఁడైన బలరామునిఁ గైకొనివచ్చి కృష్ణునితోనుంచెను. నాటఁగోలె బలరామకృష్ణు లిద్దఱును గోకులంబున మెలంగఁ జొచ్చిరి. దినంబు లివ్విధంబునఁ గడిచిపోవుచుండ నొకనాఁడు యాదవపురోహితుండైన

గర్గ మహాముని నందుని మందకుఁ జనుదెంచెను. ఆ మహాత్ముని గాంచి నందుఁ డాతని నర్ఘ్య

గర్గ మహాముని.

పాద్యాది విధుల బూజించి కుమారులైన శ్రీకృష్ణ బలరాములనుఁ జూపి వారలకు నామకరణంబు లొనర్పుఁడని యాతనితోఁ బల్కెను. గర్గుడును బలరామునిఁ గాంచి, యాతఁడు జనులను రమింపఁ జేయువాఁడు గావున రాముఁడనియు, యదుసంకర్షణంబున సంకర్షణుండనియు, ఘనబలమున బలుఁడనియు, హలమునే యాయుధముగాఁ గలవాఁడు గావున హలాయుధుఁడనియు నాతనికి నామకరణం బొనర్చెను. అనంతరము శ్రీకృష్ణు నుద్దేశించి, నల్లని శరీరముఁ గలవాఁడు గావునఁ గృష్ణుండనియు, వసుదేవునకు జన్మించినవాఁడగుటవలన వాసుదేవుండనియు, గుణ రూప కర్మంబు లనేకంబులుఁ గలిగియున్నవాఁ డగుటవలనఁ బెక్కునామంబులు గలవాఁడనియు నాతనికి నామకరణంబొనర్చి, యాశిశువువలన నందగోకుల ముద్ధరింపఁబడుననియు, దుఃఖంబులు దొలంగి సుఖంబులు సేకూరుననియు, మఱియు వారివలన దుర్జన శిక్షణంబును, సజ్జన రక్షణంబును జరుగుననియుఁ దెలియఁజెప్పి బాలకృష్ణుని విశ్వమయునిఁగాఁ దలంచుచు నాతండు తన యాశ్రమంబున కరిగెను.

బలరామ కృష్ణు లిద్దఱును శరీరంబులు రెండుగను, మనంబులొక్కటిగను మెలంగుచు గోపకులతో శైశవక్రీడల

నెఱపుచుండిరి. ఒకనాఁడు గోపకులును, బలరాముఁడును గలసి, శ్రీకృష్ణుఁడు మన్నుఁదినెనని యశోదాదేవితోఁ జెప్పిరి. ఆమెయు వారిమాటలను నమ్మి వెన్నుండు మన్నుఁదినెననియే భావించి యాతనిఁ బట్టుకొని 'అన్నా! ఇదినీకుఁదగునా! ఇంటియందు నీకెన్నియో రుచ్యములైన పదార్థములుండ మన్నెందుకుఁ దింటివి? నానియమములను నీవేలమన్నింపవు? చూడుము! నీయన్నయు నీ సఖులును నీమీదఁ గొండెములు సెప్పుచుండరికదా?' అని మందలించెను. భయరహితుండగు శ్రీకృష్ణపరమాత్ముఁడు తల్లి మందలింపునకు భయపడినవాని వలెఁ గంటఁ దడిపెట్టి వెక్కి-వెక్కి యేడ్చుచుఁ దల్లియైన యశోదతో —

శా॥ అమ్మా! మన్నుదినంగ నేశిశువనో? ♦ యాకొంటినో? వెఱ్ఱినో
నమ్మంజూడకు వీరిమాటలు మదిన్ ♦ నన్నీవుగొట్టంగఁ దా
రిమ్మార్గంబు ఘటించిచెప్పెదరు కా ♦ దేనిన్ మదీయాస్యగం
ధమ్మాఘ్రాణముసేసి నావచనముల్ ♦ దప్పైన దండింపవే?

అని జాలిఁ గొలుపునట్లు పలికి తననోరును దెఱచి 'చూడు' మని తల్లిని సంబోధించెను. ఆమెయుఁ దన ముద్దుపట్టి ముద్దుపల్కులకు మహానందమును బొంది కుమారుని సత్య ప్రవర్తన మెంతవఱకుఁ గలదో చూతమని యాతని నోరును దిలకించెను. చూచుటయేఁ దడవుగ యశోద విభ్రమాశ్చర్య చకితయై

మృద్భక్షణ విశ్వరూపప్రదర్శనము

పోయెను. ఆచిన్ని కృష్ణుని నోర నామెకు జలధిపర్వత వన

భూగోళశిఖితరణిశశిదిక్పాలకాది కరండమైన బ్రహ్మాండంబంతయుఁ గానుపించెను. అట్టిబ్రహ్మాండమును బసిపాపని నోరఁ గనుంగొని యశోద—

మ॥ కలయో వైష్ణవమాయయో యితర సం ♦ కల్పార్థమో సత్యమో
తలఁపఁగా నేరకయున్న దాననో యశోదా ♦ దేవిగానో పర
స్థలమో బాలకుఁ డెంత యీతని ముఖ ♦ స్థంబై యజాండంబు ప్ర
జ్వలమైయుండుట కేమి హేతువొ మహా ♦ శ్చర్యంబు చింతింపఁగన్॥

అని తనలోఁదాను వితర్కించు కొనసాగినంతనే యామెకుఁ గృష్ణునియెడఁగల పుత్రానురాగంబుఁ దొలంగి భక్త్యావేశ మినుమడించెను. అట్లు భక్తిపరవశయై బాలకృష్ణునిఁ బెక్కువిధములఁ బ్రార్థింపఁ దొడంగెను. కాని కృష్ణుండది యొంతమాత్రమును దగదని యామెను వైష్ణవ మాయయందుఁ దగుల్కొనఁ జేసెను. తోడనే యశోదకు భక్త్యావేశము నశించి పుత్రప్రేమ మినుమడించుడు నామె కృష్ణునిఁ జేరఁదీసి నిజాంకతలంబున నిడికొని "నాతండ్రీ! నిన్నెప్పుడు మంతలింపను లెమ్ము" అనియోదార్చ సాగెను. కృష్ణుండును, నేడుపుమాని తల్లికుచవేదికయందు నొదలమోపి కూరుకుసెందెను.

కృష్ణుఁడిత్తెఱంగున నప్పుడు గోపగోపికా జనంబులకుఁ దనసహాజ తత్వంబును దెలియఁ బఱచుచు నొకప్పుడు భక్తిపరవశులుగను,మఱొక్కప్పుడు తనయం దనురాగముగల

వారిగను వారినందఱ నొనర్చుచుండెను. ఆతండును గోప బాలకులతో నాడుకొనుచు, నప్పుడప్పుడు చోరునివలె నితర గృహంబులందుఁ బ్రవేశించి యందున్న గొల్లపడుచులను గనుసైగలు సేయుచును, వెరుకప్రక్కగాఁ జేరంజని చెక్కిళ్ళ నొక్కుచును, వచ్చెదవాయని రహస్యముగా భాషించుచును, నొంటరిగనున్నఁ బైఁబడి యధర చుంబనాదుల నొనర్చుచు నిట్లనేకవిధంబులమగపోడుములు సేయుచుండుటయేగాక, వీలగు నప్పుడుపాలుపెరుగులఁ గ్రోలుచు, వెన్ననారగించుచుఁ బట్టు కొనవచ్చిన గోపికలను వెఱపించి పాఱిపోవుచు నొక్కొక్క తఱి వారిలోవారికిఁ గలహంబులువెట్టుచు, నిరంకుశాధికార బున దుండగంబులు సేయఁజొచ్చెను. గోపికలందఱును బాల కృష్ణుని దుండగంబులు నానాటి కభివృద్ధి నందుచుండఁ జూచి సహింపఁజాలక యొకనాఁడు యశోదాదేవి కడకరిగి, యామె ముద్దుపట్టి తమయిండ్లయందొనర్చిన దుండగంబుల నన్నింటిఁ గూర్చి సవిస్తరముగాఁ జెప్పిరి. చన్నుగుడుచుచున్న కృష్ణుఁడు

కృష్ణుని దుండగములు.

తల్లి తన్నెక్కడ మందలించునోయని భయ పడినవానివలెయశోదయొడియందు ముసుగు వడియుండెను. యశోదయు గోపికలు సెప్పిన వృత్తాంతంబునంతయును విని, వారలగాంచి 'అమ్మలారా! మాచిన్నికృష్ణునెందుకట్లుదూఱెదరు ? ఎన్నఁడునుబొరుగిండ్లను

ద్రొక్క నెఱుఁగఁడే? చక్కఁగాఁ గన్నులుగూడఁ దెరువని నాయీచిన్నికుమారుని అవ్వసేయుట మీకుఁ దగునా ?

గీ॥ అన్య మెఱుఁగఁడు తనయంత ♦ నాడుచుండు
మంచివాఁ డీతఁ డెగ్గులు ♦ మానరమ్మ
రామలార త్రిలోకాభి ♦ రామలార!
తల్లులార గుణవతీమ ♦ తల్లులార !

యనేక విధంబుల వారల నోడంబఱచి గృహంబుల కనిపి కుమారుని మందలింపఁ జాలకపోయెను. కృష్ణుఁడును, దన కేమియుఁ దెలియనివానివలె నటింపసాగెను.

గోపికలు శ్రీకృష్ణుని దుండగంబులఁ గూర్చి పలుమారు వచించుచున్నను యశోద కొడుకు నెంతమాత్రమును మందలింపకుండెను. ఇట్లు దినంబులు సనుచుండ నొకనాఁడు యశోద నిజమందిరంబున దధిమథనంబున మెలఁగుచుండెను. అట్టియెడఁ గృష్ణుండు తల్లిఁజేరంజని పాలీయుమని పోరుపెట్ట దొడంగెను. ఆమెయుఁ గుమారునకుఁ జన్నిచ్చుచు నంతలోఁ బొయ్యిమీఁదనున్నపాలు పొంగిపోవుచుండఁ గుండను దింపుటకై కుమారుని వదలిపెట్టిపోయెను. కృష్ణుండును గడుపు నిండఁబాలీయలేదని కోపించి, యెదుటనున్న పెరుగుకుండను బాదములతోఁ దన్ని పగులఁ గొట్టెను. పెరుగంతయు నేల పాలయ్యెను. అంతలో యశోద తిరిగివచ్చి కృష్ణుం డొనర్చిన

పనికి మిగులఁ గోపించి 'దుందుడుకా! నీయాగడ మింక సాగదు లే' యని తనకు భయపడి పరుగెత్తిపోవుచున్న కుమారుని ముందలించుటకై వెన్నంటెను.

యమళార్జున భంజనము.

కృష్ణుండును దన లీలా వినోదంబుల వలనఁ దల్లిని విభ్రాంతాత్మురాలినిఁగా జేయుటకో యన నామెకుఁ జేతిదూరముననే యున్నట్లుండి పట్టుకొన వచ్చునంతలో మాయమగుచు, నెదుఁ జూచినఁ గాన్పించుచు, నందందు మసుఁగువడుచు నిట్లనేకవిధములఁ దల్లిని బాధింపఁ జొచ్చెను. యశోదయుఁ గుమారుని యద్భుత చర్యలకు విస్మయంబునొందుచుఁ బట్టినపట్టునుమాత్రమువిడువక యాతని వెంబడించుచునే యుండెను. కృష్ణుఁడును దల్లిని శ్రమపెట్టుట భావ్యముగాదని తలఁచినవానివలె ననాయాసముగా యశోదకుఁ జిక్కి పోయెను. ఆమెయుఁ గుమారునిఁ బట్టుకొని 'ఓహో! వీఁడు శ్రీకృష్ణులేనా?' యని యెత్తిపొడుచుచు నాతనిని ఱోలఁగట్ట యత్నించెను. కాని యామె తీసికొని వచ్చిన త్రాడు ఱోటికిని, గృష్ణుని బొజ్జకును గొంచెము తక్కువగా నుండెను. యశోద యింకొక త్రాటిని దానికంటఁ గట్టి కట్టుటకు యత్నింపఁగాఁ దిరిగి పూర్వమెంత తక్కువగా నుండెనో యంతే తక్కువగా నుండెను. ఈవిధముగ గృహములో నున్న రజ్జుపరంపరలఁ గొనివచ్చి కట్టుటకు యత్నించినను

దిరిగి పూర్వపు స్థితియే సంభవించుచుండెను. కృష్ణుఁడేమియు నెఱుంగని వానివలెఁ దల్లినిఁ జూచి నవ్వసాగెను. అట్టియెడ యశోదమిక్కిలిశ్రమ నొందినదై, కుమారునిఁ గాంచి 'కృష్ణా! ఏమి నాచేతబంధింపఁబడవా?' యని విచార సూచకముగను భక్తి పరవశత్వమును బొందినదాని వలెను బలుక, భక్త పరతంత్రుఁడగు శ్రీకృష్ణపరమాత్మ—సిరికౌఁగిఁట బంధింపఁబడని శ్రీకృష్ణపరమాత్మ—సనకాది యోగిచిత్తాబ్జము లందుఁ బట్టువడని శ్రీకృష్ణపరమాత్మ—తల్లి వాక్యమును విని నంతనే, లోఁబడి యామెవలన ఱోలఁగట్టఁబడియెను. కుమారునట్లంటఁ గట్టి యాయవ్వ యింటిలోని కరిగెను. ఆమె తన్ను బాసి చనినవెంటనే, నారదశాపంబున యమళార్జునంబు లను సాల వృక్షంబుల రూపంబున నున్న నలకూబర మణిగ్రీవులను నిర్వురు గుహ్యకులకు శాప విమోచనం బొనర్పఁ దలంచి, ఱోలడ్డ మగునట్లా వృక్షంబుల మధ్యభాగంబున కరిగెను. అవియు ఱోటి తాకుడునకు నిర్మూలంబులై పుడమిపయింబడ నందుండి యాగుహ్యకు లిద్దఱును శాపవిముక్తి వలన బయలు వెడలి యనేకవిధంబులఁ గృష్ణపరమాత్మను బ్రార్థించుచుఁ దమ నివాసంబులకుఁ జనిరి.

ఇట్లు కృష్ణుండును సాలవృక్షంబులఁగూల్ప దన్నిర్మూలన ధ్వనులకు గోపగోపికాజనంబులందఱును వెఱంగంది పిడుగులు

పడెనని తలంచుచు వచ్చిచూడఁ గృష్ణుఁడా వృక్షంబులమధ్య భాగంబునఁ గపట బాలలీలల వినోదించుచుండెను. అప్పు డందఱును, 'ఏమిది ? పెద్దగాలి వచ్చినదనుకొందమా యది యంతమాత్రమును సరిగాదు. పిడుగుపడిన దనుకొందమా తగిన సూచకము లెవ్వియును గాన్పింపవు. అకారణంబుగ నీవృక్షంబు లెట్లుగూలినవి ? ఈతఁడు పడఁద్రోసినాఁ డనుకొందమా కేవలము పసి బాలుఁడు. ఏమివింత' యని తమలోఁదాము తర్కించుకొనుచుండ నంతకుమున్న చ్చటనున్నవారు కృష్ణుని వలననే యాపని జరిగెనని తెలియఁజేసిరి. అప్పుడు నందాదులైన గోపకులును, యశోద మొదలైన గోపికలును గృష్ణుని లీలామానుషవిగ్రహుండైన పరమాత్మునిఁగాదలంచి, రెట్టించిన భక్తి తాత్పర్యంబుతో నాతనిఁ బూజింపఁదొడంగిరి.

గోప గోపి కారాధనము.

బృహద్వనంబున నుత్పాతంబులు పెక్కులుప్పతిల్లు చుండుటవలన నందుఁడు సునందుఁడు మొదలగు యాదవ ప్రముఖులందఱును దద్వనంబును విడనాడి బృందావనంబు నకు గోగణంబులతో నరుగుటకు నిశ్చయించుకొని యప్పటి కప్పుడే బృందావనంబున కరిగిరి. అచ్చోట బలరామకృష్ణు లిద్దఱును దోడి గోపకులతోఁ గలసి యాడుకొనుచుఁ బసుల వెంట నరిగి బంతిచల్దులారగించుచు, నొకఁడొకరు బందె ములువెట్టి పరుగెత్తుచు నిట్లనేక విధముల శైశవక్రీడలందుఁ గాలమును గడుపసాగిరి. కృష్ణుం డప్పు డప్పుడు గోగోపికా సంఘంబులు శరీరంబులు మఱచి యుండునట్లు యమునానదీ పులిన స్థలంబుల మురళీగాన మొనర్పసాగెను. యశోదాకుమారుని మృదుల

బృందావన విహారము

మధుర మురళీ నిస్వనంబులకు గోపికలందఱును ముగ్ధలగుచు నింటిపనులఁగూడ మాని తదారవంబు శ్రవణపుటంబులదూఱి నంతనే కోకలు జారుచున్నను, వేణీబంధంబులు విడివడు చున్నను, స్తనభారంబున లేనడుము లల్లలనాడ నాయాస మినుమడించుచున్నను లెక్కసేయక మురళీమోహనకృష్ణునిఁ జేరంజనుచుండిరి. తదారవంబును వినినంతనే గోగణంబులును

మేతలమాని యట్టులెత్తి చెవులు నిక్కించుకొని తన్మధుర నిస్స్వరసనిర్ఝర ప్రబలవేణికలందుఁ గ్రుంకులిడఁ జొచ్చెను. బాలకృష్ణుం డీ విధంబున నిజ మురళీగానంబున విశ్వంబును మోహింపఁ జేయుచు బృందావన విహారంబు నొనర్పసాగెను.

కృష్ణుండీవిధంబున విశ్వమోహన మూర్తియై బృందావనంబున వెలుగుచుండ నచ్చోట మధురాపురంబునఁ గృష్ణుని వృత్తాంతంబు వినవచ్చినకొలంది కంసునకు మనస్తాపం బినుమడింపసాగెను. ఇంతనఱకు నాతఁడొనర్చిన కృష్ణవధోద్యోగ ప్రయత్నంబు లన్నియు నిష్ఫలంబు లగుటవలన నాతనికిఁ బట్టుదల మఱింత హెచ్చిపోయెను. అందువలన నాతని క్రూరచర్యలు తొల్లింటికన్న మిక్కుటములయ్యెను. ఎచ్చోటఁ జూచినను దైత్యభటుల యార్భాటములును, సాధుజన హింసాపరాయణత్వంబును, క్షణక్షణమునకు మించుచుండెను. పశుహింసయుఁ దపోవన నిర్మూలంబును, యాగ విధ్వంసంబును, మునిజన నిష్ఠాపహరణంబును, శిశుమారణంబును, మొదలగు ఘోరకృత్యములు ప్రబలములయ్యెను. జగదపకారంబునకుఁ గంసుఁడు ముందంజ వైచుచుండెను. ఎల్లెడల దానవాపచారసంజనితసాధుజన దీనారవంబులు మిక్కుటముగ వినవచ్చు చుండెను. ఆహా! సర్వజ్ఞుఁడైన శ్రీకృష్ణపరమాత్మ తనమీఁది వైరంబునఁ జేసి సాధుజనంబులిట్లు కంసునివలనఁ బెక్కుబాధలకు లో

దానవుల క్రూరకృత్యములు.

వగుచుండఁ దద్వృత్తాంతంబాతఁడు నెఱింగియు సహించియుండు టేలకో గదా ?

బృందావన ప్రాంతారణ్య భూములంగల పచ్చికబయళ్ళయందు శ్రీకృష్ణుండు గోపబాలక బలరామ సహితుండై గోవులను గాయుచుండ నొకనాఁడు కంసప్రేరితుండై వత్సాసురుండను దైత్యభటుఁడొక్కండు కామరూపంబున మందలోఁ బ్రవేసించి గోపకులను గోవులను బాధింప నొడంగెను. ఆవృత్తాంతంబును గృష్ణుఁడెఱింగి యన్నయగు బలభద్రున కా సమాచారంబంతయుఁ దెలియఁజెప్పి, వత్సంబు పగిది మందయందు సంచరించుచున్న యాదైత్యభటుని సమీపించి 'ఆహా! ఈలేగ యెంత యందముగానున్నది? ఈదూడను మీకుఁగాకుండ నేనుహరించెద' నని గోపబాలకులతో నర్మగర్భంబుగాఁ బలుకుచు వత్సాసురునిఁ దోకమొదలు కంఠమువఱకుఁ దన యాజాను బాహు బంధంబున నిరికించుకొని యూపిరి యాడకుండునట్లు నొక్కుచుఁ దృటికాలములో విగతజీవునిఁగా నొనర్చి బంతిచందమున నవలీల గగనమార్గంబున కెగురవైచెను. ఆదైత్యుండును మొదలువఱికిన తరువువలె ధరణిపై నొదిగి యసువులం బాసెను. ఆతండట్లు మడిసినతోడనే యతని యనుచరుండగు బకాసురుండను వాఁడు భయంకరాకారంబుతో గోగోపసంఘంబుపైఁ గవిసి

వత్సాసుర వధ.

బకాసుర వధ.

మహాట్టహాస మొనర్పసాగెను. ఆదైత్యుని ఘోరాకారమునకు భయంపడి, గోపులును, గోపకులును బరుగెత్తసాగిరి. అట్లు తన్ను గాంచి భయభ్రాంతులై పాఱిపోవుచున్న గోగోప బృందంబుల వదలి యాదైత్యుండు కృష్ణునిపై విజృంభించెను. అట్టియెడ జితవైరియగు నందనందనుఁడు వెఱఁగందినవాని చందంబున నందందుఁ జిందులుద్రొక్క నారంభించెను. బకాసురుండును గృష్ణునిఁ దనకుఁలోఁబడినవానిఁగాఁదలంచి యొక్క పెట్టున నాతనిపైఁబడి గుటుక్కన మ్రింగివై చెను. కృష్ణుఁడు దైత్యునివలన మ్రింగుడునడుటఁ గాంచి గోపకులు "హా కృష్ణా హా కృష్ణా!" యని హాహాకారంబులు సేయందొడంగిరి. గోపులు కనులవెంట నశ్రుధారల గురియింపఁజొచ్చెను. వికసిత కుసుమపరిశోభితములైన లతానివహంబులు గళావిహీనములై కాన్పింపఁదొడంగెను. ఇట్లు విశ్వంబంతయుఁ దనకై విచారించు చుండఁ గృష్ణుండును బకునివలన మ్రింగుడువడి కంఠభాగంబు నందే నిలిచి తనయందు లీనమైయున్న ప్రళయకాలానలంబును రగుల్కొల్పి తన్మూలమునను దాను కుత్తుకనొక్కుచును గను ఱెప్పపాటుకాలముననే యాదైత్యుని సర్వప్రాణంబులు హరించి మడియింపఁజేసెను. ఆతండు మరణించిన వెంటనే తద్గర్భంబు నుండి వెలికివచ్చి గోగోపసంఘంబులకు దర్శనమిచ్చెను. తిరిగి కృష్ణునిం గాంచినంతనే గోపకులందఱు నానంద పారవశ్యమునఁ

జిందులు ద్రొక్కుచు గొంగడుల నెగురవైవసాగిరి. గోగణంబు లును 'అంబా' యని యఱచుచుఁ దోకలెత్తి పరుగిడసాగెను. ఇవ్విధంబున దైత్య వధంబు నొనర్చి శ్రీకృష్ణుఁ డందఱికిని సంతోషముఁ గూర్చెను.

శ్రీకృష్ణ పరమాత్ముని లీలామానుషచర్యలు సకల భువనంబులయందును బ్రతిధ్వనులీనుచుండ సత్యలోకనివాసి యైన బ్రహ్మదేవుఁడతని నొకయలంతి మానవునిఁగాఁదలంచి యాతని సామర్థ్యమెట్టిదో పరీక్షింపఁ దలంచినవాఁడై యొక నాఁడు కృష్ణుఁడు గోపబాలకులతోఁ బసులఁ గాయుచుండ గోవులను గోపబాలకులను హఠాత్తుగా మాయమొనర్చెను. కృష్ణుఁడొక్కరుండే వనమధ్యంబున నిలిచియుండెను. బ్రహ్మ యొనర్చిన పని కాతఁడెంతమాత్రమును విస్మయంబునొందక సర్వజ్ఞుడగుటవలనఁ గలరూపెఱింగినవాఁడై పరమేష్ఠి నవమానింపఁదలంచి గోవులును, గోపకులును దానయై యథాప్రకారము వర్తింపఁ దొడంగెను. గోగోపకులు శ్రీకృష్ణస్వరూపులుగానఁ జూచువారలకొక విధమగు దన్మయత్వము గలుగ నారంభించెను. తమపుత్రులు కృష్ణాంశసంభవులుగాన గోపికలకుఁ దొల్లిఁటి కన్న సుతప్రేమ యెక్కువయ్యెను. బలభద్రుండును నీయద్భుత సంఘటనంబున కచ్చెరువొందుచుఁ గలరూపు నెఱుంగఁజాలక 'ఇదియేమి' యని తమ్ముని నడిగెను. కృష్ణుండును బలభద్రునకు

బ్రహ్మదేవుని పరాభవము.

సర్వమును దెలియపఱచెను. అత్తెఱంగున నొక వత్సరంబు ముగిసినవెంటనే బ్రహ్మ కృష్ణుని పరిస్థితి యెట్లున్నదో యని వచ్చి చూచునప్పటికి గో గోపకులతో యశోదానందనుఁ డెప్పటియెట్ల విహరించుచుండెను. అదృశ్యమునుగాంచి నంతనే బ్రహ్మయు 'సృష్టికర్తను నేనైయుండ నీ గో గోపకులను సృష్టించినవారెవరో?!' యని పెద్దయుఁబ్రొద్దు దనలోఁదాను వితర్కించుకొనుచుఁ గొంతవడికి శ్రీకృష్ణ మహిమంబువలన వైష్ణవమాయనుండి విడివడినవాఁడై సర్వమును దెలిసికొనెను. అప్పుడు కమలాసనుండు దానొనర్చిన పనికి లజ్జించుచుఁ బ్రత్యక్ష స్వరూపంబునఁ గృష్ణపరమాత్మను జేరంజని ముకుళిత కరకమలుండై 'దేవా! నీమాయయందుఁ దగుల్కొని యజ్ఞానుండనై, నీకపచారమును గావించితిని. మహాత్మా! నన్ను క్షమింపుము. నీవాదినారాయణుండవు. నీతత్వంబు నెవ్వరును గ్రహింపఁ జాలరు. నీవలనే సృష్టిస్థితిలయములు జరుగుచున్నవి. నీయందే సకలచరాచరాత్మకమైన యీవిశ్వంబంతయు లీనమైయున్నది. గుణకర్మంబు లనేకంబులు గలిగియున్నవాఁడవగుటవలనఁ బెక్కు నామంబులతోడను, బెక్కు రూపంబులతోడను వర్తించుచుందువు. పరాత్పరా! నన్ను క్షమింపుము' అని యాతనిఁ బ్రార్థింప వసుదేవనందనుఁడు గరుణామయుండు గావున వేల్పు పెద్దను క్షమించెను. విరించియుఁ దిరిగి గోగోపకులను గృష్ణున

కర్పించి నిజనివాసంబున కరిగెను. బ్రహ్మ గోగోపకుల నర్పించి నంత నే శ్రీకృష్ణపరమాత్మ తన విశ్వరూపంబు నుపసంహరించి యొకవత్సరము తన్నెడఁబాసియున్న గోపకులనందఱిని వేర్వేఱ నాదరించి యాదవవంశ భూషణుండగుచుఁ బ్రకాశింపఁజొచ్చెను.

బలరాముఁ డెల్లప్పుడు దమ్ముఁడైన శ్రీకృష్ణునెడఁ బాయక మందయందు సంచరించుచు గోపబాలురతోఁ గూడి యాడుచుండెడివాఁడు. ఒకనాఁడేమి కతంబుననో శ్రీకృష్ణుండు గోవులవెంట రాక యింటనే నిలిచియుండెను. బలభద్రుండు మాత్రము గోపబాలురతోఁ గలసి పసులవెంట నరిగెను. అచ్చోట గోపకులందఱును బలరామ సహితులై బంతిచల్దుల నారగించి తలకొకదిక్కున మెలంగుచు నప్పుడప్పుడు గుంపు గట్టియాడుకొనుచుఁ బ్రొద్దుపుచ్చుచుండఁ గంసునిపంపున నొకదైత్య భటుండు ఖరాకారంబున జనుదెంచి మందయందు శ్రీకృష్ణుండు లేఁడు గదాయని ధైర్యంబు నవలంబించి గోవులను గోపకులను హింసింపసాగెను. అట్టియెడ గోపకులు భయంపడి ఓకృష్ణా! ఓరామా! రక్షింపుడు. రక్షింపుడు. అని పెద్దపెట్టున గోల లెత్తుచు బలభద్రుండున్న తావునకువచ్చి చేరిరి. ఖరాసురుండు వారిని వెన్నంటి వచ్చి గోపబాలక రక్షణార్థమై తన్ను

బలరాముఁడు ఖరాసురుని వధించుట.

మార్కొన నిలచియున్న బలరాముని నొక్కపెట్టున ఝొమ్మనఁ దన్ని యార్చుచు విజృంభించెను. కృష్ణాగ్రజుండును వ్రేటువడినవెంటనే రౌద్రాకారంబున విజృంభించి గార్దభాసురు పదంబులు నాలుగు నొక్కకేల నంటంబట్టి బెట్టుదట్టించి యట్టెట్టు గదల్చుచు నొక్కపెట్టునఁ గందుకంబు చందంబున నభోభాగంబున కెగురవైచి యాదైత్యుని విగతజీవునిఁగా నొనర్చెను.

అట్లు ఖరాసురుని నవలీలగా మడియించి బలరాముఁడు తిరిగి యథాప్రకారము గోపబాలకులతో నాడుకొనఁజొచ్చెను. అట్టి సమయంబున ఖరాసురుని యనుచరుండైన ప్రలంబుఁడను రక్కసుండు పగసాధింపఁదలంచి గోపబాలక వేషముతోఁ జనుదెంచి యచ్చోట నాడుకొనుచున్న బలరామాదులతోఁ గలసి తానుగూడ నాటలాడఁజొచ్చెను. గోపకులందఱును రెండుగములవారై, యోడిపోయినవారు, గెలిచిన వారిని మోయునట్లు బందెము వెట్టికొని యాడుకొనుచుండిరి. ప్రలంబుఁడు పగసాధింపఁ దలచియున్నవాఁడు గావున బలరామున కెదురగువారివైపునఁ జేరెను. కర్మ

బలరాముఁడు ప్రలంబుని వధించుట.

వశంబున బలరాముని వైపువారే యాటయందు గెలిచిరి. అప్పుడనుకొనిన ప్రకారమోడిపోయినవారు గెలిచినవారి నొక్కొక్కరిని తమమూపులపై నెక్కించుకొని మోయఁజొచ్చిరి. అట్టి

యెడ నదియే సమయమని ప్రలంబుఁ డోడిపోయిన వారియుం డున్న వాఁడగుటవలన బలరామునిఁ దన మూఁపున నెక్కించు కొనియున్నటులుండి గగనమార్గంబున కెగసెను. అదిగని గోపకులందఱును రామునికై దుఃఖింపఁ దొడఁగిరి. మోసంబునఁ దన్నట్లు మోసికొని గగనమార్గంబున నరుగుచున్న ప్రలంబుని కపటంబు నెఱింగి, బలభద్రుం డుక్కుమిగిలి తనముష్టిహతిని దైత్యునిశిరంబు వగులఁ జేసి విగతజీవునిఁ గానొనర్చి యచిర కాలముననే గోపకులఁ జేరి వారికి సంతోషమును గూర్చెను. గోపకులును బలరాముని గొప్పవానిఁగాఁ దలంచిరి.

శ్రీకృష్ణ బలరాములిట్లు తెలుంగున జేజిక్కిన దైత్యుల బట్టి చక్కాడుచు గోగోప గోపికాసంఘంబుల రక్షించుచు బృందావనంబునవిహరింపం దొడంగిరి. గోపికలందఱునుశ్రీకృష్ణునియం దెక్కువ మక్కువంగలిగి యెల్లప్పుడాతని దివ్యసందర్శనంబునే యాకాంక్షించుచు ననవరతమాతని మురళీ మధుర నిస్వనంబునేకోరుచుం బొద్దులుపుచ్చుచుండిరి. కృష్ణుండును బెక్కుతెఱంగులం బల్లవకోమలసదృశాకారిణులగు వల్లవీజనంబుల యుల్లంబు లుల్లాసంబున రంజిల్లునట్లు వర్తింపం దొడంగెను. ఒకనాఁడు గోపికలందఱును యమునాస్నానంబున కరిగి యొడ్డున వస్త్రంబులను హారాది పరిష్కారంబులను బదిలంబులుగా నొనర్చి, కంఠదఘ్నంబులగు సలిలంబుల జలకంబులాడం దొడంగిరి. అట్టియెడం దుంటరి యగు బాలకృష్ణుండు యమునానదిం జేరంజని గట్టున నున్న గోపికల వస్త్రంబులను మెల్లన గొంగిలించి తత్తటినీతట నికటంబున నున్న వృక్షంబు నధిరోహించి లీలామాత్రుండై వినోదింపసాగెను. గోపికలును గొంతవడికిం గృష్ణునిరాకను గుర్తించి తుంటరి వాఁడగుటవలన నను మానపడి గట్టునకుంజూడ వస్త్రంబులు లేకుండెను. ఏమా

గోపికావస్త్రాప హరణము.

యని కృష్ణునిదెసఁ బరికింప నాతఁడధిరోహించియున్న తరు శాఖలయందుఁ దమవస్త్రంబులుంటఁగాంచి మోసమయ్యెనని తలంచుచు మానభంగంబునకు వెఱచినవారలై, నదీగర్భంబు నందే నిలచి లీలావినోదియైన శ్రీకృష్ణ పరమాత్మను గూర్చి 'కృష్ణా! ఇదియేమిన్యాయము? కేవలము పరమాత్మ స్వరూపుఁడవును, సర్వజ్ఞుండవును గు, నీవే స్త్రీజనమాన భంగమున బ్రయత్నింప నన్యులఁ గూర్చి వేఱ చెప్పవలయునా? మావలు వల మాకొసంగుము. మామగవారు జూచిన నిన్నుమందలింతురు. రమ్మా. మాచీరెలఁ గొనితెచ్చి యిచ్చిపొమ్మా. ఇది యేనా నీపుట్టినాఁడొనర్చవలసిన ఘనకార్యము? కృష్ణా!

సీ. బహుజీవనముతోడ ♦ భాసిల్లియుండుటో
గోత్రంబునిల్పుటో ♦ కూర్మితోడ
మహినుద్ధరించుటో ♦ మనుజసింహంబవై
ప్రజలఁగాచుటొ కాక ♦ బలిఁజెరల్చి
పిన్నవై యుండియుఁ ♦ బెంపువహించుటో
రాజుల గెల్చుటో ♦ రణములందు
గురునాజ్ఞ సేయుటో ♦ గుణనిధివై బల
ప్రఖ్యాతిఁజూపుటో ♦ భద్రలీల

ఆ॥ వె॥ బుధులు మెచ్చ భువిఁ బ్ర ♦ బుద్ధత మెఱయుటో
కల్కితనము సేయ ♦ ఘనతఁగలదె?
వావిలేమవారి ♦ వారునావారని
యెఱుఁగవలదె? వలువ ♦ లిమ్ము కృష్ణ! ?

అని మందలించినట్లుగను, ధర్మోపదేశం బొనరించినట్లుగను, బ్రతిమాలుకొని నట్లుగను, మొరవెట్టుకొన నాతండును వృక్షంబునందేనిలచి నగుచు 'గోపికలారా! మీరందఱిచ్చోటి కరుగుదెంచి మీమీవలువలం గొనిపొండు. నేను మాత్రము తీసికొనివచ్చి మీకొసంగ' నని ఖండితముగాఁ దెలియఁ జెప్ప గోపికలును దమకుమానభంగంబెట్లును దప్పదని నిశ్చయించు కొని, పోవుదమని కొందఱును, వలదని కొందఱును ముందు వెనుకలాడుచుఁ దుదకందఱును నిజకరసంఛాదిత పంచాయుధ గేహలగుచుఁ గృష్ణునిఁజేరంజని వలువలిమ్మనికోర నాతండును "సుందరాంగులారా! ఒక్కమాఱు చేతులెత్తి మీ రందఱు నన్నుఁ బ్రార్థింపుఁడు. వలువ లొసంగెద" నని పలుక గోపికలు 'ఏమి? ఈ బాలుని తుంటరితనము? అంతకంతకు మితిమీరిపోవుచున్నదే' యని లోనఁ గినుకవహించినవారలయ్యుఁ దప్పనిది యగుట వలన మానభంగంబునకుఁ గూడ శంకింపక చేతులెత్తి వలువలిమ్మని యాతని బ్రార్థించిరి. కృష్ణుఁడప్పుడు వృక్షంబునుండి డిగ్గి వలువలను వారికొసంగి, "గోపికలారా! మీకు మానభంగమయ్యెనని యెంతమాత్రమును జింతింపవలదు. నన్నుఁ గొల్చు వారలకు సర్వంబును నా స్వరూపమై కానుపించును. అట్టియెడ వీరు పురుషులు, వీరు స్త్రీలు, అను విచక్షణ యెంతమాత్రమును వారియందుం

డదు. అట్టి భేదభావము లేనివారలే నాకు నిజమైన భక్తు లగుచున్నారు. మీా స్వభావంబులు గుర్తెఱుంగుటకై మిమ్ము త్తెఱంగునఁ బరీక్షించితిని. నావచన ప్రకారము వర్తించి మీారు నాకు నచ్చినవారలైతిరి. ఇదియే నాతత్వము" అని తెలియఁజెప్పి గోపికల మనస్తాపంబును మాన్పెను. వారును ధన్యులమైతిమని కృష్ణునితోఁ గలసి గోకులంబున కరిగిరి.

వస్త్రాపహరణం బొనర్చి వల్లవీ జనంబుల శ్రీకృష్ణుండు పరిభవించెనను వార్త యెవ్విధంబుననో నందయశోదలకుఁ దెలియవచ్చెను. చూచుచుండఁగనే యావార్త గోపకులంబు నందంతటను వ్యాపించెను. ఎల్లరును కృష్ణుని దుండగంబును గూర్చి పలుభంగుల ముచ్చటింప సాగిరి. తమ కుమారుఁ డొనర్చిన పనికి నందయశోదలు గిరుకవహించినవారలై కృష్ణునిఁ జేరం బిలిచి కుమారా! రోజురోజుకు నీయాగడంబులు మితి మీారుచున్నవి. చూచి యుపేక్షాభావమును వహించుచుంటి మని తలంచుచుంటివా యేమి? కృష్ణా! గోపికా వస్త్రాపహ రణం బొనర్చు మానభంగమును గావించుట నీయట్టివానికిఁ దగునా? ఇంతటినుండి నీవిట్టి దుండగముల నెన్నంటును జేయకుసుమా' యని యనేకవిధంబుల మందలించిరి. అప్పుడు కృష్ణుండు, కనులవెంట నీరునింపుచు 'జననీజనకులారా! మీాతోఁ

నందయశోదలు శ్రీకృష్ణుని మందలించుట.

డను, మీగోపగోపికా జనంబులతోడను నా కెంతమాత్రమును బనిలేదు. ఇందఱివలన మాటఁబడిన యీబ్రతుకుఁగూడ నా కవసరములేదు. నేనిప్పుడేపోయి విషజలపూరితంబగు గాళిందీ నదిలో దుమికెదను. ఇంతటినుండి మీరును, మీకులము వారును నావలన నెట్టిబాధలను బొందకుండ సుఖంబుండుఁడు' అని పల్కినవాఁడై యప్పుడే కాళిందీనదికిఁ బరుగులిడ సాగెను. యశోదానందులును, సకలగోపగోపికాజనంబులును, దుదకు గోగణంబులును, "కృష్ణా! పోకుము. కాళిందీనదిలో దుముకవలదు. నీయిష్టమువచ్చినట్లు మమ్మాదఱను బాధింపుము. నిన్నుఁబాసి యొక్క క్షణమైనను మేము నిలువఁజాలము." అని దుఃఖించుచు లీలావినోదియైన బాలకృష్ణుని వెంబడించిరి. బలభద్రుఁడు తమ్ముని తత్వంబు నెఱింగిన వాడయ్యు, నేమియు నెఱుంగనివానివలెఁ దానును బంధు జనంబుల వెంబడించెను. ఇట్లు యాదవకులంబంతయుఁ దన్ను వెంబడించుచున్నను, నొక్కరికేనియుఁ జిక్కక, కాళిందిని సమీపించి, నిజచరణకమలయుగళసంస్పర్శంబున కెన్నినాళ్ళనుండియో యెదురుసూచుచుఁ దత్సమీపంబున విశాల విటపశాఖాసముదయంబుతోనున్న కదంబ భూజంబు నధిరోహించి తదగ్రంబున కెగఁబ్రాకి దూరంబుననుండి బంధుజనులు దన్నుఁగూర్చి యాక్రోశించుచుండ, నెల్లరకుఁ

దెలియవచ్చునట్లు కుప్పించియచ్చోటనుండి కాళిందిలో దుమి కెను. వెంటనే యాహ్రదంబంతయు గుభగుభ ధ్వానంబు లతో నల్లకల్లోలంబు గాఁజొచ్చెను. ఇచ్చోట యశోదానం దులు మొదలగువారందఱును గృష్ణుండు నదిలో దుముకుట కనులారగాంచి 'హా! కృష్ణా! హా! కృష్ణా!' యని పెద్ద పెట్టున నేడ్చుచుఁ గాళిందిని సమీపించి బాలకృష్ణునిఁగానక ఘోరవిషానల దారుణాకారుండగు కాళీయునిచేత భక్షింపఁ బడెనని తలపోసి తద్వియోగ సంజనిత సంతతానంతదుఃఖాతి రేకంబున స్మృతులుదప్పి పుడమిపై మూర్ఛిల్లిరి. బల రాముఁడుమాత్రము సర్వము నెఱింగినవాఁడుగావునఁ జూచి యూరకుండెను.

కాళిందీనదియందుఁ గాళీయుఁడను సర్పరాజొకఁడు గలఁడు. పూర్వమొకప్పుడు సర్పములన్నియు వినతాసుతునకు భయంపడి, తాము సంపాదించుకొనిన యాహారంబునందు సగపాలతని కిచ్చునట్లును, నాతండు తమ్ముఁ జంపకుండు నట్లును, నొడంబడికఁ జేసికొని, యప్పటినుండి యను కొనిన ప్రకారము వర్తింపఁజొచ్చెను. కాని కాళీయుఁడు మాత్రము తాను సంపాదించిన యాహారంబులోని సగపా లును విహంగవల్లభున కర్పింపక తానే యాప్యాయనం బుగఁ గుడువఁదొడంగెను. అందువలన వైనతేయుఁడు కినుక

కాళీయుని పూర్వ కథ.

వహించి కాళీయునిఁబట్టి శిక్షించుటకుదండెత్తి రాఁగా నతండు పన్నగాంతకునకు భయంపడి యాతని నెదుర్కొనఁజాలక కాళిందీనది యందుఁ జొచ్చి ప్రాణరక్షణ మొనర్చుకొనెను. సుపర్ణుఁడు కాళిందీ నదిఁ జొచ్చుటకు భయఁపడెను. కారణమేమన నాతం డొక నాఁడు క్షుద్బాధ నపనయించుకొను నిమిత్తమై కాళిందీ మడుగులోని చేపలనుబట్టి భక్షించుచుండఁగా మత్స్యంబు లన్నియుఁ బ్రాణ రక్షణాంబునకై తత్సమీపారణ్యంబునఁ దపంబుసేసికొనుచున్న సౌభరియను మునిపుంగవుని శరణు జొచ్చెను. ఆతండును వానిపైఁగరుణవహించి నాఁడు మొదలు వైనతేయుండా నదియందుఁ బ్రవేశించినచో శిరంబు వగిలి మడియుఁగాతయని యుగ్రశాపమిచ్చెను. ఈవృత్తాంతమును గాళీయుఁడెఱింగియున్నవాడగుటవలన **నామడుగునందుదూఱి** ప్రాణరక్షణ మొనర్చుకొనెను. ఆతండామడుగున నివసింపఁ దొడంగినప్పటినుండియుఁ దన విషంబువలన, జలంబును విష పూరితంబుగా నొనర్చి, యానీరును గ్రోలినవారలనేగాక తుద కానీటికి సూటిగ నభోభాగంబునఁ జరించు ద్విజసంతతులను గూడ మడియఁజేయుచు లోకభయంకరుండై మించియుండెను. అందువలనఁ బ్రతివారును గాళిందిలోఁ బ్రవేశించుటకేగాక తుదకు సమీపించుటకుఁగూడ భయఁపడుచుండిరి. ప్రాణోప

ద్రవకరమగునట్టి యామడుగునందే కృష్ణుఁడుదుమికెను. అందు
వలననే గోపకులంబంతయు నాతనిఁగూర్చి దుఃఖింపసాగెను.

కృష్ణుఁ డట్లు తన నివాసంబగు కాళిందియందు దుమికి నంతనే, కాళీయుఁడు రౌద్రాకారంబున విజృంభించి 'ఏమిది? పరప్రాణాపహరణ ప్రయుక్తవిషానలజ్వాలా సమేతుండనగు నన్నుమఱచి యీబుడుతఁడిందు దుముకుటకు సాహసించెఁగా? ఔరా! ఈకాళీయుని ప్రభావమాతనికిఁ దెలియదు కాబోలు! ఒక్కమాఱు నాశక్తినిజూపెదఁగాక' యని పడగలను జక్కగా విప్పి ముఖంబులనుండి విషానల విస్ఫులింగంబులు ప్రజ్వరిల్లుచుండ శరీరంబును బెంచి బాలకృష్ణుని నాపాదమస్తకంబుగాఁ జుట్టి యాతని గాత్రంబునందంతటను గంటులువడునట్లు కఱవసాగెను. కృష్ణుఁడును లీలావినోదియై చేష్టలులేనివాని తెఱంగున భోగిభోగ పరివేష్టితుండై నదీతోయంబుల నుయ్యాలలూగనారంభించెను. అట్టియెడ యశోదా నందులు మొదలగు యాదవు లందఱును మూర్ఛనుండి తేరి కనులవిచ్చి నదివంకదిలకించునప్పటికిఁ గృష్ణుండు కాళీయుని చేతఁ జుట్టఁబడి చేష్టలు దక్కియుండెను. అట్టి యపాయస్థితియందున్న బాలకృష్ణునిఁ గాంచి స్త్రీపురుష బాలవృద్ధసమేతంబుగ యాదవులందఱును బెద్దపెట్టున విలపించుచు 'హా! కృష్ణా! కృష్ణా! ఇంక మాకు దిక్కెవ్వరు? మేమిందఱ ముండియు నిన్ను రక్షింపఁజాల

నందగోకులము. కృష్ణుని కొఱకు దుఃఖించుట.

మైతివే? అయ్యో! కుమారా! నిన్ను యాపద నుండి కాపాడువారెవ్వరు? విషకుచదుగ్ధంబులం ద్రావియు నేహానియు లేక బ్రదికియున్న నీకు నేఁడీ కాళీయుని విషముపాయంబును గూర్చు చుండెఁగదా? కృష్ణా! నేటినుండి మాకు ముద్దుముచ్చటలు సెప్పువారెవ్వరు? అందెలుపాదములందు మ్రోయ మాదాపు నకువచ్చువారెవ్వరు? కుమారా! కుమారా! అయ్యో! తండ్రీ!

సీ॥ శ్రవణరంధ్రంబులు ♦ సఫలతఁ బొందంగ
నెలమి భాషించు వా ♦ రెవ్వ రింకఁ
గరచరణాదుల ♦ కలిమి ధన్యతఁ నొంద
నెగిరి పైఁబ్రాకు వా ♦ రెవ్వ రింక
నయన యుగ్మంబు లు ♦ న్నతిఁ గృతార్థములుగా
నవ్వులు నూవు వా ♦ రెవ్వ రింక
జిహ్వాలు గౌరవ ♦ శ్రీఁజేరఁబాటల
యొడఁ బలికించు వా ♦ రెవ్వ రింకఁ

ఆ॥ వె॥ దండ్రినీవు సర్ప ♦ దష్టుండవైయున్న
నిచటమాకుఁ బ్రభువు ♦ లెవ్వ రింక
మరిగి పాయలేము ♦ మాకు నీతోడిద
లోక మీవులేని ♦ లోకమేల?"

అని యందఱును గుంపుగట్టి నదియందుఁ జొచ్చుటకుఁ గడం గిరి. అట్టియెడ బలభద్రుండు డగ్గఱంబువచ్చి కృష్ణున కెంతమాత్రం బపాయంబు సంభవింపనేరదని వారికి నచ్చజెప్పి వారియుద్యమంబును మాన్పెను.

కృష్ణుఁడును బంధుజనుల దుఃఖావస్థనుగాంచి యుపేక్షించుట మంచిదిగాదని యెంచి యంచితంబుగ మేనువెంచి మించి కాళీయుని పంచప్రాణంబుల వంచింప నుంకించి రెట్టించిన యట్టహాసంబున విజృంభించి, వడిగలిగిన పడగల మీఁద నడిదంబు వడువున నాభీలంబగు నిజకరంబు నెత్తి ప్రచండ ధ్వానంబనూనంబగునట్లు సఱచెను. ఆప్రేటునకు శిరంబులు వగిలి నెత్తురులు గ్రక్కుచు. గాళీయుఁడు చేష్టలు దక్కినవాఁడయ్యెను. అట్టియెడఁ గృష్ణుఁ డాతని ఫణంబులపై నెక్కి కన్నులు వెలికి, దాడలువట్టి నాలుకల నూడఁదీసి, యుప్పొంగుచు గజ్జెలందియలు ఘల్లుఘల్లుమని మ్రోయ నహివాళి యందు నృత్యంబు సేయఁ జొచ్చెను.

కాళీయ మర్దనము.

కాళీయుఁడును గృష్ణుని దుష్టజనదండ ధరావతారుండైన శ్రీహరిఁగాఁదలపోసి కంఠగత ప్రాణుఁడై శ్రీకృష్ణ పరమాత్మను రక్షింపుమని ప్రార్థింపఁ దొడంగెను. ఆసమయంబునఁ గాళీయుని భార్యలైన నాగాంగనలు తమ ప్రాణనాథునకుఁ గలిగిన ప్రాణోపద్రవమునకు మిక్కిలిఁ బరితపించుచుఁ శ్రీహరిఁ జేరంజని కరంబులు మోడ్చి "కృష్ణా! మాకుఁ బతిభిక్షఁ బెట్టుము. మానాథుఁడు సర్వచరాచర భూతేశుండవైన నీతత్వంబు నెఱుంగఁ జాలక యజ్ఞానంబున నీకపచారంబుఁ గావించె, దేవా! నిన్ను జయించువా రెవ్వరు

గలరు? అగోచరుండవయ్యును గోచరుండవగుచుంటివి. నిరాకారుఁడవయ్యు ననంతాకారుండ వగుచుంటివి. నిర్విష్టుండవయ్యును విశిష్టుండవగుచుంటివి. నిర్విశేషుండవయ్యును విశేషుండవగుచుంటివి. రూపరహితుండవయ్యును నానారూపసమన్వితుఁడ వగుచుంటివి. అనామకుఁడ వయ్యును బెక్కునామంబులు గలవాఁడ వగుచుంటివి. ఒక్కండవయ్యును సర్వంబు నీవయగుచుంటివి. విశ్వంబునీవయయ్యును, నీవు విశ్వంబుగాకుంటివి. నిర్గుణుండవయ్యును గుణాచ్ఛాదకుండ వగుచుంటివి. ఆత్మారామత్వంబువలన మునివయ్యును హ్రస్వదీర్ఘస్థూలసూక్ష్మములకుఁగారణ భూతుండవగుచుంటివి. మహాత్మా! విశ్వభావాభావసందర్శనంబుసేయుచువిద్యావిద్యలకు

కాళీయుని భార్యలు కృష్ణుని స్తుతించుట.

గారణుఁడవైన నిన్నెవ్వరెఱుంగఁగలరు? సృష్టిస్థితిలయములకుమూర్తియే మూలకారణము. నీమహత్త్వమక్షోభ్యము. బ్రహ్మాది దేవతలకే నీతత్త్వంబనిర్వాచ్యంబు. శ్రీకృష్ణా! మాకాంతుని రక్షించి మాకు బతిభిక్షఁబెట్టు' మని యనేకవిధంబులఁ బ్రార్థింపఁ గృష్ణుండును భక్తపాలకుండుగావునఁ గాళీయుని ప్రాణంబులఁగాపాడి, తన్నుఁ బ్రార్థించుచున్న సర్పరాజునుగాంచి "ఓయీ! నిన్ను రక్షించితిని. నీవిప్పుడే నీదారాపుత్రాదులతో బయలుదేరి సముద్రమునకుఁబోయి యచ్చోట వసింపుము. నీశిరంబున మదీయ

పాదచిహ్నంబులుండుటవలనఁ బక్షివల్లభుఁడెంతమాత్రమును నిన్ను బాధింపఁడు. ఇప్పుడే పొమ్మని యానతిచ్చి, కాళిందీ నదీతోయంబు లప్పటినుండి జనోపయోగ్యంబులగునట్లు వరం బొసంగి, యొడ్డునఁ దనకై వేచియున్న జననీజనకులను బంధుజనులను జేరంజనెను. కృష్ణుం డట్లు సురక్షితంబుఁగా దమ్ముఁ జేరి నంతనే యాదవు లందఱును మహానందముతో మాటిమాటికిఁ గృష్ణునిఁ గౌఁగిలించు కొనుచు నాతని యమానుష చర్యలను బొగడుచు నిజనివాసంబుల కరిగిరి.

కృష్ణుఁడట్లు కాళీయుని శిక్షించి సురక్షితముగా నంద గోకులమును బ్రవేశించిన కొన్నినాళ్ళకు నందాదు లింద్ర యాగంబును సేయఁ దలంచి తద్వృత్తాంతంబు నంతయుఁ గృష్ణునకుఁ దెలియఁజేసి 'నీయభిప్రాయమేమి' యని యాతని నడిగిరి. అప్పుడాతఁడు వారిఁ గూర్చి 'ఇంద్ర యాగంబును మీరేల సేయవలయు'? నని ప్రశ్నించెను. అందుకు నందాదులు బహుహూతునకుఁ బ్రియఁబుగా యాగంబు నొనర్చిన నాతండు సంతోషించి వానలు గురియించు ననియు, వానల వలన వసుమతి యందుఁ గసవు పెరుగు ననియుఁ గసవు వనల గోగణంబులు వృద్ధిసెందు ననియు, వానివలన వలసినంతపాడి తమకు లభించు ననియు నందువలనఁ దమ కులంబంతయు సకలసంపదలతో విరాజిల్లు ననియుఁ గావున నింద్రయాగంబు

సేయ సమకట్టిరి మనియుఁ దెలియజేసిరి.

కృష్ణుని కర్మప్రబోధము.

అప్పుడు కృష్ణుఁడు వారినిఁ గాంచి "బంధువులారా! ఇంద్రునివలన మనము పెంపువహింప నేల? ఆతఁడు మన కెంతమాత్రమును గర్తకానేరఁడు. కర్మయే యన్నింటికిఁ బ్రధాన మగుచున్నది. కర్మవలననే జననమరణంబులును, వృద్ధిక్షయంబులును శరీరధారులకుఁ గలుగుచున్నవి. అట్టియెడ నింద్రుని మనమెందుకుఁ బూజింపవలయును? ఇంద్రుఁడైనను గర్మకు లోఁబడినవాఁడే. ఆతఁడు కర్మఫలమును బోఁగొట్టఁజాలఁడు. ఉత్పత్తిస్థితి లయంబులకు సత్త్వరజస్తమోగుణంబులు ప్రధానంబు లగుచున్నవి. రజంబున జగంబు జన్మించుచు, రజోగుణ ప్రేరితంబులై మేఘంబులు వర్షించు. అట్టి వర్షంబువలన మీరు వాకుచ్చినదంతయు సమకూరును. అప్పుడు ప్రజాభివృద్ధియగును. కావున నింద్రయాగంబుతో నిమిత్తంబు లేదు. కర్మంబు ననుసరించి ప్రజావృద్ధికిఁ బసులకుఁ గొండకు, బ్రాహ్మణోత్తములకుఁ బూజలు గావించుట సమంజసము. కావున మీరందఱును గోవర్ధన పర్వతంబును బూజింపుఁడు. దానివలననే మనకన్నియును సమకూరఁగల" వనిపల్కెను. యాదవులును గృష్ణునిహితంబు ననుసరించి హరిసమేతులై గోవర్ధనగిరికిఁ బూజలు సేసి భూసురాశీర్వాదంబులతోఁ బర్వతంబునకుఁ బ్రదక్షిణపూర్వక నమ

స్కారంబు లొనర్చి గోవులను బురస్కరించుకొని గృహంబుల కరిగిరి.

కృష్ణుని హితంబును బాటించి గోపకులుతన్ను మఱచి నారని యింద్రుఁడు కోపించినవాఁడై వారికి బుద్ధి సెప్పఁ దలంచి మేఘంబులఁ బురస్కరించుకొని సకలభువనంబులు కంపించునట్లు, పిడుగులతోఁ గూడిన శిలావర్షంబును నందగోకులంబుపైఁ గురియింపసాగెను. ఆప్రచండ శిలావర్ష విజృంభణంబునకు గోపకులు వెఱచి హాహాకారంబులు సేయుచు "కృష్ణా! రక్షింపుము. రక్షింపుము" అని మొఱలిడసాగిరి. కృష్ణుండును వాసవుని యఖండగర్వంబును బోఁగొట్ట దలంచి, యపాయంబు లేదని బంధుజనుల హెచ్చరించుచు, సకలలోకంబులు తన్నుగీర్తించునట్లు, గోవర్ధనంబు నవలీలఁగానెత్తి ఛత్రంబు పగిదిఁ గొనవ్రేలిచూఁదు నిలిపినవాఁడై క్షణోపాయంబుఁ గానక విలపించుచున్న నందగోకులంబును గాంచి "బంధువులారా! ఎంతమాత్రమును భయపడవలదు. ఇదిగో ఈకొండక్రిందికి రండు, ఇదియే మిమ్మును, మీదారాపుత్రాదులను, మీగోగణంబులను, గొడుగువలె నెగడి శిలావర్షంబు నుండి రక్షింపఁగలదు. మఱియు నోబంధువులారా!

శా. బాలుం డీతఁడు కొండ దొడ్డది మహా • భారంబు సైరింపఁగాఁ
జాలండో యని దీని క్రిందనిలువన్ • శంకింపఁగాఁ బోల దీ

శైలాంభోనిధిజంతు సంయుత ధరా ♦ చక్రంబు పైఁబడ్డ నా
కెల్లాడదు బంధులార నిలుఁడీ ♦ క్రిందం బ్రమోదంబునన్ .

గోవర్ధనగిరి నెత్తుట ఇంద్రుఁడు క్షమింపబడుట.

అని హెచ్చరించి ధైర్యంబుసెప్ప హరివచనంబులు నమ్మి తమ తమ గోధన పుత్రమిత్రకళత్రాది సమేతులై యాదవులాకొండ గొడుగు చాటున నిలచిరి. ఇంద్రుండు నేడహోరాత్రంబులు శిలావర్షమును గురియించియు గోపకులను శిక్షింపఁ జాలక మేఘంబుల మరలించుకొనిపోయెను. వర్ష మాగినతోడనే కృష్ణుండును బంధువుల వెలుపలి కంపి పర్వతంబు నెప్పటియట్లుంచి గోపకులను గలిసి కొనెను. తమ ప్రాణరక్షణం బొనర్చిన బాలకృష్ణుని వల్లవులెల్లఁ గౌఁగిలించుకొని సముచితప్రకారంబుల సంభావించి దీవెన లొసంగిరి. అచ్చోట వాసవుండు కృష్ణుని సామాన్యునిఁగా దలంచి తానొనర్చిన పనికి లజ్జించుచు శ్రీహరిఁ జేరంజని తన తప్పును క్షమింపుమని యనేక విధంబులఁ బ్రార్థించెను. కృష్ణుండును దగిన విధంబున నింద్రునకు బుద్ధిసెప్పి యెదిరిబలంబు నెఱుంగక యెన్నండును గయ్యంబునకుఁ గాలు దువ్వకుమా యని హెచ్చరించి యాతనిని వీడ్కొలిపెను. యాదవప్రముఖు లందఱును గృష్ణుని లీలామానుషచర్యలను బదింబదిగఁ దలంచుచు నాతని యందు మింపుల భక్తిగలిగి యుండిరి.

బలరామ కృష్ణుల యసమాన శౌర్య పరాక్రమ విశేషంబులు భూనభోంతరాళంబులఁ బ్రతిధ్వని లీనుచుండ మథురాపురంబునఁ గంసుండు రేయింబవలు నిద్రాహారంబుల మాని బలరామకృష్ణుల వధోద్యోగంబును గూర్చియే పెక్కు-భంగులఁ జింతింపఁ దొడంగెను. తానొనర్చిన ప్రయత్నంబు లన్నియు నిష్ఫలంబు లగుటవలనఁ గపటోపాయంబున వారల నెవ్విధినైన నిజపురంబునకు వచ్చునట్లొనర్చి మట్టుపెట్టవలయు నని తుదకు నిశ్చయించుకొని వారలను మథురాపురంబునకుఁ గొనివచ్చుటకై యక్రూరుండను వానిని బృందావనంబునకుఁ బంపెను.

అక్రూరుఁడు బృందావనమునకువచ్చుట.

అక్రూరుండును శ్రీహరినిఁ గన్నులారఁ జూచు భాగ్యంబు తనకు లభించినందుకు జన్మంబు సార్థకంబయ్యెనని తలపోయుచుఁ గృష్ణుని లీలలఁగూర్చియనేకవిధంబులఁ దనలోఁ దాను భాషించుకొనుచుఁ గ్రూరుండగు కంసుని పంపునఁ దానరుగుచున్న వాఁడగుట వలనఁ దన్నాతఁడు వేఱుగా భావించి కరుణింపఁడేమోయని శంకించుచు, భక్తపాలకుండగు హరి, యతని పదకమలయుగళసేవాపరాయణుండగు తన్నేల కనికరింపకుండునని తనకుఁదానే ధైర్యంబు సెప్పికొనుచు, సకలభూతాంత ర్బహిర్మధ్య సంగతుండగు కృష్ణుండు తన నిజ

స్వభావమునుగుర్తింప నేరఁడాయని తర్కించుకొనుచు నివ్విధంబున గతిపయ దివసంబులు ప్రయాణంబు నొనర్చి, యచిరకాలంబుననే చందనకుందకుటజతాలసాలకురువకవటమాకందతరుపరిశోభితంబగు బృందావనంబును జేరి యందుఁ బ్రవేశించి శ్రీకృష్ణ బలరామ బాహుదండ ప్రాకార రక్షావిశేష భూషంబైన ఘోషంబున నొక్కదెసఁగల నందుని మందిరంబును జొచ్చి యందు మందహాస రుచిరోదంచిత వదనారవిందుఁడగు నరవిందదళాక్షుని సందర్శించెను.

అక్రూరుండట్లు తన్ను సందర్శించినంతనే కృష్ణుండాతని కెదురేగి తోడ్కొనివచ్చి సముచిత ప్రకారంబుల నర్ఘ్యపాద్యాదివిధులఁ బూజించి సుఖాసీనుఁగా నొనర్చి కుశలప్రశ్నమడిగెను. అక్రూరుండును దనువునఁ బులకాంకురంబులు ముమ్మరంబుగ మల్లడిఁగొన నానందబాష్ప పూరిత నేత్రుండగుచుఁ గృష్ణునిఁ బెక్కు తెఱంగులఁ గొనియాడి యచ్చోటనున్న నందాది ప్రముఖులైన యాదవులందఱును వినునట్లు దాను వచ్చిన కార్యముఁ గూర్చి కృష్ణబలరాములతో" మహాత్ములారా! క్రూరాత్ముండును, మీకు మామయును నగు కంసుం డిప్పుడు ధనుర్యాగంబు సేయనున్నవాఁడు. అట్టి శుభకార్యమునకు మిమ్ముఁ దోడ్కొనిరమ్మని నన్నునుప మిమ్ముఁ గొనిపోవుటకై

అక్రూరుడు తాను వచ్చిన కార్యమును గూర్చి కృష్ణునకుఁ దెలుపుట.

నే నిచ్చోటి కరుదెంచితిని. కాని యిందేమో మోసంబుగల దని నాకుఁ దోచుచున్నది. ఐనను సర్వజ్ఞులరగు మీకుఁ దెలియనిదేమియును లేదు. మీయిష్టానుసారము వర్తించెద" నని తెలియఁజెప్పఁ గృష్ణుండును నగుచు స్వజనంబులఁ గాంచి 'బంధువులారా! నేఁడే మీరందఱును దగిన కానుకలఁ గొని మధురాపురంబున కరుగుఁడు. మే మక్రూరునితో రేపు బయలుదేఱి మిమ్మందఱ నచ్చోటఁ గలిసికొనెదము. యాగమునకుఁ బిలువఁబడకయే యరుగుట శాస్త్రసమ్మతము. అట్టియెడఁ బిలువంబడియుఁ బోకుండుట మంచిది కాదు. కావున మీరిప్పుఁడే బయలుదేరి పొండని పలుక వారును వల్లెయని తమశక్తికిఁ దగినట్లు కానుకలఁగొని శకటారోహణం బొనర్చి యప్పుడే మధురాపురంబున కరిగిరి.

కాళిందియందు రామకృష్ణుల నక్రూరుండు గాంచుట.

మఱునాటి యుదయమునఁ దనవియోగంబునకు సహింపఁజాలక మధురానగరంబున కరుగవలదని తన్ను నిరోధించు వల్లవీజనంబులఁ దాను దిరిగివచ్చెదనని యనేకవిధంబుల నూరడించి బలభద్ర సమేతుండై యక్రూర చోదితంబైన మణిస్యందనంబు నెక్కి శ్రీకృష్ణుండు మధురాభిముఖుండై యరిగెను. అట్లు చనుసమయంబున మధ్యేమార్గంబునఁ గాళిందీ నదియొద్ద స్యందనంబు నిలిపి యున్నతోఁ గృష్ణుండు తన్మధుర సలిలపానం బొనర్చి కొంత

తడవు తత్సమీప తరుచ్ఛాయా శీతల సికతా తలంబున విశ్ర మించి తిరిగి రథంబును బ్రవేశించెను. అట్టియెడ నక్రూరుండు స్నానంబు సేయ నిచ్ఛగించి రథంబునఁ గృష్ణ బలభద్రుల భద్రంబుగా నుండజేసి నదిఁ జొచ్చెను. అందాతఁడు జలంబుల మునింగి స్నానంబు సేయుచుండఁ దన్నదీ తోయ గర్భంబున బలభద్ర ద్వితీయుండైన శ్రీకృష్ణ పరమాత్మ యాతనికిఁ బ్రత్య క్షమయ్యెను. ఇదియేమా యని విస్మయంబునొంది యాతండు లేచి రథంబువంకఁ దిలకింప శ్రీకృష్ణబలభద్రులు రథంబునందే యుండిరి. తిరిగి యాతండు జలంబుల మునింగినంతనే క్షీర సాగర శయనుండైన శ్రీమహావిష్ణుమూర్తి యాతనికిఁగానంబడి యెను. అప్పుడక్రూరుండు కృష్ణుండు కేవలము పరమాత్మ స్వరూపుండనియు, బలభద్రుం డాది శేషుం డనియు నెఱింగి భక్తిపారవశ్యంబున నామహాత్ములఁ బ్రస్తుతించుచు మేను మఱచియుండఁ గృష్ణుండాతనిఁ బ్రొద్దాయెనని హెచ్చరించెను. అక్రూరుం డప్పటికి దెలివినొంది జలంబులనుండి వెలువడి, రథంబు నధిరోహించి బలరామకృష్ణుల ననేకవిధంబుల, గీర్తిం చుచుఁ బ్రొద్దుగ్రుంకువఱకు మధురానగరంబును సమీపించు నట్లు రథంబును నడిపెను. కృష్ణుండును బలరామునితో బురంబు వెలుపలనే యరదంబునుండి డిగ్గి యక్రూరుని వీడ్కొ లిపి, పురోపవనంబునఁ దన రాకకై యెదురు సూచుచున్న బంధువులఁ జేరంజనియెను.

తెల్లవాఱినదే తడవుగా శ్రీకృష్ణ బలభద్రులు కాల కృత్యంబుల నిర్వర్తించుకొని మధురానగరప్రవేశ మొనర్చిరి. అట్టియెడ రజకుం డొక్కరుండు భూపరిపాల కోచితంబులగు దుకూలంబులం గొని యెదురు సనుదెంచు చుండఁ గృష్ణుండు వానిఁగని యావస్త్రంబులఁ దమ కిమ్మని యడిగెను. ఆతం డును దుర్మదావివేకంబున నగుచు 'ఏమీ వెఱ్ఱిగొల్లలకుఁగూడ దుకూలంబులు గావల యునా? యని పరిహాసం బొనర్చెను. అంత

మధురానగర ప్రవేశము.

కృష్ణుం డాతనిపైఁ గినుక వహించి పిడికిట నాతని శిరంబు వగులఁజేసి యాతని యొద్దనున్న పట్టువస్త్రంబులఁ గొని తానును బలభద్రుండును ధరించుకొనిరి. నూతన వస్త్రధార ణంబున నినుమడించిన మోహనాకారంబుతో నరుగుచున్న కృష్ణునిఁ గాంచి పౌరకాంతలు "ఆహా! ఈ సుందరాకారునితోఁ గలసి క్రీడించుటకు గోపిక లెట్టినోములునోచికొనిరో కదా?" యని తమ్ము గూర్చి నిందించుకొనఁ జొచ్చిరి. పురుషులగువారును, నాతని మోహ నాకారంబునకుఁ దన్మయులగుచు నాతని యమా నుష తేజో విశేషంబులఁ గూర్చియుఁ బనులఁగూర్చియుఁ బలు విధంబులఁ దలంపసాగిరి. బలరామకృష్ణులట్లు గొంతదవ్వరుగు నప్పటికి వాయకుం డొక్కండు వారల కెదురువచ్చి భక్తిపూర్వ కంబుగా నమస్కరించి మిక్కిలి మనోహరంబులగు వస్త్రంబు

పౌర జనాభిప్రాయము.

లను, విలువఁగల భూషణంబులను సమర్పించెను. కృష్ణుండును వానిఁగైకొని యాతనియెడఁ గరుణవహించినవాఁడై యాతం డొనర్చినయంతమాత్రపుబనికే యాతనికష్టైశ్వ ర్యములు గలుగునట్లు వరంబొసంగెను. అచ్చో టునువాసి మఱికొంత దవ్వరుగునప్పటికి సుదా ముండను మాలాకారుండెదురుసనుదెంచి వినయపూర్వకంబుగా రామకృష్ణులకు దివ్యములైన సురభి కుసుమ దామములను సమర్పించెను. ఆపనికిఁగృష్ణుఁడు సంతసించి 'ఏమివలయునో కోరుకొనుము. ఇచ్చెద' నని యాతనితోఁ బలుక నమ్మాలికుండును గరంబులు మోడ్చి 'మహాత్మా! నాకితరంబు లేవియునువలదు. నాకు వల యున దేమనఁగా.

వాయకుని గరుణించుట.

సుదాముని కరుణించుట.

కం నీపాదకమలసేవయు
నీపాదార్చకులతోడి । నెయ్యమును నితాం
తాపారభూతదయయును
దాపసమందార నాకు । దయసేయఁగదే!,

అని వేడికొనఁ గృష్ణుం డట్లకాకయని వెండియు నాతనికి బలాయుః కాంతికీర్తి సంపదల నొసంగి యగ్రజునితో ముం దునకరిగెను. అట్టియెడఁ గుబ్జయను కంసుని దాసియొక్కర్తుక విలేపనంబులఁగొని రాజభవనంబున కరుగుచుండఁ గృష్ణుఁడా దాసిని సమీపించి 'ఓసుందరాంగీ! మాకుఁగూడ విలేపనం

బుల నొసంగెదవా?' యనియడుగఁ గుబ్జయు "ఓసుందరా కారా! కుబ్జనగు నన్ను సుందరాంగీయని యెందుకుఁ బరిహాసించెదవు? ఇవిగో విలేపనంబులఁ గొను" మని ప్రేమపూర్వకంబుగా నొసంగెను. కృష్ణుండును వానినందు

కుబ్జను సుందరాంగిగా నొనర్చుట.

కొని తాను నుడివినవాక్యము వృథకాఁగూడదని యామెను సుందరాంగిగాఁ జేయఁదలంచి దాని పాదంబులను దనచరణంబులతోఁ ద్రొక్కిపట్టి, హస్తాంగుళద్వయము నబల గవుదక్రింద నునిచి మీఁదికెత్తి వక్రస్వరూపంబును జక్కఁజేసి యాకాంతను గేవలము మోహినీదేవతగా నొనర్చెను. కుబ్జయుఁ దనసౌందర్యంబునకుఁ దానే యాశ్చర్యపడినదై, మోహనాకారుండగు కృష్ణునిపై మోహంబునుగొని కామభిక్షఁ బెట్టుమని యాతనిఁ బ్రార్థించెను. కృష్ణుండును, నాకామిని కోర్కె తరువాత సఫలతఁ బొందునని వరంబొసంగి, యవ్విధంబున దన్ను నమ్మినవారినిఁ గరుణించుచుఁ గొంతవఱకుఁ బురంబున గలయఁదిరిగి నాటికిఁ బురవిహారంబుసాలించి యన్నతో వెడలి విడిదలకుఁజని తనవారలఁ గలసికొనెను.

తన పురంబునందే కృష్ణుండొనర్చిన యద్భుతకార్యంబులకుఁ గంసుఁడు వెఱఁగంది యాలసించుట యెంతమాత్రమును దగదని మఱుచటి యుదయముననే నందాదులను గృష్ణ

బలరాములను సభాభవనంబున కాహ్వానించెను. నందాదులు ముందరుగ బలభద్రకృష్ణులు వెనుకనరిగిరి. కృష్ణబలరాములు సభామంటప ద్వారప్రవేశం బొనర్చునెడ నాక స్మికంబుగాఁ గువలయాపీడమను మదగజం బొండు నిజపరిపాలక ప్రేరేపితంబై కృష్ణునిపై గవిసెను. కృష్ణుండు నిమిషమాత్రంబేనియుఁ జలింపక తనపైకిఁ బరతెంచుచున్న యాగంధనాగంబున కెదురు నడచి హార్య క్షంబు వడువున నవలీల దానిపైకి లంఘించి దనుజ మస్తక విదారితంబగు హస్తంబునఁ దదీయ గుంభస్థలంబు వగులునట్లు చఱచెను. ఆ ముష్టిఘాతంబునకది తెలివిఁదప్పి ధరణిపైనొరగి నెత్తురులు గ్రక్కుచుఁ గొంత తడవునకుఁ బ్రాణంబులఁ బాసెను. అట్లా మదగజంబును గనురెప్పపాటు కాలంబుననే హతంబొనర్చి దాని దంతంబుల నూడబెరికి యన్నయుఁ దానును వానినే యాయుధంబులుగాఁ గైకొని భీకరాకార ముతో బలభద్ర ద్వితీయుండై సభాభవనంబును బ్రవే శించెను. అప్పటి శ్రీకృష్ణబలరాముల రౌద్రాకారములఁ గాంచి కంసుఁడు గడగడ వడక సాగెను. అట్టియెడఁ

కువలయా పీడ మను గజంబును కృష్ణుండు సంహ రించుట.

జాణూరముష్టికులను మల్లులిద్దరు దమనాథు నకుఁ బ్రియంబు సేయఁదలఁచి, శ్రీకృష్ణ బల రాములను గొంతతడవు తమతో మల్లయుద్ధ మును సల్పుట కాహ్వానించిరి. పిలువఁబడినప్పుడు వెను

చాణూర ముష్టి కుల వధ.

దీయుట వీర లక్షణంబుగాదని కృష్ణుండు చాణూరుని, బలుండు ముష్టికుని మార్కొని మల్లయుద్ధ మొనర్ప సాగిరి. నందాదులు తమపుత్రుల కేమిహాని గలుగునోయని దిగుల్పడసాగిరి. ప్రేక్షకులందఱును బెక్కు మల్లయుద్ధంబులం దారితేరిన చాణూర ముష్టికులను గేవలము పసివారగు యాదవ కుమారులపైం బురికొల్పుట చాల యన్యాయమని కంసుని దూషింప సాగిరి. కంసుండు దనమల్లసింహంబుల వలన గోపాలకుంజరంబులు మడియుట నిక్కమని తలంపసాగెను. అట్టియెడం గృష్ణ బలభద్రులు తమ్ము మార్కొనిన యామల్లులను విచిత్ర గతుల నొప్పించి చూచువా రాశ్చర్య పడునట్లును, గంసుండు హతాశుడగునట్లును, వారినిం బంచత్వంబు నొందించి భీషణంబుగ సింహనాదంబులు సేసిరి.

పేరునడిన చాణూరముష్టికులు మడిసినంతనే కంసుండు తత్తరంబున నిజభటులంజూచి 'భటులార! చూచెద రేల? యాదవులనందరినిబట్టినుగ్గాడుండు. దేవకీవసుదేవుల ప్రాణంబుల హరింపుడు. నాకుం దండ్రియయ్యు నాపై శత్రుత్వము వహించియున్న యుగ్రసేనుంబట్టి ముక్కలు ముక్కలుగాం గోయుండు. లెండు. మార్కొను' డని హెచ్చరించినంతనే రక్కసభటు లుక్కుమిగిలి యాదవులపై విజృంభించిరి. అట్టియెడ బలుండొక్కరుండే యా దానవభట సంఘంబుల నెదు

ర్కొని గుట్టలు గుట్టలుగాఁ గూల్పసాగెను. అంతఁ గృష్ణుండు రణోల్లాసంబుల్లంబున మల్లడిఁగొన నెల్లరుఁ దెల్లవోవ సింహంబు పిల్లవలెఁ గంస భూవల్లభునిపైకి లంఘించి కేశబంధంబుపట్టి యవలీలఁగ గ్రిందఁ బడవైచి యాతని యురంబునఁదిరంబుగ నాసీనుండై దైత్యభట సంఘాతంబులు తల్లడిల్లునట్లు సకలలోకంబులు సంతసించునట్లు "ఓరీ శిశుహంతకా! నీపాపఫలమిప్పుడే యనుభవింపగల" వని కంసునిఁగూర్చి పలుకుచు వజ్రసన్నిభంబగు తన పిడికిట నాతనిఁజోమ్ము వగులునట్లు వొడచివిగతజీవునిగా నొనర్చెను. అట్టియెడ దేవతలందరును గృష్ణునిపైఁ బువ్వులవానఁ గురియించిరి. అప్సరసలు నాట్యమాడిరి. దేవదుందుభులు మ్రోగెను. మరియు నయ్యవసరంబున—

కంస వధ.

క. చేతులఁ దాళము లొత్తుచుఁ
జేతోమోదంబుదోడ ♦ సిగముడి వీడం
బాతరలాడుచు మింటన్
గీతము నారదుఁడు వాడెఁ ♦ గృష్ణా యనుచున్.

కృష్ణుండు కంసవధంబు నొనర్చుసరికి బలభద్రుఁడును దన్నెదుర్కొనిన దైత్యులనందరిని రూపుమాపెను. ఆగోపబాలకుల యసమాన శౌర్యధైర్య పరాక్రమ తేజోవిశేషంబులకు రక్కసులు భయపడి తలకొక దిక్కువంతునఁ బారిపోయిరి. శత్రుసంహారము సంపూర్తి నొందుటవలన బలభద్ర

కృష్ణులు కారాగారంబుననున్న తమతల్లిదండ్రుల— దేవకీవసు దేవుల— సందర్శించుట కరిగిరి. దేవకీవసుదేవులును దమ పుత్రుల గాంచినంతనే శరీరంబు లుప్పొంగఁ గౌగిటఁజేర్చి ముద్దాడ దొడంగిరి. కృష్ణుండును దల్లిదండ్రుల బంధవిముక్తులుగా నొనర్చి, తనువలన వారికి గలిగిన కష్టంబులకుఁ దమ్ము క్షమింపవలసిన దని ప్రార్థించెను. లీలామానుషవిగ్రహుండైన శ్రీహరి తమ్ము క్షమాపణంబును వేడినంతనే దేవకీ వసుదేవులు మోహితులై కుమారుల నిజాంక పీఠంబుల నిడికొని వారివదనంబులఁ దమ వేడికన్నీటితో దడుపసాగిరి. అట్టియెడఁ గృష్ణుండు మాతా మహుండైన యుగ్రసేనుని రావించి, వినయపూర్వక నమ స్కారంబు లొనర్చి 'తాతా! పుణ్యపురుషుఁడవైన నీ విప్పుడే సింహాసనంబునధిష్ఠించి రాజ్యపరిపాలన మొనర్పు' మని వల్కుచు నప్పుడే యాతనిని రాజుగా నొనర్చెను. అనంతరము మున్ను కంసునకు భయపడి పరదేశంబుల కరిగియున్న యదు వృష్టిభోజమరుదశారకుకురాంధక ప్రముఖులగు సకలజ్ఞాతి సంబంధులను రావించి వారివారి నివాసంబుల నునిచి యివ్విధంబున సర్వంబును గాపాడెను.

బంధుజన సంరక్షణము.

కంస వధానంతరము బలరామకృష్ణులు, బృందావనంబునకరుగక, తల్లిదండ్రులను మాతామహుని సేవించుచు మధురాపురంబునందే నిలిచియుండిరి. వసుదేవుండును కుమారులకుఁ దగినవయస్సు వచ్చియున్నందువలన శాస్త్రసమ్మతంబగు నొక శుభముహూర్తంబు నేర్పరచి, యుపనయన సంస్కారంబును నిర్వర్తించెను. బ్రాహ్మణులకు సదక్షిణంబులుగా ననేక గో భూ హిరణ్యదానంబులను, కుమారుల జన్మసమయంబున మనోదత్తలైన గోవులను, మిక్కిలి విలువఁగల మణిమయ దుకూలంబులను మున్నగు వాని నొసంగి సకలభూతంబులను సంతసింపఁ జేసెను.

రామకృష్ణుల ఉపనయనము, విద్యాభ్యాసము.

కృష్ణుఁడు దన కుపనయనాది సంస్కారంబులు సలుపఁ బడినంతనే, తాను సర్వవిదుండయ్యు నెంతవారికేని గురు శుశ్రూష యనునది యుండి తీరవలయు ననుదాని నిరూపింపఁదలచి సాందీప మహామునియొద్ద గురు శుశ్రూష సేయుచు విద్యాభ్యాసమునకుఁ గడంగెను. అచిరకాలముననె సర్వశాస్త్రేతిహాస చతుర్వేదవిజ్ఞాన పరిపూర్ణుండై గురుననుమతిని గృహస్థాశ్రమంబును స్వీకరింపఁ దలంచి స్వగృహంబునకరిగెను. బలభద్రుండును వేఱొక

గురూత్తమునికడ విద్యాభ్యాసంబును ముగించుకొని మథురా నగరంబునకుఁ దిరిగివచ్చెను. ఇవ్విధంబున రామకృష్ణులు సకలవిద్యాపరిపూర్ణులై గృహస్థాశ్రమ స్వీకారంబునకుఁ దగిన యీడును గలిగినవారై యుండిరి.

కంసుఁడు కృష్ణునివలన మడిసినాఁడను వార్తయెల్లెడలఁ దెలియవచ్చినంతనే యాతని బంధుజనులందఱును గృష్ణునిపైఁ బ్రబల శత్రుత్వమును వహించియుండిరి. అట్టివారియందు మగధ దేశాధీశుండగు జరాసంధుఁడనువాఁడు ముఖ్యుఁడై యుండెను. జరాసంధుఁడును మిక్కిలి బలపరాక్రమములు గలవాఁడగుటవలనను, దనకుఁ గృష్ణునివలనఁ జావులేనివాఁడగుటవలనను, గంసుని మరణంబునుగూర్చి కృష్ణునిపైఁ గత్తి కట్టియున్నవారి కందఱికిని దాను నాయకుండై రామకృష్ణులు గురుకులవాసం బొనర్చుచున్న సమయంబున మధురాపురంబుపై దాడివెడలి, కృష్ణుని స్వజనంబులను బెక్కువిధంబుల బాధించెను. రామకృష్ణులు తిరిగి మధురానగరంబునకు వచ్చియున్నప్పుడుగూడ, జరాసంధుఁడు పెక్కుమారులు దండెత్తివచ్చెను.

ద్వారకానగర నిర్మాణము.

రామకృష్ణులు, తమవలన నాతనికి మృత్యువులేకున్నందువలన నాతని వలన నెట్టి బాధలును గలుగకుండ బంధుజనులను గాపాడుచుండిరి. కాని జరాసంధుఁడు మాటిమాటికి దండెత్తి

వచ్చుచుఁ బురజనులకు శాంతిని జేకూర్చుచుండెను. అందు వలనఁ గృష్ణుఁడు జరాసంధుని బారినుండి స్వజనుల రక్షింపఁ దలంచి, దుర్జనులకు దుర్గమంబును, సుజనులకు సుగమంబును నై యుండునట్లు సముద్రంబు మధ్య ద్వారకయను నొకపురంబును నిర్మింపఁజేసి తనబంధుజనుల నందఱి నందుఁజేర్చి జరాసంధునివలన శాంతిభంగ మొదవకుండునట్లొనర్చెను. నలుప్రక్కల జలరాశియే యగడ్తగాఁగల ద్వారకానగరంబును సమీపించుట కేమియుఁ జాలనివాఁడై జరాసంధుఁడంతటితోఁ దన దండయాత్రలను ముగించెను. కృష్ణుఁడును ద్వారకానగరంబునందుండి సురక్షితులై యుండునట్లు బంధుజనులఁ బరిపాలింపఁ దొడంగెను. జరాసంధాదులకప్పటికి శ్రీకృష్ణుండు కేవలము మనుష్యమాత్రుండు గాఁడను వృత్తాంతము సర్వంబును జక్కఁగా బోధపడెను. కాని శత్రుత్వ మొంతమాత్రమును నశింపలేదు.

బలరాముని వివాహము.

సముద్రమే పరిఖగాఁగల ద్వారకానగరంబున యాదవులందఱును సురక్షితులై యుండిరి. వసుదేవుండు తన పెద్దకొడుకైన రామునకు వివాహంబు సేయఁదలంచి కన్యాన్వేషణంబునకు భూసురుల నియోగించెను. వారును సకలదేశంబులు గలయఁదిరిగి తుదకు రైవతుఁడను నొక మండలేశ్వరుని పుత్రికయైన రేవతియను కన్యను రామునకుఁ దగినదని నిశ్చయించుకొని

వచ్చిరి. రైవతుండును దనపుత్రికను రామునకిచ్చునట్లు బ్రహ్మ దేవునిచేఁ దెలుపఁబడినవాఁడై వసుదేవునకు శుభలేఖనంపెను. వసుదేవుండును నాప్తబంధు పుత్రమిత్రపురోహితకళత్రాది వర్గంబులతోఁ దరలివెళ్ళి యొక్క శుభముహూర్తంబున రామునకు వివాహ సంస్కారంబును ముగించెను. రాముండును రేవతి తోడ ననుకూల దాంపత్యమును నెఱపుచు నామెయందు శశిరేఖయను పుత్రికారత్నమును బడసెను. ఆ బాలామణియు దిన దినాభి వృద్ధినొందుచు సకలసద్గుణంబుల కాలవాలంబగుచు జననీజనకులకేగాక సమస్తజనులకును ముదమును గూర్చు చుండెను. అట్టి పుత్రికారత్నమును బలరాముఁడు తనకు మేన ల్లుండును, సుభద్రార్జునులకు ముద్దుపట్టియునగు నభిమన్యున కిచ్చి వివాహంబు గావించెను.

బలరాముండట్లు రేవతీసహితుండై కాపురంబుసేయు చుండఁ గృష్ణునకుఁగూడ వివాహంబు సేయవలయునని వసు దేవుండు చింతింపసాగెను. కాని శ్రీహరి స్వరూపుండైన తన కుమారునకు లక్ష్మీస్వరూపురాలైన కన్యకామణి యెచ్చోట లభించునాయని వసుదేవుండు మిక్కిలిగ విచారింపఁ దొడంగె. ద్వారకానగరవృత్తాంతంబిట్లుండ నచ్చోటవిదర్భ దేశంబునకు రాజధానియైన కుండిననగరంబున భీష్మకుం డను నొక దొడ్డరాజునకు లక్ష్మీదేవి యంశంబున జనించిన

రుక్మిణియను బాలామణి శ్రీహరిని భర్తగాఁ బడయవలయు
నని యాలోచింప సాగెను. భీష్మకుండును

రుక్మిణీదేవి చరిత్రము.

నారదాది మహామునీంద్రులవలన శ్రీకృష్ణుని యొక్కయుఁ దనపుత్రికయొక్కయు నిజ చరిత్రంబుల నెఱింగినవాఁడై తనబిడ్డను వసుదేవనందనున కొసంగవలయునని నిశ్చయించుకొనెను. కాని యాతని పెద్దకొడుకగు రుక్మియనువాఁడు కృష్ణునియెడ నకారణ విరోధంబును వహించి తనచెల్లెలినిఁ జేది దేశాధీశుఁడును, గృష్ణున కాగర్భశత్రువునగు శిశుపాలున కీయఁదలంచి బంధువులను దుదకుఁ దల్లిదండ్రులను నడ్డుపెట్టి వివాహ ప్రయత్నములఁ గావింపఁ దొడంగెను. భీష్మకుండును గుమారున కెదురు పలుకఁజాలక దైవవిధి యెట్లున్నదో యట్లే జరుఁగఁగలదని మిన్నకుండెను. శేముషీ సింధువులగు బంధువు లందఱును దుస్సంధుఁడగు రుక్మిని 'నీకిది తగదు' అని యెన్నియో మాఱులు బుద్ధిసెప్పిరి. తుదకు నారదుఁడును, 'ఈకార్యమునందు నీవు పాల్గొనినచో నిక్కముగాఁ గృష్ణుని వలనఁ బరాభవింపఁ బడెద' వని యాతనికిఁ దెల్పియుండెను. కాని రుక్మి యెవ్వరిని లక్ష్యపెట్టలేదు.

రుక్మిణికి మొదటినుండియు శ్రీకృష్ణునియందే బద్ధానురాగముండెను. అట్టియెడ నామె రెండవవానిఁ జేపట్టనేర్చునా? తన వివాహమునకుఁ దనయన్న యడ్డునిల్చి యున్నవాఁడను

మాట నెఱింగిన వెంటనే రుక్మిణి మిక్కిలి విచారమును బొంది కృష్ణునిఁ బొందు టెట్లాయని యాలోచింప సాగెను. తుదకు ధైర్యమువహించి తనకాప్తుండగునగ్నిద్యోతనుఁడను భూసుర శ్రేష్ఠునిఁ దనకడకు రప్పించుకొని యాతనికి సర్వమును దెలియఁజేసి, ద్వారకానగరమున కరిగి యెట్లైనను శ్రీకృష్ణునిఁ

రుక్మిణీదేవి సందేశము.

దోడ్కొని రావలసినదని ప్రార్థించెను. ఆతండును వల్లెయని యానాఁడే ద్వారకకుఁ బయనమయ్యెను. దినదిన ప్రయాణంబు నొనర్చి యగ్నిద్యోతనుఁడు శ్రీకృష్ణుని సందర్శించెను. కృష్ణుండును దన్నుఁగూర్చి వచ్చిన యావిప్రపుంగవుని నర్ఘ్యపాద్యాదివిధుల సత్కరించి కుశల ప్రశ్నాంతర మేమియు నెఱుంగనివానివలె వచ్చిన పనియేమని ప్రశ్నించెను. అగ్నిద్యోతనుండును దాను వచ్చిన కార్యమును దెలుపఁ దలంచి "కృష్ణా! నీవెఱుంగని వృత్తాంతం బేమికలదు? అయినను మాయామానుష విగ్రహుండ వగుటవలన నెఱుంగనట్లు నటించుచుంటివి. నావచ్చిన కార్యమును దెల్పెద వినుము. విదర్భ దేశాధీశుండైన భీష్మకుని పుత్రిక రుక్మిణియను కన్యకామణి నిన్ను వరింపఁగోరి యున్నది. తల్లిదండ్రులందులకు సమ్మతించిరి. కానియామెయన్నయగు రుక్మి యనువాఁడు సర్వప్రాణ రంజకుండవగు నీయందేలకో శత్రుత్వమును వహించి తనచెల్లెలిని శిశుపాలునకీయఁ

దలంచి యుండెను. కుమారున కెదురాడఁజాలక భీష్మకుఁడు మౌనము వహించెను. తనయన్నయొక్క దురాలోచనమును దెలిసికొని రుక్మిణి యనాథ రక్షకుండవగు నీకడకు నన్నంపి నది. ఇదిగో! ఆమె నీకుఁగా నావలనఁజెప్పి పుత్తెంచిన సందేశంబును దెల్పెద వినుము——

"కృష్ణా !

సీ॥ ఏనీగుణములు క ♦ ర్ణేంద్రియంబులు సోక
దేహతాపంబులు దీరిపోవు
నేనిశుభాకార ♦ మీక్షింపఁగన్నుల
కఖిలార్థ లాభంబు ♦ గలుగుచుండు
నేనిచరణసేవ ♦ లేప్రాద్దుచేసిన
భువనోన్న తత్వంబుఁ ♦ బొందఁగలుగు
నేని లసన్నామ ♦ మేప్రొద్దుభక్తితోఁ
దడవిన బంధ సం ♦ తతులువాయు

గీ॥ నట్టినీయందు నాచిత్త ♦ మనవరతము
నచ్చియున్నది నీయాన ♦ నానలేమ
కరుణఁజూడుము కంసారి ♦ ఖలవిదారి
శ్రీయుతాకార! మానిని ♦ చిత్తచోర!

సీ॥ ప్రాణేశ! నీమంజు ♦ భాషలువినలేని
కర్ణ రంధ్రంబుల ♦ కలిమియేల?
పురుషరత్నమ! నీవు ♦ భోగింపఁగాలేని
తనులతవలని ♦ సౌందర్యమేల?

భువనమోహన! నిన్నుఁ ♦ జూడఁగానఁగాలేని
చక్షురింద్రియముల ♦ సత్త్వమేల?
దయిత నీయధరామృ ♦ తం బానఁగాలేని
జిహ్వకు ఫలరస ♦ సిద్ధియేల?

ఆ॥ వె॥ నీరజాతనయన! నీవనమాలికా
గంధమబ్బలేని ♦ ఘ్రాణమేల?
ధన్యచరిత! నీకు ♦ దాస్యంబుసేయని
జన్మమేల? యెన్ని ♦ జన్మములకు.

ఉ॥ అంకిలి సెప్పలేమ చతు ♦ రంగబలంబుల తోడనెల్లి యో
పంకజనాభ నీవు శిశు ♦ పాలజరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షస వి వాహమునన్ భవదీయ శౌర్య మే
యుంకువసేసి కృష్ణ! పురు ♦ షోత్తమ! చేకొనిపొమ్ము వచ్చెదన్.

కావునఁ గృష్ణా! అనాథయగు నాకన్యకామణిని రక్షింపుము. బయలుదేరుము. లెమ్ము అని విన్నవింపఁ గృష్ణుండును రుక్మిణి యందదివఱకే బద్ధానురాగంబుఁ గలిగి యున్నవాఁడగుట వలనఁ దోడనే దారుకచోదితంబైన రథంబునెక్కి, యగ్నిద్యోతనునితోఁగలసి విదర్భకుఁ జనెను. రుక్మిణిఁదెచ్చునప్పుడు యుద్ధంబు సిద్ధంబని తలపోసి, శ్రీకృష్ణునకుఁ దోడుగావలయునని యాతఁడరిగిన యనంతరము బలరాముఁడు యాదవసేనాసమేతుండై తానుగూడ విదర్భ కరిగెను.

కృష్ణుండు కుండిన నగరంబును జేరునప్పటికే, పెండ్లి కొడుకగు శిశుపాలుఁడు జరాసంధాది మిత్రులతో వచ్చి

యుండెను. ఆతఁడు పురప్రవేశంబొనర్పక, యగ్నిద్యోతనుని వలనఁ దన రాకను రుక్మిణికిఁ దెలియఁజేసెను. వివాహకాలంబు సన్నగిల్లుచుఁ గులాచార ప్రకారంబు గౌరీపూజార్థమై, రుక్మిణి పురంబు వెలుపలనున్న గౌరీ దేవ్యాలయంబునకు సకల బంధుసమేతయై వచ్చియుండెను. అట్టియెడఁ గృష్ణుఁడొరులకుఁ గానంబడక యదృశ్యరూపుండై యాలయ సమీపంబున నిలిచియుండెను. రుక్మిణియుఁ దనకుఁ గృష్ణునే పతిఁగాఁ గూర్పుమని నగజాతకుఁ బూజలఁగావించి యాలయంబునుండి వెలుపలికి వచ్చెను. ఆసమయంబున లేళ్ళగుంపునందు సింహంబు దుమికిన చాడ్పున విరోధివర్గంబు నడుమ గృష్ణుండు దుమికి యవలీలఁగా రుక్మిణిఁగైకొని నిజ రథంబు నందు నిల్పి ద్వారకా నగరాభిముఖుండై పోవఁదొడంగెను. ఆ యద్భుత

శిశుపాల జరాసంధాదుల పరాభవము.

సంఘట్టనంబునకు శిశుపాల రుక్మి జరాసంధాదులు నివ్వెఱపడి కొంతవడికిఁ దెలివిఁ దెచ్చుకొని యాయుధహస్తులై తమతమ పరివారములతోఁ గృష్ణుని వెంబడించిరి. అట్టియెడ బలభద్రుండు నిజసైన్యంబులతో శత్రువుల కడ్డంబువచ్చి ఘోరాహవంబు సేయఁ జొచ్చెను. ఇంతలోఁ గృష్ణుండు కుండిననగరంబు నతిక్రమించెను. కాని రుక్మిమాత్రము బలరాముని బారి నుండి తప్పించుకొని, నిజసైన్యంబుతో నతిరయంబునఁ జను

దెంచి శ్రీకృష్ణుని మార్కొనెను. శ్రీకృష్ణుండును దృటికాలంబుననే యాతని సైన్యంబుల రూపుమాపి, యాతనిని విరథునింగను హతాయుధునింగను నొనర్చి, కృపాణహస్తుండై యాతనిం దెగవ్రేయుటకు రథంబునుండి క్రిందికి దుమికెను. కాని రుక్మిణీదేవి తన యన్నప్రాణంబులం గాపాడవలసినదని ప్రార్థించెను. కృష్ణుండును గరుణామయుండుగావున నాతనిం జంపక 'బావా! రమ్మని' పిలుచుచు రుక్మిం జేరంజని పదును గల కత్తితో గడ్డంబును, మీసంబును, దలయును రేవులు వాఱనొరిగి యాతనిని వికృతరూపునింగా జేసి విడిచిపెట్టెను. అట్టియెడ బలభద్రుండును శిశుపాల జరాసంధాదులం బారందోలి తనతమ్మునిం గలసికొనెను.

అవ్విధంబునం గృష్ణుండు రుక్మిణిం గైకొనివచ్చి ద్వారకానగరంబున నతివైభవంబుతో నొక్క శుభముహూర్తంబున నామెను బెండ్లియాడెను. కృష్ణుండు రుక్మిణినొక్కదానినేగాక సత్రాజిత్తుని పుత్రికయగు సత్యభామను, జాంబవంతుని పుత్రికయగు జాంబవతిని, నాగ్నజిత్తి, మిత్రవింద, మొదలగు వారల నేడ్గురుని, మఱియు నరకాసురుని వధానంతరమాతండు చెఱపట్టిన పదాఱువేల కన్నియలను బరిణయంబాడెను.

శ్రీకృష్ణుని దారాపుత్రాదులు. రుక్మిణియందు శ్రీకృష్ణుండు ప్రద్యుమ్నుండను కుమారునిం గాంచెను. ప్రద్యుమ్నుండను గాలక్రమంబున బెరిగి పెద్దవాడైయుండు నేడం

కృష్ణుడాతనికిఁ బ్రభావతియను కన్యనుదెచ్చి పెండ్లియొనర్చెను. ప్రద్యుమ్నుండును బ్రభావతితోఁ గాపురంబును సేయుచు నామెవలన ననిరుద్ధుఁడను కుమారు నొక్కనిఁ గాంచెను. అనిరుద్ధుండును బాల్యయౌవనంబులఁ గడచి కౌమారప్రారంభమున బాణాసురుని పుత్రికయైన ఉషా కన్యను వరించెను. కాని బాణాసురుఁడు విష్ణుద్వేషియగుట వలన ననిరుద్ధునిఁ బట్టి కారాగృహంబునం దుంచెను. కృష్ణుండును మనుమని విడిపించునిమిత్తమై బాణునిపై దాడి వెడలి ఘోరాజియందతని సహస్రబాహుల ఖండించి శంకరుఁడు ప్రార్థింప నాతనిఁ జంపక, ఉషాకన్యానిరుద్ధులతో నిజపురంబునకు మగిడివచ్చి తనయవతారంబునం దొనర్పవలసిన కుంతీసుత పరిపాలనముఁగూర్చియుఁ గౌరవ వినాశంబుఁ గూర్చియు విచారించుచుండెను.



పాండురాజతనూభవులైన యుధిష్ఠిర భీమార్జున నకుల సహదేవులను వారు తమపెద్దతండ్రియైన ధృతరాష్ట్రుని యాజ్ఞానుసార మింద్రప్రస్థపురంబు రాజధానిగా ధరణీపాలన మొనర్చుచుండిరి. కృష్ణునకుఁ బాండవులు మేనత్తకుమారులును, నిజచరణసరసీరుహయుగళస్మరణ సుధారసాస్వాదసంజనితసంతతసంతోష సంపత్పరిపూర్ణులును, నందుఁ బాండవమధ్యముఁడగు నర్జునుఁడు, నిజసోదరీ ప్రాణనాథుం డగుట వలనను దుర్యోధన ప్రముఖులగు కౌరవుల మూలంబునఁ గష్టంబులు పెక్కులు వారికిఁ గలుగుచున్నను, నెల్లప్పుడు వారియోగక్షేమములు విచారించుచు నన్నింటను జేదోడుగానిలిచి వారినిఁ గాపాడుచుండెను. ధర్మజుండు కేవలము ధర్మస్వరూపుఁడా యేమి యనునట్లు నయగుణ వర్తనంబున నిలిచియుండుట వలనను, నాతని యనుజన్ములతని యాదేశంబు ననుసరించి వర్తించుట వలనను, రాజలోకంబంతయుఁ బాండవుల ననేకవిధంబుల గొప్పగాఁజూచుచుండెను. కాని, దాయాదులును, ధృతరాష్ట్రనందనులును, నగు సుయోధనాది కౌరవులు మాత్రము వారిని నసూయతోఁ జూచుచుండిరి.

పాండవులచరిత్ర.

ఇట్లుండ నారదప్రేరితులగు పాండవులు తమ చిన్నతనంబునందే మృతినొందిన తమజనకుని యాత్మశాంతికై రాజసూయంబను మహాధ్వరంబు నొకదానిని జేయసమకట్టిరి. అందుకు శ్రీకృష్ణుండును వారల ప్రోత్సహించెను. అన్నిటికిని మూలకారణుండగు శ్రీహరి తమవాఁడగుటవలనఁ బాండవులును ధైర్యమువహించి యామహాధ్వరంబును సలుపుటకుఁ గడంగిరి. ధర్మజుని నల్వురుతమ్ములగు భీమార్జున నకుల సహదేవులు నాల్గుదిక్కులకరిగి యందున్న రాజచక్రంబును నవక్రవిక్రమ పరాక్రమక్రమవిశేషంబున నవలీల జయించి తమయగ్రజునిపేరఁ గానుకలను గొనితెచ్చిరి. కాని జరాసంధుఁడుమాత్రము జయింపఁబడక మిగిలియుండెను.

రాజసూయాధ్వర ప్రయత్నములు.

జరాసంధుఁడు తనకాగర్భశత్రుఁడగుటవలనను, నాతనివలన సాధుహింసయు స్వబంధు హింసయు జరుగుచున్నందువలనను, నాతఁడు జయింపబడనిచోఁ దనభక్తులైన పాండవుల యధ్వరోద్యమమునకు విఘ్నంబు గలుగనున్నందువలనను, శ్రీకృష్ణుండు, జరాసంధవధోద్యోగ సమాచరణంబునకు, భీమార్జున సహితంబుగా బ్రాహ్మణవేషమునుదాల్చి, భూసురాభీష్ట ఫలప్రదాతయగు మాగధునికడకరిగెను. ఆతండును బ్రాహ్మణవేషంబులతో నున్న శ్రీకృష్ణ భీమార్జునులఁగాంచి, యేమికావలయునో

తెల్పుఁడోసంగెదనని పలికెను. అంతఁగృష్ణుఁడును, దమ కాజిభిక్షదక్క యన్యంబువలదని నుడువుచు, వారునుదానును స్వస్వరూపంబులఁదాల్చి తామెవ్వరైనదియు నాతని కెఱుగఁ బల్కెను. జరాసంఘుఁడును, దన్నెదుర్కొనఁజాలక పెక్కు మారులు పారిపోయిన కృష్ణునిఁగాంచి నగుచు, "కృష్ణా? మదీయబలపరాక్రమంబు లింతలోనే మఱపునకు వచ్చెనా? నన్నెదుర్కొనఁజాలక నట్టనడిసముద్రంబున నగరుగట్టుకొన్న జగదేకజెట్టివి నీవేగదా? అయినఁగానిమ్ము. నీవునన్నుఁ గెలువఁజాలవు గనుక నిన్ను నేను మార్కొనను. అర్జునుండు నాకన్నఁ బిన్నవాఁడగుటవలన నాతనితోఁ బోరుట నాయట్టి యుత్తమవీరునకు ధర్మంబుగాదు. అన్నివిధంబుల భీముండు నాకుఁ దగియున్న వాఁడుగావున నాతనితోఁ

జరాసంధ వధ.

బోరెద" నని పల్కుచు ద్వంద్వయుద్ధమునకు వాయుపుత్రుని నాహ్వానించెను. భీముండును, గృష్ణానుమతంబున నుద్దండ గదాదండబునుగొని తొలుఁదొల్తనాతనితో గదాయుద్ధంబునకుఁ దలపడెను. జరాసంధుఁడును బాహుబల పరాక్రమము లయందసమానుండగుట వలన నన్నివిధంబుల భీమునకు సమానమగుచుండెను. గదాయుద్ధంబు ఘోరంబుగా జరుగుచున్న సమయంబున నన్యోన్య సంఘర్షణంబున నిరువురిగదలు ముక్కలగుడునంత నొక

రితో నొకరు ముష్టాముష్టి, బాహాబాహి, కచాకచి, పోరాడఁ దొడంగిరి. అట్టియెడ భీముండలసటనొంది, యరినిరసనోపాయంబు గానక చింతించుచుండఁ గృష్ణుండది తెలిసికొని, భీముండు తనదిక్కు సూచుచుండ నొక్క శాఖాగ్రంబును రెండుగాఁ జీల్చివైచి, జరాసంధు నట్లు హతమొనర్పవలసినదని సంజ్ఞగాఁజూపెను. గాడ్పుపట్టి యాకీలు దెలిసికొని, యినుమడించిన సమరోత్సాహంబున, సమధిక బాహుబలాతిశయుండగుచు, జరాసుతుని నవలీలఁ బుడమికిఁబడఁద్రోసి, నిజచరణంబున నాతని చరణంబొండు ద్రొక్కిపట్టి బాహుయుగళంబున రెండవచరణంబును గదలకుండఁబట్టి, హరికృపాలబ్ధబలోన్మత్తాతిరేకంబున లేఁగొమ్మను జీఱినట్లు పాదజానుజంఘోరుకటిమధ్యోదరాంస కర్ణనయనంబులు సమానంబులుగ వేఱుభాగంబులగు చాడ్పున వ్రయ్యలువాపి విష్ణుద్రోహియు, లోకద్రోహియునగు జరాసంధుని హతమొనర్చి సింహనాదం బొనర్చెను.

అవ్విధంబున మాగధుని సంహరించి కృష్ణభీమపార్థులు ధర్మజుని జేరంజనినంతనే యాతండును, దిగ్విజయంబు సంపూర్తి నొందినదగుటవలన, విధ్యుక్త ప్రకారంబుగా నధ్వరదీక్షను గైకొనెను. ఆయధ్వర మహోత్సవంబునకు, నారద సాత్యవతేయ కస్యప భరద్వాజ విశ్వామిత్ర వీతిహోత్ర

మైత్రేయ మధుచ్ఛంద గౌతమ భార్గవ వసిష్ఠ వామదేవ ధౌమ్యపరాశర కణ్వవైశంపాయన ప్రముఖులగు సకలమునీంద్రులును, వివిధ దేశాధీశులగు భూపాలురును, యాదవ ద్రుపద కౌరవ ప్రముఖులగు బాంధవులును భీష్మద్రోణ కృపాశ్వత్థామ విదురాది యాత్మీయులును, మొదలగు వారందఱును వచ్చియుండిరి. శ్రీకృష్ణుఁ డన్నివిధంబుల ధర్మజునకుఁ దోడుగానుండెను. అధ్వర మంటపంబుననున్న సకలజనులు వినునట్లు, నారదుండు, ధర్మజుని ధర్మప్రవర్తనముఁ గూర్చియు, నాతని రాజసూయ మహాధ్వరవైభవంబును గూర్చియుఁ బలుతెఱంగులఁ గొనియాడెను. అట్టియెడ భీష్ముఁడు తత్క్రతు వైభవంబున కెంతయు సంతోషించి ధర్మజుఁజూచి 'ధర్మజా! స్నాతకుఁడును, ఋత్విజుఁడును, సద్గురుఁడును, భూతలేశుఁడును, సంయుజుఁడును, ననువారలు పూజనీయులగుచున్నారు. అట్టి వారియందు సద్గుణ శ్రేష్ఠుఁడగు వాఁడుత్తముఁ డగుచున్నాఁడు. కావున నిచ్చోటనున్నవారిలో నట్టి వానినొక్కని గుర్తించి, యాతనికగ్రతాంబూలంబునిడి, యధ్వరంబొనర్పఁగడంగుము. ఇది ధర్మపద్ధతి' యనివచింప, ధర్మజుఁడట్టివానిని గురుతింపనేరక 'తాతా! అట్టిపుణ్యపురుషునిఁగూడ నీవేనిర్ణయింపు'మని భీష్మునితోఁబలికెను. అంత బ్రహ్మజ్ఞాన పరిపూర్ణుండగు మందాకినీ

శ్రీకృష్ణుని సభాపతిత్వము.

నందనుఁడు 'ధర్మజా! క్రతుహర్తయు, క్రతుభోక్తయు, క్రతుమూర్తియు, క్రతుకర్తయునగు శ్రీహరి యిందు వెలుఁగుచుండ నట్టి పుణ్యపురుషునికొఱకు వెదకుట యేల? చింతించుట యేల? నిర్ణయించుట యేల? అన్నిఁటికిని శ్రీకృష్ణ పరమాత్మయే యాధారభూతము. కావున నామహాత్మునకగ్రతాంబూలంబు నిమ్ము' ని పలుక, ధర్మజుండును, గేవలము యజ్ఞస్వరూపుఁడైన కృష్ణునిఁ బూజించి యగ్రతాంబూలంబు నొసంగెను. అచ్చటనున్న వారందఱును గరతాళంబులొనర్చి తమ యంగీకారమును సూచించిరి. శ్రీకృష్ణుఁడు సంతసించుటవలన సకలభూతములు సంతసించెను. నభోకాంతామణి కనుఁగొనల నుండి యానందబాష్పములు రాలుచున్నవా యేమి యనునట్లు పువ్వులతోఁ గూడిన యాకాశగంగోర్మిశీకరంబులు రాలఁ జొచ్చెను. విశ్వమంతయు, విశ్వమయునిఁ గూర్చి యానంద లహరియందు మునుంగఁజొచ్చెను.

ఆనంద రస సాగర సముత్తుంగ తరంగ డోలికా నివహంబుల నుయ్యెలలూగుచున్న నాసభికుల యందొక్కఁడు మాత్రము కృష్ణునియం దసూయాపరుఁడై చింతాసాగరంబున మునింగి యుండిరి. అట్టివారెవ్వరోగాదు. కృష్ణునకాజన్మవైరి యగు శిశుపాలుఁడే? ధర్మరాజునకు భీష్ముం డుపదేశించుట యు నాతని యుపదేశప్రకారము ధర్మనందనుఁడు కృష్ణున కగ్రతాంబూలంబు నొసంగుటయు దానికి సభికులెల్లరుఁ గరతాళంబుల

శిశుపాలుఁడు నర్మభీష్ములను దూషించుట.

ముఖ్యాలంబునఁ దమయంగీకారంబును సూచించుటయు మొదలుగాఁగలవన్నియు శిశుపాలునకు హృదయవిదారకములుగ నుండెను. ఆతండెంతమాత్రమును సహింపఁజాలక క్రుద్ధుఁడై లేచినిలువఁబడి ధర్మజునిఁగాంచి (ధర్మనందనా! ఇన్నినాళ్ళ నుండియు సకలధర్మాధర్మ విచక్షణుండవని నిన్నుఁదలఁచి యుంటిని. నీధర్మబుద్ధియంతయు నేఁడు దెలియవచ్చినది. వృద్ధాప్యమువలన యుక్తాయుక్తజ్ఞానంబుఁ గోల్పోయిన భీష్ముండు సెప్పినంతనే, దానియందుండు నిజానిజంబులనరయక విశిష్టారాధ్యులగువా రెందఱో యిచ్చోటనుండ, వారలఁగాదని కృష్ణునకగ్రతాంబూలంబు నొసంగుట నీకుధర్మమేనా? కృష్ణుని యందేమి గుణంబులున్నవని యాతనిని సభాపతిగా నొనర్చితివి? వృద్ధుని పూజించితినంటివా యందఱికన్న వృద్ధుండగు వసుదేవుండు లేఁడా? ఆచార్యుఁడని పూజించితినంటివా యాతనికంటె గొప్పవారగు కృపద్రోణులు లేరా? ఋత్విజుఁడని పూజించితినంటివా, ద్వైపాయనుండు లేఁడా? భూనాథుండని పూజించితి నంటివా! యయాతి శాపంబువలన యదువంశమున కాగౌరవము లేదని యెఱుంగవా? ధర్మనందనా! కృష్ణునేమని పూజంచితివి? ముదుసలియగు భీష్ముఁడా నీకు ధర్మము నుపదేశించువాఁడు? అనపత్య దోషుండును, రాజకన్యాపహారణుండును నగు గాంగేయుఁడు ధర్మమును దెలుపునంతటి

వాఁడా? ఆహా! ఏమి కాలవైపరీత్యము!

శిశుపాలుఁడు శ్రీకృష్ణుని దూషించుట.

రాజకులంబున కంతకు నేడు నీమూలంబునఁ దలవంపు సంఘటిల్లెఁగదా? ఒకవేళ నీవును భీష్ముఁడును మూఢాభిప్రాయులై యున్నచోఁ కృష్ణుఁడేని యీ సభాపతిత్వము తనకుఁదగదని చెప్పవలదా? తానేమి గుణములు గలవాఁడని యగ్రతాంబూలంబును గైకొనవలయును? ధర్మము ననుసరించినచో, స్త్రీగోబ్రాహ్మణ హింసాపరులగువారు పూజార్హులుగాకపోవుటయేగాక మీఁకుమిక్కిలి యట్టివారు దండనార్హులగుచున్నారు. ఈకృష్ణుండు, స్త్రీవధయును గోవధయును, నమ్మినవారిని జెఱుచుటయును మొదలగు దుష్కార్యముల నెన్నిఁటినో యొనర్చియుండ నట్టివానిని బూజార్హుండని నీవెట్లు భావించితివి? ఏదియేనొక కార్యము సలుపనున్నప్పుడు యుక్తాయుక్తంబుల నెఱుఁగవలదా? ఇదియేనా నీధర్మప్రవర్తనము? ఇదియేనా భీష్ముని ధర్మోపదేశము? ఇదియేనా కృష్ణునిగొప్పతన'మని యనేక విధంబుల ధర్మజనదీసుత కృష్ణులను దూలనాడఁ దొడంగెను.

శిశుపాలుని దూషణ వాక్యములకు సభికులెల్లరును జెవులుమూసికొని, 'హరిహరీ,' యని చింతించుచుండ నట్టియెడ సహదేవుండు రోషకషాయిత నేత్రుండై లేచి యందఱిఁ గలయఁజూచి 'ఓసభికులారా! ఇఁక ముందెవ్వఁడేనియు శ్రీకృష్ణ

దూషణంబొనర్చినచో నట్టివాని శిరంబున నిదిగో మదీయ వామపాదంబు నుంచెద' నని పలుకుచు విజృంభించెను. సహదేవునకుఁ దోడుగా నాతనియన్నయగు భీముండు, ప్రళయకాల పర్జన్య గర్జనంబును నిర్జించు భీషణ గర్జనంబొనర్చుచుచు నుద్దండ గదాదండమండితుండై యాటోపించి 'నేటితో శిశుపాలున కాయువు నిండె' నని విజృంభించెను. అదిగని శిశుపాలుఁడు నిజసైనికులఁ బురికొల్పసాగెను. అట్టియెడఁ దనకుంచెయుఁ గృష్ణమృగాజినంబును బలుమఱువీచుచుఁ గలహాబంధువగు నారదుఁడు నృత్యము సేయసాగెను. అట్టి కలకలంబును గాంచి ధర్మజుండు యాగభంగమగునేమోయని దిగులొందుచుండ భీష్ముండాతనికి ధైర్యముసెప్పి భీమసహదేవులఁ గాంచి "కుమారులారా! మీరొనర్పఁ దలఁచియున్న పనిని కృష్ణుఁడే యొనర్చుచు.

శిశుపాలుని జన్మవృత్తాంతము.

శిశుపాలుఁడు దమఘోషుఁడనువానికి సాత్వతియందు జనించినప్పుడు నాల్గుభుజంబుల తోడను, లలాటంబునఁ గన్నుతోడను బుట్టెను. తల్లిదండ్రులా వికృతాకారంబునకు భయఁపడి చింతించుచుండ నశరీరవాణి 'ఓదంపతులారా! మీరేల చింతించెదరు? ఎవ్వరేని, వీనినెత్తికొనినప్పుడు మిక్కిలి చేతులును, మిక్కిలి కన్నును దొలఁగిపోయిన యెడల నట్టివాని వలననే యీతఁడు సచ్చునుగాని యన్యులవలనఁ

జావ నేరఁడని తెలియఁ జెప్పెను. ఇట్లుండ బలరామసహితుండై కృష్ణుఁడొకనాఁడు వారింటికరుగ మేనత్తయగు సాత్వతి కృష్ణునకుఁ దనకుమారు నందిచ్చెను. కృష్ణుఁడాతని నెత్తికొనినంతనే మిక్కిలి చేతులును, మిక్కిలి కన్నును దొలఁగిపోయెను అప్పుడు తనకుమారుఁడు కృష్ణునిచేత మడియునని యెఱింగి, నూరుతప్పులవరకుఁ దనపుత్రుని క్షమింపవలసినదని కృష్ణునిఁ బ్రార్థింప నాతఁడు వల్లెయని నిజపురంబున కరిగెను. ఆ వరంబువలనఁ గృష్ణుఁ డుపేక్ష సేయుచుండెకాని లేకున్న వీనిప్రాణము లెప్పుడో యెగిరిపోయియే యుండు నని వారల శాంతపఱచెను.

అట్టియెడఁ గృష్ణుండగ్రపీఠంబునుండి డిగ్గి సభికులఁ జూచి, మహాత్ములారా! నేను శిశుపాలుని తల్లికొసంగిన వరప్రకారమీతని శతాపరాధంబుల క్షమించితిని. ఇఁకమీఁద నీతని క్షమింపఁజాలను. నేటితో నీదుష్టుఁడంత మొందఁగలడని చిత్తంబున సుదర్శనంబును దలంచెను.

శిశుపాల వధ. ఆక్షణంబుననే సకలదైత్య దానవ దుష్టజనారణ్య వీతిహోత్రంబగు సుదర్శనంబు విస్ఫులింగంబులెగయఁ బరతెంచి శ్రీకృష్ణుని పాణితలంబు నలంకరింప నాతండును గెంగేల నద్దానిని గిరగిరఁద్రిప్పి శిశుపాలునిపైఁ బ్రయోగించెను. ప్రయోగించుటయే తడవుగాఁ గృష్ణ

ద్వేషియగు శిశుపాలుని మస్తకము రుధిరపూరితంబై ధరణిపైఁ బడెను. దుష్టసంహారంబగుటవలన దేవతలు శ్రీకృష్ణునిపైఁ గుసుమవృష్టిని గురియించిరి. ధర్మజ రాజసూయమహాధ్వరంబును నిర్విఘ్నముగా ముగింపఁబడెను. సర్వవ్యాపియు, సర్వ కారణుండును సర్వాధారుండును, సర్వజ్ఞుండును సర్వవస్తు భూతాత్మకుండును, నగు శ్రీకృష్ణపరమాత్మున కెగ్గాచరించి ప్రాణములతో మనఁగలవారెవ్వరుగలరు ? ఆమహాత్మున కే గాక, యాతనిపాద సేవకుల కేనియు, సేవకుల కేగాక, సేవకజన సేవకుల కేనియు, నెగ్గాచరించి ప్రాణములతో నుండనోపు వారెవ్వరుగలరు?

శిశుపాలుని వధానంతరమాతనియనుచరులగు, సాల్వ పౌండ్రక దంతవక్త్రులనువారు ముువ్వురు సకల సైన్యంబుల సమకూర్చుకొని కృష్ణునిపై దాడివెడలిరి. అందు సాల్వుండు శివునివలనఁ బెక్కువరంబులనందినవాఁడగుటవలన 'ధరణిపై యాదవులనుపేరు లేకుండ నొనర్తు' నని ప్రతిజ్ఞఁ గైకొని యుం శ్రీకృష్ణుఁడు సాల్వ డెను. అట్లు వారు ముువ్వురును దన్నెదు

పౌండ్రకదంత వక్త్రులను వధించుట.

ర్కొన హరియును వారల నెదుర్కొని మహాహవ మొనర్పసాగెను. బలరాముం డట్టియెడ యాదవసైన్యంబులఁ గూర్చుకొని విరోధిసైని కులఁ బరిమార్పఁ దొడంగెను. రోమములు పదివేలు చేరియైనను

సామజమును మరలింపఁగలవా ? శ్రీకృష్ణుండు కొంతవరకు వినోదార్థంబు సంగరంబొనర్చి, పరప్రాణాపహరణోద్యోగాచరణంబున నమోఘంబగు తనసుదర్శనంబును బ్రయోగించి వారల హతమొనర్చెను. వారి చావునుగాంచి విరోధిసైన్యంబులన్నియుఁ బలాయనము లయ్యెను. ఇవ్విధంబునఁ గృష్ణుండు భూభారంబు దగ్గించుచుండెను.



పాండవులు ధర్మపరులయ్యును మాయజూదంబున దుర్యోధనునివలన సకలసంపదలును గోలుపోయి, యనుకొనిన ప్రకారము పన్నెండువత్సరము లరణ్యవాసమును, నొక్కయే డజ్ఞాతవాసమును జరిపి, యుపప్లావ్యంబునకు వచ్చియుండిరి. అట్టియెడ ధర్మజుండు తమ్ముల యాలోచనంబు ననుసరించి, తమకర్ధ రాజ్యంబుచిచ్చుటయో, లేక యుద్ధమునకు సిద్ధపడుటయో, యేదియైనదియుఁ దెలిసికొను నిమిత్తమై కౌరవుల కడకుఁ దమకు వచ్చినవానినిఁ గార్యాకార్య విచక్షణదక్షుని నొకని రాయబారిగాఁ బంపఁదలంచెను. అట్టి

పాండవులు శ్రీ కృష్ణుని రాయబారిగా నెన్నుకొనుట.

వాఁడు శ్రీకృష్ణుఁడొక్కఁడే యని యెఱింగి యామహాత్మునకు ధర్మరాజుతమయభిప్రాయమును దెలియఁజేసెను. కృష్ణుఁడును, దుష్టరక్షణమున భూభారంబు దగ్గింపనవతరించి యున్నవాఁడగుట వలనను, దనకు భక్తురాలును కేవలమయోనిజ సంభవురాలును—నగు ద్రౌపదీదేవికిఁ గౌరవులు మానభంగ మొనర్చి యున్నందువలనను, దాను ధర్మమునంటియుండు వాఁడుగావున "ధర్మోజయతి" యనువాక్యమును సార్థకంబు సేయవలసిన వాఁడగుటవలనను, నన్నిఁటికంటెను గౌరవ వంశ నిర్మూలనమునకే తాను యవతారమెత్తియున్న వాఁడగుటవలనను,

నిన్ని కారణము లుండుటంజేసి, తాను గౌరవులకడకుఁ బాండవుల పక్షమున రాయబారిగా నరుగుటకు సమ్మతించెను. ధర్మజుండును గృష్ణునకుఁ జెప్పవలసిన విషయముల నన్నింటినిఁ జెప్పి హస్తినాపురంబున కంపెను.

కృష్ణుండును హస్తినాపురంబున బ్రవేశించి తన భక్తుండైన విదురునియింట బసచేసి, యొకనాఁడు ధృతరాష్ట్రుండాప్త బంధు పుత్రమిత్రాదులతో నిండుపేరోలగంబుండిన సమయమున రాజానుమతిని గౌరవ సభామందిరంబున బ్రవేశించెను. కృష్ణావతార తత్త్వంబును సంపూర్తిగా నెఱింగినట్టి భీష్మ ద్రోణాదు లాతనికి నాత్మ నమస్కారంబు లొనర్చి పరమాత్మగాఁ దలంచుచుండ మూఢులగు దుర్యోధనాదు లా మహనీయునొక యలంతి మానవునిఁగాఁ దలంపసాగిరి.

శ్రీకృష్ణ సందేశము.

కృష్ణుండును సభా భవనంబున బ్రవేశించిన కొంతవడికి, నిజాసనంబునుండి లేచి ధృతరాష్ట్రుని గనుగొని యెల్లరును వినునట్లు "మామా! ధర్మమూర్తియగు ధర్మజుని పంపున నేను మీకడకు రాయబారినై వచ్చియుంటిని. పాండవులు సమయ భంగ మొనర్పక యనుకొనిన ప్రకార మరణ్యాజ్ఞాత వాసంబుల జరిపివచ్చి ప్రస్తుత ముపప్లావ్యంబున నున్న సంగతి యెల్లరకును దెలిసియేయున్నది. ఇదివరకుఁ దెలిసియో తెలియకనో యొనర్చినట్టితప్పులన్నింటినిఁ బ్రస్తుతము మీరైనను వారైనను బరిగణింపవలదు? ఉభయ

వంశములును సర్వశ్రేయంబులఁ బొందియుండు తెఱంగున విచా
రించి నీతమ్ముని కొడుకులైన పాండవులకు న్యాయప్రకారముగా
రావలసిన యర్ధరాజ్యంబు నొసంగుము. ఇందువలన నుభయు
లకు మేలుగలుగును. ఒకవేళ వారికి యర్థరాజ్యంబొసంగక
యుద్ధమునకే సంసిద్ధపడెదవేని "ధర్మోజయతి" యను సూత్రి
మును మాత్రము మఱవకుము. ఎచ్చట ధర్మముండునో యచ్చట
భగవంతుఁడుండును. ఎచ్చట భగవంతుఁడుండునో యచట సర్వ
శుభములు నుండును. నీకుమారు లధర్మపరులగుటవలన నీ
సూత్రము వారియందు సమన్వయింపనేరదు. యుద్ధమే సిద్ధమగు
నేని నీవంశనిర్మూలము సిద్ధమని యెఱుంగుము. పాండవులు
సామాన్యులుగారు. వారు కేవలము దేవతాంశసంభూతులు.
శాంతమూర్తి యగు ధర్మజుఁ డొక్కఁడలిగెనేని సకల భువనంబు
లును భస్మీభూతంబులుగాఁగలవు. పతివ్రతా శిరోమణియగు
ద్రౌపదీదేవి నోటినుండి పరుషవాక్యములు వెలువడినచో, నీ
నూర్గురు కుమారు లొక్కబరి మృతినొందఁగలరు. ఇదియంత
యును దథ్యము. నా హితంబును గైకొనక సంధికొడంబడనిచో
నేఁ జెప్పిన దంతయు జరిగితీరును. ఓమూఢదుర్యోధనా? సావ
ధానుఁడవై వినుము. నీమూలమున నీవంశ క్షయమగు కాలము
దాపరించుచున్నది. ఇప్పటికిని మించిపోలేదు. మదీయ హిత
వాక్యానుసారము పాండవుల కర్ధరాజ్యంబు నొసంగి వారితో
స్నేహభావమున మెలంగుము. భీష్మద్రోణకర్ణాశ్వత్థాములుండిరి

గదాయని యుద్ధమునకు సిద్ధుడవగు చుంటివేమో యదియెంత మాత్రమును దగదు. వేయిమంది కర్ణులున్నను ఒక్కపార్థుని తో సమానులుగాఁజాలరు. ధర్మోజయతి యను సూత్రమెంత మాత్రమును నిరర్థకంబుఁగానేరదు. చక్కగా విచారించుకొను" మని తెలియఁబలికి తన యాసనంబధిష్ఠించెను. కృష్ణుని హిత ప్రబోధనమునకు భీష్మ ద్రోణ కృపాశ్వత్థామ విదురాదులెంత యనుసంతసించిరి. కానిదుర్యోధనుశకది వినుటకుఁగూడ హేయ ముగాఁ దోచెను. అందువలన నచ్చోట నుండజాలక శకుని కర్ణదుశ్శాసనాదులతోఁ గలసి సభనుండి లేచిపోయెను.

కృష్ణునిహితప్రబోధమునకుధృతరాష్ట్రుఁడేమిచెప్పునోవింద మని సభికులెల్లరును నిశ్శబ్దముగా నుండిరి. కాని దృతరాష్ట్రుఁ డేమియు బదులుసెప్పక మౌనముపహించి యుండెను. అట్టి యెడ సభనుండి లేచిపోయిన దుర్యోధనాదులు శ్రీకృష్ణ పర మాత్మను బంధింప వలయునని ప్రయత్నించు చుండిరి. ఆసమ యమునఁ గృష్ణునికనిష్ఠసోదరుండగు సాత్యకి కౌరవుల దురా భిప్రాయమును గుర్తించి సభికులెల్లరు వినునట్లు కృష్ణునితో 'అగ్రజా! నిన్నుబంధించుటకు దుర్యోధనా దులు ప్రయత్నించుచున్నారు. ఆజ్ఞయయ్యె నేని వారల నిప్పుడే మదీయ నిశితకరవాలం బున కేరజేసెద' నని పలికెను. ఆమాటలకు భీష్మద్రోణాదులు

శ్రీకృష్ణుఁడు విశ్వరూపంబును దాల్చుట.

విహ్వారపడిరి. 'కౌరవవంశ క్షయకాలము సమీపించుచున్న దని సభికులందరును దలంపసాగిరి. అట్టియెడ శ్రీకృష్ణుం డాస నంబునుండి లేచి సభికులారా! వింటిరిగదా? దుర్మార్గ ప్రవర్త నుడగు సుయోధనుఁడు నన్ను బంధింపఁదలచి యత్నించు చుండెనట. కానిమ్ము, ఓ మూఢదుర్యోధనా? సకలమానవ బంధవిముక్తుండనగు నన్నే బంధింపఁ దలంచితివా? కౌరవ వినాశకాలమిప్పుడే డగ్గఱించుచున్నది. రమ్ము. ఇదో చేత నగునేని నన్నుబంధింపు' మని విశ్వరూపంబునుదాల్చెను. ఆ విశ్వరూపంబున నష్టదిక్పాలకులును, బ్రహ్మ రుద్రేంద్రాదు లును, సకలఋషీశ్వరులును, భీష్మద్రోణాది కౌరవులునుబంచ పాండవులును, వేయేల, పంచభూతాత్మకంబైన విశ్వంబంతయుఁ గానుపించుచుండెను. అట్టి విశ్వరూపంబును గాంచి భీష్మ ద్రోణాదులు పులకాంకిత గాత్రులై శ్రీకృష్ణభగవానునిఁ గీర్తింపఁ దొడంగిరి. సభయంతయు జయధ్వానములతో నిండిపోయెను. ప్రకృతియంతయు నానందరస కల్లోల సము ద్రంబున మునింగి యుండెను. ఎచ్చోట నాలకించినను "ఓం, ఓం, ఓం, ఓం" అను ప్రణవ మంత్రధ్వనులు విన వచ్చుచుండెను. అట్టియెడ ధృతరాష్ట్రుండును హరికృపా లబ్ధదృష్టివలన నామహాత్ముని విశ్వాకారమునుగాంచి, తిరిగి యంధత్వము నొందిన వాఁడై యా యనంతాకారునితో 'మహాత్మా! విశ్వరూపంబు నుపసంహరింపుము. వినాశకాలము

దాపరించుచున్నపుడు నీవుమాత్రమేమి చేయఁగలవు? నావంశ క్షయమగునని నాకుఁ జక్కఁగాఁ దెలియును. ఇంక నీ వరిగి యుద్ధప్రయత్నమున నుండు' మని చెప్పెను. కృష్ణుఁడును ధృతరాష్ట్రుని వాక్యానుసారము తన విశ్వరూపంబు నుపసంహరించి, దుర్యోధనాదు లవనతవదనులై తన్నుఁ జూచుచుండ, భీష్మద్రోణవిదురాదులు తన వెంటనడువ, సభాభవనముఁనువీడి యందఱివలన వీడుకోలువడసి పాండవులవద్దకరిగెను. నాట నుండి యుభయపక్షములవారును యుద్ధప్రయత్నముల సేయం దొడంగిరి.

కౌరవులును బాండవులును రాబోవు మహాయుద్ధంబునకు సన్నద్ధులగుచుండఁ గృష్ణుండెట్లు బాండవులపక్ష మవలంబించుననియుఁ దాను ద్వారకయందే నిలచియున్న నిజ శిష్యుండగు దుర్యోధనునకుఁ దోడుగా నరుగవలసివచ్చునేమో యనియు, నుభయులు దనకుఁ గావలసిన వారగుటవలన నెవ్వరిపక్షము నవలంబింపఁ గూడదనియుఁ దలంచి బలరాముండు తీర్థయాత్రానెపంబున ద్వారకానగరంబును విడిచి పుణ్యతీర్థంబుల సేవింప నరిగెను. అట్లరుగుచు నెడనెడ ననేక పుణ్యతీర్థంబుల యందవగాహన మొనర్చుచు దేవర్షి పితృ తర్పణ బ్రాహ్మణ సంతర్పణంబుల నాచరించుచుఁ దుదకు నైమిశారణ్యంబునుఁ జొచ్చెను.

బలరాముఁడు సూతునిఁ జంపితిరిగి బ్రతికించుట.

అప్పుడచ్చటనున్న మునులందఱును దమతపః

యాసనంబులనుండి డిగ్గి పూజించియుండ, సూతుండు మాత్రము నిజాసనంబునుండి లేవక, ప్రత్యుత్థాన నమస్కార విధుల నడపక యుండుటవలన బలభద్రుం డతనియెడఁ గినుక వహించి, సూతుని దురాభిమాని యనియు, విద్యాగర్వంబున నోడలెఱుంగక యున్నవాఁడనియు నెదభావించి, దుష్టజన శిక్షణార్థం బవతరించిన తన యట్టివాని కాతనియెడ నుపేక్ష సేయుట పాడిగాదని హస్తంబుననున్న కుశాగ్రంబునే యాయుధంబుగాఁగొని యాతనివధించెను. అప్పుడచ్చటనున్న మునులందఱునుహాహారవంబులతో డనాతనిఁజూచి 'మహాత్మా! మేమీతనికి బ్రహ్మాసన మిచ్చియుండుటవలన నీరాక నెఱిం గియు నాసనంబునుండి దిగుట యధర్మంబు గావున నటు సేయకుండె. సర్వజ్ఞుండవగు నీవును యుక్తాయుక్తంబుల విచా రింపక యీతనిని వధించి బ్రహ్మహత్యాదురితంబు నందితివి. కావునఁ బ్రాయశ్చిత్తంబుఁ గైకొనుము. నీవే ధర్మంబుదప్పిన నింక భూమిపై ధర్మమునకుఁ దావుండునా?' యని యనేకవిధ ములఁబలుక బలరాముండును దామసఁబునఁ దానొనర్చినపనికిఁ జింతించి, మైననేమాయెనని తన యోగమాయా ప్రభా వంబువలనఁ దిరిగి సూతునిఁ బునర్జీవితునిఁగా నొనర్చెను. మునులందఱు నాతఁడొనర్చిన పనికి సంతోషించి యతని పాపంబు దొలంగెనని వచించిరి. అట్టిమేలు దనకుఁ గూర్చి నందులకు మునులయెడ నాతండు గరుణవహించి "మును

లారా! నన్ను బ్రహ్మహత్యాదోషంబునుండి విముక్తునిఁగాఁ జేసి కాపాడితిరి. ఇట్టిమేలుఁగూర్చిన మీకు నేనును మేలు సేయనున్నాఁడ. ఏమివలయునో తెల్పుఁ" డని పలుక వారంద బలరాముఁడు పల్వ ఱేక గ్రీవముగా "మహాత్మా! ఇల్వలునిపుత్రుం లుండనురక్కసుని డగు పల్వలుండను రక్కసిఱేఁడు మా సవన సంహారించుట. వాటికలను బాడుసేయుచు మమ్మనేకవిధముల బాధించుచున్నవాఁడు. వానినింబట్టి వధించి మాకు మేలొనఁ గూర్పు" మని యాతనితో విన్నవించిరి. బలదేవుండును దనకు దుష్టశిక్షణం బవశ్యకర్తవ్యంబు గావున స్మృతి మాత్రంబున నిజాయుధంబులఁ బడసినవాఁడై తత్ప్రాంతార ణ్యంబుననున్న పల్వలునిగుహాకరిగి వానినెదిర్చి వినోదార్థంబు గాఁ గొంతకాలము రణమొనర్చి, తుదకుఁ దనహలాయుధం బున నాతనిని రెండుగాఁజీల్చివైచి మునిగణంబుల సంతోష పెట్టినవాఁడై తాను యథేచ్ఛం జనియెను.

కురుక్షేత్రమునఁ గురుపాండవబలంబులు యుద్ధంబు నకు సన్నద్ధంబులై యుండెను. కృష్ణుండు యుద్ధంబున జోక్యంబు గలిగించుకొనక పార్థునకు సారథ్యంబుమాత్రంబు నెరుపుట కంగీకరించి పాండవ పక్షంబు నవలంబించెను. యుద్ధము ప్రారంభమయ్యెను. కురుబలంబులకు భీష్ముండు నాయక త్వము వహించెను. పాండవ బలంబులకు దృష్టద్యుమ్నుం

డాధిపత్యమునుగైకొనెను. అట్టియెడ యుద్ధము ప్రారంభమైన
దని యనుటయేగాని యర్జునుండు మాత్రము, తాను రాజ్య
భోగానుభవంబునకై, పిన్ననాటనుండి తన్నుఁబెంచి పెద్దవానిఁ
గాఁజేసిన భీష్ముని, విద్యాబుద్ధులఁ గఱపి తన్నంతవానిఁగా
నొనర్చిన ద్రోణుని, మరియుఁ దనకుఁ గావలసిన స్వబంధు
లను, గరుణావిహీనుఁడై, జంపఁ జాలనని కృష్ణునకుఁ దెలియఁ
జేయుచు, విరక్తిభావమును వహించి విల్లునమ్ములను విడచి
శ్రీకృష్ణుడు పార్థ చింతానిమగ్నుఁడయ్యెను. అప్పుడు సకల
నకు భగవద్గీతోప విషయ రహస్యవేత్తయగు శ్రీకృష్ణుం డాతనిఁ
దేశంబునొనర్చుటఁ జూచి, పార్థా! శోకమోహములకిది యదను
గాదు. నీవు క్షత్రియుండవు. క్షత్రియులకు ధర్మశాస్త్రో
క్తమైన యుద్ధంబుకన్న నితరమగు ధర్మమేదియును లేదు.
అట్టియెడ నీవు కులధర్మము నెంతమాత్రము నతిక్రమింపఁ
గూడదు. కావున నీకన్నివిధముల యుద్ధమొనర్చుటయే
ధర్మమగుచున్నది. వెండియు రాజులకు యుద్ధమే స్వర్గ
సమానము. అట్టి యుద్ధమును నేరాజులు పొందుచున్నారో
యట్టివారు స్వర్గసుఖ భోగానుభవులగుచున్నారు. అర్జునా!
ధర్మతత్వంబును దెలిపెద వినుము. ఎప్పటికైనను దేహములు
నశించును గాని వానియందుండునట్టి యాత్మ నశింపనేరదు.
ఈయాత్మను 'నేను జంపుచున్నా' నని తలంచువాఁడును,
'నావలనఁ జంపఁబడు' నని భావించువాఁడును, కేవల మజా

నుండగుచున్నాఁడు. అన్నింటి యందును సద్రూపముగా నుండునట్టి యీయాత్మకు, నాశమునొందుట, మాఱురూప మును బొందుట, పుట్టుట, పెరుగుట, క్షీణించుట యనునవి యెంతమాత్రమును లేవు. ఎల్లప్పుడీయాత్మ యొకే స్వరూప మున నిలిచియుండును. పంచభూతంబులీయాత్మను బాధింపఁ జాలవు. ఆత్మ నిత్యుండు—అవ్యయుండు—వికార రహి తుండు—శుద్ధుండు — ఒక్కండు — వాగగోచరుండు— అచ్యుతుండు. కావుననే పాంచభౌతికంబులగు దేహంబులు నశించుచున్నను, నీయాత్మ నశించుటలేదు. సుస్థిరుండగుట వలననే, యొకదేహమును విడిచి మఱియొకదేహమును బ్రవే శింపఁగలుగుచున్నాఁడు. పార్థా! ఒకఁడొకనిచేత నింకొకనిఁ జంపించుచున్నాఁడనియు, నొకఁడు మఱియొకనిఁ జంపుచున్నాఁ డనియుఁ జెప్పుట కెంతమాత్రమును వీలులేదు. చంపుటకును జంపించుటకును దేహి స్వతంత్రుఁడు గానేరఁడు. నామూల మున భీష్మాదులందరును జంపఁబడుచున్నారుగదా! యని నీవెంత మాత్రమును జింతింపవలదు. చంపువాఁడవును, జం పించువాఁడవును నీవు గానేరవు. నీవు కేవలము నిమిత్త మాత్రుఁడవు. కావున యుద్ధమునకుఁ గడంగుము. ఇదిగో! సర్వమును దిలకింపు మని తత్త్వోపదేశానంతరము దివ్య దృష్టి నొసంగెను. అర్జునుఁడు దివ్యదృష్టితోఁ దిలకించి నం తనే, కురుబలంబంతయు యమభటులమూలంబునఁ బ్రాణం

బులఁ గోలుపోవుచుండెను. అంతఁ బార్థుఁడు సర్వమును గ్రహించినవాఁడై, యుద్ధమునకుఁ గడంగెను.

కురుక్షేత్ర సంగ్రామము.

కురుక్షేత్ర సంగ్రామంబు సుమారు పదునెనిమిది దినములవఱకు జరిగెను. యుద్ధము సమాప్తినొందునప్పటికిఁ గురువంశంబంతయును, పాండవుల బలంబు లన్నియును నశించెను. తుదకు పాండవులు మాత్రము మిగిలిరి. అట్టియెడ ద్రోణుని పుత్త్రుఁడగు నశ్వత్థామ కౌరవబలంబులోని వాఁడగుటవలనఁ దన తండ్రి చావునకును, దుర్యోధనాది కౌరవ వినాశంబు కొఱకును మిగుల దుఃఖించి పాండవులయెడఁ గినుకవహించినవాఁడై "అపాండవమగుఁగాక" యని నారాయణాస్త్రమును బ్రయోగించెను.

శ్రీకృష్ణుఁడుత్తర గర్భంబునకుఁ బ్రాణదాన మొసంగుట.

ఆయస్త్రజ్వాలలవలన నుత్తర గర్భంబులోని పిండము గూడ మృతినొందెను. అప్పుడు కృష్ణుఁడా యస్త్రంబు బారినుండి పాండవుల రక్షించి యుత్తర గర్భస్థమగు పిండమునకుఁ బ్రాణదానం బొసంగెను. ఇట్లు పాండవుల రక్షించి యుద్ధానంతరము ధర్మరాజునకుఁ బట్టాభిషేక మొనర్చెను. ధర్మజుండును ధర్మంబు దప్పక రాజ్యపరిపాలనంబు సేయఁదొడంగెను. కృష్ణుఁడు వారికిఁ దోడుగా నుండెను.

ఉపసంహారము.

ధర్మరాజు ధర్మంబును దప్పక రాజ్య పరిపాలనం బొనర్చుచుండ హస్తినాపురంబునఁ గల యొక బ్రాహ్మణునకుఁ బుట్టినవారు పుట్టినట్లే కుమారులందఱును గతించుచుండిరి. ఆ బ్రాహ్మణుండును బుత్రశోకంబును భరింపఁజాలక రాజ మందిరంబును దరియంజని 'ఓధర్మరాజా ! నీపరిపాలనంబున నధర్మంబు నిలిచియుండుటఁ జేసి నాపుత్రులందఱును మరణించుచున్నారు. ఇట్టి యధర్మయుక్తంబైన నీపరిపాలనం బేల కాల్పనా?' యని యనేకవిధంబుల వాపోవఁదొడంగెను. అట్టి

అర్జునుఁడు విప్ర యెడ సర్జునుం డాతనికడ కరిగి వృత్తాంతంబం
కుమారులఁ దెత్తు
నని ప్రతిజ్ఞ తయు నాతనివలన నెఱింగి యా విప్రకుమా
వట్టుట. రుల చాఁ దెత్తుననియు నింక ముందు గలుగు

పాపలను మృత్యువాతఁ బడకుండ రక్షింతుననియు, నట్లొనర్పకున్న ననలంబునఁబడి కాయంబు దొఱఁగువాఁడననియుఁ బ్రతిజ్ఞ నట్టి యాతనికి దుఃఖోపశమనంబు గావించెను. ఇట్లుండఁ గొన్నినాళ్ళ కావిప్రుని భార్యకు నీళ్ళాడు ప్రొద్దులురాఁగా, నర్జునుం డెఱింగి, సూతికామందిరంబుచుట్టును బాణంబులఁ బ్రయోగించి తుదకుఁ జీమగూడఁ బ్రవేశింపఁజాలనట్లొనర్చి తా నప్రమత్తుఁడైయుండెను. కాని పుట్టిన శిశువు పుట్టినట్లే చనిపోవ విప్రుం డర్జునుని నిరర్థకప్రతిజ్ఞను గలవానిఁగా దల

పోసి మురహరునికడ కరిగి పుత్రరత్న మొనర్పవలసినదని యా మహానీయు ననేకవిధంబులఁ బ్రార్థించెను. ఇచ్చోట నర్జునుండును బ్రతిజ్ఞాభంగమునకు విచారించుచు నస్త్రబలంబువలన యమసదనంబున కరిగి యచ్చోట విప్రకుమారులఁ గానక యెల్లచోట్లను వెదకినవాఁడై తుదకుఁ దానాడిన మాటను నిలుపుకొనఁజాలక, యగ్నిఁ బ్రవేశింపనుండెను. అట్టియెడఁ గృష్ణుండు విప్రునితోఁ గలసి యర్జునుని చెంత కరుగుదెంచి యతనికిఁ దాను విప్రకుమారులను జూపెదననియు నగ్నియందుఁ బడవలదనియుఁ దెలియఁ బలికి విప్రునకు ధైర్యంబు

శ్రీకృష్ణుఁడు విప్రకుమారులఁదెచ్చి యర్జునుని ప్రతిజను నిల్పుట.

జెప్పి యప్పుడే యర్జునునితో శ్రీకృష్ణుఁడు విప్రకుమారాన్వేషణార్థమై యరిగెను. కృష్ణుండు సర్వజ్ఞుఁడుగావున దుర్గవనజానపదాచల పక్కణాప్రభూతనదనదీసరోవరయుతక్షితి నంతయుదాటి, సప్తసముద్రంబులను, గులగిరిప్రకరంబును నుత్తరించి మేరునగంబు నతిక్రమించి, యమలోకంబును, భూరినీరంధ్ర నిబిడాంధకార ప్రయుక్తంబునునగు ప్రదేశంబును జొచ్చి, నిజచక్రాయుధ ప్రకాశంబువలన మార్గంబును గాంచుచుఁ జనిచని పెంజీకటి కవ్వల సకలమునిగణసమేతుండై భోగీంద్రభోగతల్పంబున శయనించి యున్న యాదివిష్ణుమూర్తిని సందర్శించి, యనేక విధంబులఁ బ్రార్థించెను. అంత నయ్యాదిదేవుండును గృష్ణార్జునులం గని,

"మహాత్ములారా! మీరు నాయంశమున ధర్మ సంస్థాపనార్థమై నరనారాయణులన జనించియున్న వారగుటవలన, నట్టిమిమ్మును జూడవలయునని యీమునీంద్రులు నన్నర్థింప విప్రకుమార వ్యాపంబున మిమ్మిచ్చటికి రప్పించితిని. నీచెలికాఁడగు నరుని ప్రతిజ్ఞవృథకాఁగూడదు. కావున నీ విప్రకుమారులఁ దోడ్కొని పొమ్ము. శుభంబయ్యెడు" నని పలికి, విప్రకుమారుల నొసంగ గృష్ణార్జునులు సముదితస్వాంతులై, యయ్యాదిదేవుని కృపావిశే షంబునకు మెచ్చుకొనుచు నటనుండి బయలుదేరి దీర్ఘప్రయా ణంబుల నొనర్చి, హస్తినాపురంబు బ్రవేశించి యావిప్రునకు మృతులైన యాతనికుమారుల నందఱ నొసంగిరి. కృష్ణుండును దనమిత్రునకుఁ బ్రతిజ్ఞాభంగంబు గాకుండ నవ్విధంబునఁ గాపా డినవాఁడై పాండవుల వీడుకోలును వడసి ద్వారకా నగరంబున కరిగెను.

శ్రీకృష్ణుండు ద్వారకానగరంబును బ్రవేశించిన కొన్ని నాళ్ళకు యదువంశక్షయంబునకుఁ దుర్నిమిత్తంబులు గోచరం బులుగాఁజొచ్చెను. నారదాది మహామునీంద్రు లందఱును శ్రీకృష్ణుని నవతారంబు చాలించి వైకుంఠమునకు రమ్మని ప్రార్థింపఁదొడఁగిరి. అట్టియెడ నొకనాఁడు కొందఱు మునీం ద్రులు శ్రీకృష్ణ సందర్శనంబొనర్చి ద్వారకానగర రాజమార్గం బున నరుగుచుండ యాదవులు గొందఱొక్కచో గుంపుగట్టి,

తమలోనొక్కనికి స్త్రీవేషంబునమర్చి, యరుగుచున్న మునులఁ గాంచి 'మహాత్ములారా! ఈకాంత కేమికలుగునో వచింపుఁ' డని యపహాస్యంబుగాఁ బలుక వారును దివ్యదృష్టివలన సర్వంబు నెఱింగి వారియెడఁ గినుకవహించి, యాకాంతకొక ముసలంబు పుట్టునసియు, దానివలన యదువంశ క్షయమగు ననియు వచించి వెడలిపోయిరి. మునుల వచన ప్రకారము గొన్నినాళ్ళకు స్త్రీవేషధారియగు నాపురుషునకు ముసలంబు పుట్ట యాదవులు భయమంది యాముసలంబునంతయు నఱగఁ దీసి సముద్రంబునఁ గలిపిరి. కాని తద్గంధలిప్తంబులగు తరంగంబులు పుడమిఁదాకుటవలన సముద్రతీరంబున నది యంతయుఁ దుంగగా నంకురించి నానాటికభివృద్ధినొందెను. ఇట్లుండ యాదవులందఱొకనాఁడు మదిరాపాన మత్తులై సముద్రతీరంబును జేరి యకారణంబుగ నంతఃకలహంబును

యదువంశ క్షయము.

బెంచికొని, యచ్చట దట్టముగాఁ బెరిగియున్న తుంగ బొటికలతో నొకరినొకరు మోదుకొనుచు, ఘోరంబుగఁ బోరుసల్పి తుదకందఱును ప్రాణంబులువాసిరి, మునుల వచనంబు లివ్విధంబున సార్థకంబులయ్యెను.

ఇట్లు యాదవులందఱును మడిసిన యనంతరము బలరాముండు తన యవతారంబు సమాప్తినొందెనని యెఱింగి

శ్రీకృష్ణుని యనుమతిని ద్వారకాపురంబును నిర్గమించి చని చని యోగ మార్గంబున దేహంబును జాలించి యనంతునిఁగలసెను. అప్పుడు వైకుంఠంబునఁ గలవారందఱును మిగుల సంతోషంబు నంది శ్రీకృష్ణునిరాకకై ప్రార్థింపఁ దొడంగిరి. జగదభిరాముండగు రాముండివ్విధంబునఁ దనయవతారంబును జాలించి యదువంశ చారిత్రపత్రంబులనుండి విడివడిపోయెను.

బలరాముం డవతారంబునుజాలించుట.

యాదవులు నశించుటయు, బలరాముం డవతారంబును జాలించుటయు, నారదాదిమునీంద్రులు వైకుంఠంబునఁ దనకై వేచియుండుటయు, దనయవతారంబు సమాప్తియగు కాలంబు సమీపించియుండుటయుఁ దెలిసికొని శ్రీకృష్ణుండుద్ధవునిఁ జేరం బిలిచి "ఉద్ధవా! బ్రహ్మాదిదేవతా ప్రార్థనంబునఁజేసి యిట్టవతారంబునుదాల్చి ధాత్రీభారంబును దొలంగించితిని. నేటితో నాయవతారంబు సమాప్తినొందఁగలదు. నేటికి సప్తమ దివసంబున సముద్రిండు ద్వారకాపురంబును ముంపఁగలఁడు. కావున నీలోకమనే యందున్న స్త్రీవృద్ధ బాలాదులను హస్తి పురికిఁ జేర్పవలసినదని నాయాజ్ఞఁగాఁ బార్థునకుఁ దెల్పుము. ఇంతటనుండి, కలియుగంబు సంప్రాప్తంబుఁగాఁ గలదు. అట్టి కలియుగంబున మానవులందఱును దుష్టప్రవర్తనములఁ దగిలి, యధర్మ

శ్రీకృష్ణుండుద్ధవునకుఁబరమార్థంబు నకుఁపదేశించుట.

పరులై యకాల మరణంబులకు లోనగుచుందురు. అధర్మంబు మూడుపాళ్ళు నడచుచుండును. మఱియు మానవులందఱును ధర్మవిరహితులు, నాచారవిహీనులు, నన్యాయపరులు, నతి రోషులు, మందమతులు, నల్పతరాయువులు, బహురోగ పీడితులు, నిష్ఫలారంభులు, నాస్తికులునై యొండొరుల మెచ్చక యుందురు. కావున నీవు సుహృద్బాంధవ స్నేహంబు వర్జించి యింద్రియ వికారంబులకు లోనుగాక యెల్లప్పుడు హరినామ స్మరణంబొనర్చుచు జన్మరాహిత్యంబు నొందుము. ఇంకను వినుము. మానవులు గృహస్థులై యున్నను, రాగాది విషయంబులందుఁ దమచిత్తంబులఁ జొప్పింపక, సంసారంబున నుండియు, సంసార బంధంబులకు దూరస్థులగుచు నిరంతర ధ్యానగరిష్ఠులై యగ్రాహ్యుండనగునన్ను సత్వగుణ గ్రాహ్యునిఁగా నెఱింగి, హృత్పద్మంబుల జీవాత్మ పరమాత్మల భిన్నంబుగాఁ దలంపక, యేకంబుగాఁ బరిగణించి, శంఖచక్ర గదా ఖడ్గ శార్ఙ్గ కౌమోదకీ కౌస్తుభాభరణ యుక్తుండనగు నన్నే సర్వంబునకు మూలంబని భజించిరేని జన్మరాహిత్యంబు నొందఁగలరు. నీవింక నేగుము. నేటితో నేనీయవతారంబును జాలించి వైకుంఠంబున కరిగెద'నని తెలియఁబలికి పరమార్థ జ్ఞానోపదేశంబు నొనర్చిన నుద్ధవుండును సంతోష దుఃఖం

బులు హృదయంబున మల్లడిఁగొన మాఱుమాట వలుక నేరక శ్రీకృష్ణుని యాజ్ఞను శిరసావహించి వెడలిపోయెను.

ఉద్ధవుండరిగిన యనంతరము శ్రీకృష్ణుండును, నిజపురంబును విడనాడి యొందేనిఁ జని యొక్క నికుంజపుంజంబు చాటున విశ్రమించి చరణంబు వేఱొక చరణంబుమీఁద నిలిపి వినోదంబు సలుపుచుండెను. అట్టియెడ మృగయుఁ డొక్కరుండా ప్రదేశంబునకుఁ జనుదెంచి, వినోదంబుగా నటునిటుఁ గదలి యాడుచున్న శ్రీహరి చరణంబును హరిణకర్ణంబుగా, హృదయంబున భావించి బాణప్రయోగ మొనర్చెను. ఆ వ్రేటునకుఁ గృష్ణుండు హాహారవంబొనర్ప మృగయుండును దదారవంబు నాలించి మానవునిఁగాఁ దలపోసి, యప్పరమేశ్వరుని డాయంజని తానొనర్చిన యపరాధంబునకుఁ జింతించుచు నామహాత్ము ననేకవిధంబుల క్షమాపణంబును వేడి, యామహనీయుఁడు దన్నుక్షమించినను దృప్తినొందక వైష్ణవాపరాధంబునకు క్షమాపణంబు లేదను భావంబున శ్రీహరిం దలంచుచుఁ బ్రాణంబులఁ బాసి యపవర్గ ప్రాప్తినొందెను. అంతఁ

శ్రీకృష్ణావతార పరిసమాప్తము.

గృష్ణుఁడును దనకై విలపించుచున్న దారుకుని గనుంగొని, తాను దేహంబు సాలించిన వృత్తాంతమును బాండవాక్రూర సాత్యకిప్రముఖులందఱికిఁ దెలియఁజేయుమని పలికినవాఁడై యోగమా

ర్గంబున దేహంబును జాలించెను. అట్టియెడ నభోభాగంబున జయశబ్దంబు లొక్కపెట్టునఁ జెలరేగెను. శతకోటి సూర్య దివ్యతేజోవిభాసితంబగు విమానంబొండు సనుదేరఁ గృష్ణుండును, బ్రహ్మరుద్రేంద్రాది దేవతలందఱును దన్నుఁ గీర్తించుచుండఁ గదలి వైకుంఠంబున కరిగెను. పుడమియంతయుఁ బూలవానలతో నిండిపోయెను. చల్లనిమలయపవనంబులతోఁ బ్రకృతియంతయు హృదయానందకరంబుగనుండెను. విశ్వము విశ్వరూపునిలో లీనమయ్యెను.

స ం పూ ర్ణ ము .